ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 28.06.2026 | సంపుటి : 12 | సంచిక : 339 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV



## నేడే పల్స్ పోలియో

**కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం పల్స్ పోలియో నిర్వహించనున్నారు. అయిదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

మిగతా 2లో..



**ఇల్లు అప్పగింత ఆలస్యమైతే..**

## పరిహారం కోరవచ్చు

**సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఫ్లాట్ కొనుగోలు చేసిన తర్వాత కూడా ఆలస్యానికి పరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని సుప్రీం కోర్టు

మిగతా 9లో..

# నో.. నెవర్

**వీబీ జీ రామ్‌జీని ఒప్పుకోం**

**అవసరమైతే సుప్రీం కెళ్లి న్యాయపోరాటం చేస్తాం**

- అవసరమైతే ప్రత్యేక రాష్ట్ర ఉపాధి హామీ పథకం తీసుకొస్తాం
- దీనిపై జులై 2న మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం
- ఈ అంశంపై కర్ణాటక, కేరళం ముఖ్యమంత్రులను సంప్రదించి ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణ ఖరారు
- పథకంపై కేబినెట్ సబ్‌కమిటీ భేటి సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** వీబీ–జీ రామ్ జీ చట్టాన్ని యథాతథంగా అంగీకరించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేరళం, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశం ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. రైతులు, వ్యవసాయ కూలీలకు నష్టం చేసే ఈ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం తలవంచేది లేదని, అవసరమైతే ప్రత్యేక రాష్ట్ర ఉపాధి హామీ పథకం తీసుకొస్తామని స్పష్టం చేశారు. జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. వీబీ–జీ రామ్‌జీ చట్టంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ ప్రజాసంఘాల ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమైంది. మంత్రి సీతక్క సమావేశానికి హాజరుకాగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న వీబీ–జీ రామ్ జీ చట్టం సమాఖ్య స్ఫూర్తిపై జరుగుతున్న ప్రత్యక్ష దాడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని మంత్రి ఆరోపించారు. కర్ణాటక, కేరళం

మిగతా 2లో..

## ములుగు ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

- రామప్ప- లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు భూసేకరణ చేపట్టాలి
- పొట్లాపూర్ ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలి
- తెలంగాణ క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు

2లో..

## ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న తెలంగాణ రైజింగ్

TELANGANA RISING

**నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు: సీఎం రేవంత్**



**హైదరాబాద్,జూన్ 27 (జనంసాక్షి):** తమ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. అలాగే ఫాక్స్‌కాన్ సంస్థకు

మిగతా 2లో..



## నేడు నల్గొండ జిల్లాలో సీఎం పర్యటన

హ్యామ్ రోడ్లకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

2లో..

## పుంజుకుంటున్న నైరుతి

- చురుగ్గా కదులుతున్న రుతుపవనాలు
- వాతావరణ శాఖ వెల్లడి

**హైదరాబాద్,జూన్ 27 (జనంసాక్షి):** నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత

మిగతా 2లో..



## 'సర్'ను సీరియస్‌గా తీసుకోవాలి



- అర్హుల ఓట్లు తొలగించకుండా చూసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**రంగారెడ్డి,జూన్ 27 (జనంసాక్షి):** కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ పార్టీకే మెజారిటీ వస్తదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం,ఎస్ఐఆర్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్ర మాన్ని కార్యకర్తలు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలన్నారు.అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. డిజిటల్ రూపంలో పార్టీ సభ్యత్వ నమోదును పెద్దఎత్తున విజయవంతం చేయండిప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున ప్రత్యేక గుర్తింపు కార్డును ఇస్తామన్నారు. ఈ గుర్తింపు కార్డుతో కార్యకర్తలు ఎక్కడికెళ్లినా గౌరవం లభిస్తదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహేశ్వరంలో బీఆర్ఎస్

మిగతా 2లో..

## 'సర్' సక్రమమే

**ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రక్రియ ఆగదు: కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలో ఎంతో మంది రోహింగ్యాలు అక్రమంగా నివాసం ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారికి ఇక్కడ ఓట్లు, రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని ఆక్షేపించారు. రామ్‌కోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి.. చిన్నారులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు

మిగతా 2లో..

## షరతులు వర్తిస్తాయి

**ఇందిరమ్మ ఇళ్ల శ్లాబు పరిమాణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు**



**హైదరాబాద్(జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల శ్లాబు సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. శ్లాబు 500 నుంచి 750 అడుగులు మాత్రమే ఉండాలని జీవోలో పేర్కొంది. శ్లాబు ముందువైపు 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు

మిగతా 2లో..

## జులై 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం ప్రారంభం

**వారం రోజుల్లో ఆస్పత్రుల యాజమాన్యాలతో ట్రస్టు సభ్యుల సమావేశం**

వార్త 2లో



## అదానీకి చుక్కెదురు

**లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం**

- క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేసేందుకు ఫెడరల్ జడ్జి నిరాకరణ
- ఉపసంహరణ కోసం మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించాలని ఆదేశం




**న్యూయార్క్,జూన్27(జనంసాక్షి):** బిలియనీర్ గౌతమ్ అదానీ పై నమోదైన హై–ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతోపాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేసేందుకు ఫెడరల్ జడ్జి నిరాకరించారు. ఈ కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నారో తెలుపుతూ మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించాలని అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌ను కోర్టు ఆదేశించింది. బ్రూక్లిన్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసును ఉపసంహరించుకోవాలంటూ మే 18న జస్టిస్ డిపార్ట్‌మెంట్ దాఖలు చేసిన పిటిషన్ చాలా క్లుప్తంగా, ఎలాంటి బలమైన కారణాలు లేకుండా ఉందంటూ ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కేసును ఎందుకు డ్రాప్ చేయాలనుకుంటున్నారో సరైన ఆధారాలు, కారణాలతో కూడిన నివేదికను జూలై 13 లోగా కోర్టుకు సమర్పించాలని ప్రాసిక్యూటర్లను

మిగతా 2లో..



**తమిళ నటుడు, దర్శకుడు**

## కె.భాగ్యరాజ్ కన్నుమూత

**చెన్నై(జనంసాక్షి):** చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ (73) కన్నుమూశారు. గుండెపోటుతో ఈ రోజు ఉదయం చెన్నైలో తుది శ్వాస విడిచారు. 75 సినిమాల్లో నటించిన భాగ్యరాజ్ 25 సినిమాలకు దర్శకత్వం వహించారు.కె.భాగ్యరాజ్ పూర్తిపేరు కృష్ణస్వామి భాగ్యరాజ్. 1953లో తమిళనాడులో జన్మించిన ఆయన దర్శకులు జి.రామకృష్ణన్, భారతీరాజాలకు అసిస్టెంట్‌గా కెరీర్‌ను ప్రారంభించారు.

మిగతా 2లో..

## వెనెజువెలా విలయం.. రూ.63వేల కోట్ల నష్టం

**దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విపత్తు..**

**మళ్లీ ఆ దేశంలో కంపించిన భూమి**



**కరాకస్(జనంసాక్షి):** జంట భూకంపాలతో వణికిన వెనెజువెలాలో మరోసారి భూమి కంపించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.9గా నమోదైంది. ఆ దేశ కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రకంపనలు వచ్చాయి. రాజధాని నగరం కారకస్, మరాకే సమీపంలో ఈ ప్రభావం కనిపించడంతో ప్రజలు వణికిపోయారు. మరోవైపు, ఇటీవల సంభవించిన భారీ భూకంపాల కారణంగా ఆ దేశానికి రూ.63వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా.బుధవారం సాయంత్రం 7.2, 7.5 తీవ్రతతో క్షణాల వ్యవధిలో రెండు భూకంపాలు రావడంతో వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వందల భవనాలు కూలిపోవడంతో సహాయకచర్యలు క్లిష్టంగా మారాయి. రెస్క్యూ సిబ్బంది సంఖ్య పరిమితంగా ఉండటంతో.. ఆత్మీయులను కోల్పోయిన వారంతా చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్నారు. ప్రాణాలతో రక్షించడానికి తొలి 48 నుంచి 72 గంటలు కీలకం కావడంతో ఎలాగైనా తమవారిని కాపాడుకోవాలని వారు చేస్తోన్న ప్రయత్నాలతో

మిగతా 9లో..



## ఇరాన్ ఇంకా ఎదురుదాడులు చేయగలదు

- అమెరికా సైనిక చర్య పశ్చిమాసియాలో సుదీర్ఘ ఘర్షణలను నివారించింది
- ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- చర్చల సమయంలోనే అమెరికా మరోసారి మాపై దాడి చేసింది
- శాంతి ఒప్పందం పట్ల నిబద్ధత లేదని ట్రంప్ మరోసారి నిరూపించుకున్నాడు: ఇరాన్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిణామాలపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌కు ఇంకా ఎదురుదాడులు చేసే సామర్థ్యం ఉందని అన్నారు. కానీ, అమెరికా సైనిక చర్య పశ్చిమాసియాలో సుదీర్ఘ ఘర్షణలను నివారించిందని పేర్కొన్నారు."ఇరాన్‌కు ఇంకా సామర్థ్యం ఉంది. అయితే.. అదంత ఎక్కువేం కాదు. వారు విజయం సాధించే స్థితిలో ఏం లేరు. కానీ, ఎదురుదాడులు

మిగతా 2లో..



## హార్మూజ్‌లో మరో ట్యాంకర్‌పై క్షిపణి

## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్

త్వరలో ఖరారు కానున్న ట్రేడ్ డీల్

ప్రకటించిన ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో

2లో..

## ధన్యవాదాలు భారత్..

**హైదరాబాద్‌లో రోడ్డుకు 'డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేసిన ట్రూత్**

## అజిత్ రెడ్డికి అదనపు బాధ్యతలు

- మెట్రో అడిషనల్ ఎండీగా నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

2లో..

**ముగ్గురు ముఖ్యమంత్రుల మధ్య**

## చీకటి ఒప్పందాలు బహిర్గతం చేయండి

**రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్లేలా సీఎం రేవంత్ నిర్ణయాలు : హరీశ్**



**హైదరాబాద్(జనంసాక్షి):** ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
28.06.2026

## నేడు నల్గొండ జిల్లాలో సీఎం పర్యటన

**హ్యామ్ రోడ్లకు ముఖ్యమంత్రి రేవంత్: రెడ్డి శంకుస్థాపన**

నల్లగొండ,జూన్27(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

## ప్రపంచాన్ని ఆకర్శిస్తున్న తెలంగాణ రైజింగ్

చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షిస్తున్నాయని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు పల్స్ పోలియో

రాష్ట్రంలోని నవజాత శిశువులు మొదలుకుని 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా చిన్నారులకూ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జులై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగుతుంది. ఇకపోతే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇప్పటికే ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్కరు కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, , గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని, పోలియో రహిత హోదాను ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు.

## ‘సర్’ను సీరియస్‌గా తీసుకోవాలి

కార్యకర్తల జోష్ చూస్తుంటే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిపోయిన భావన కలుగుతోందని.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయిపోయారని అనిపిస్తోందన్నారు. మహేశ్వరంలో మరోసారి సబితమ్మ గెలుపు తథ్యమని తేలిపోయింది. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలిసేది పక్కా . బ్రహ్మాండంగా బీఆర్ఎస్ గెలిచేది పక్కా.. రాష్ట్రంలో గులాబీ జెండా ఎగిరేది పక్కా తెలంగాణ నలుదిశలా ఒకే నినాదం మారుమోగుతోంది. అదే కాంగ్రెస్ పోవాలె.. కేసీఆర్ రావాలే. రాష్ట్రంలో వికాసం పోయింది.. విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలిందన్నారు. కేసీఆర్ కిట్ పోయింది.. కరెంటు కోతల కాలం వచ్చింది.రైతుబంధు పోయింది.. రాహుల్ బంధు వచ్చింది. రాష్ట్రంలో సంక్షేమ పథకాల పాతర.. కుంభకోణాల జాతర నడుస్తోంది. సీఎంగా రేవంత్ ఉన్నా.. ప్రజలు కేసీఆర్ తలుచుకుంటున్నరని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో ఉద్యమంలో మహేశ్వరం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఓయూ వద్ద రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేశారు. ఎంతోమంది అమరవీరుల త్యాగాల స్ఫూర్తితోనే.. పదేళ్ల పాలన సాగింది. ప్రజాసంక్షేమం.. ప్రగతిపథం.. రెండు జోడెడ్లలా ముందుకు సాగాయి. ఇవాళ బీఆర్ఎస్ ఓడిపోవడం వల్ల ఎవరు నష్టపోయారో ఆలోచించండి. కేసీఆర్‌కు పదవులు కొత్త కాదు. ఎన్నో పదవులను త్యాగం చేశారని.. 50 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కేసీఆర్ సొంతం కేటీఆర్ పేర్కొన్నారు.

## షరతులు వర్తిస్తాయి

జారీ చేశారు. శ్లాబు విస్తీర్ణం పెరగడం వల్ల లబ్ధిదారులకు ఖర్చు పెరుగుతోందని హౌసింగ్ కార్పొరేషన్ తెలిపింది. నిర్మాణ ఖర్చులు పెరగకూడదనే ఉద్దేశంతోనే విస్తీర్ణంపై పరిమితులు విధించినట్లు పేర్కొంది.

## అజిత్ రెడ్డికి అదనపు బాధ్యతలు

హైదరాబాద్(జనంసాక్షి): సీనియర్ ఐఏఎస్ అధికారి అజిత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా కూడా అజిత్ రెడ్డి విధులు నిర్వర్తించనున్నారు. అజిత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ అనంతరం తాజాగా ఆయనకు హైదరాబాద్ మెట్రో రైల్‌లో కీలక అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా.. ప్రస్తుతం హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాతున్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్వహణ, విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు పరిపాలనా వ్యవహారాల్లో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ నియామకం దోహదపడుతోందని ప్రభుత్వం భావిస్తోంది.

### తమిళ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ కన్నుమూత

భారతీరాజా చిత్రాలకు స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేశారు. 1979లో ‘సువరిల్లద చిత్తిరంగల్’ అనే తమిళ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. నటి ఊర్వశి, ఆమె సోదరి కల్పనలను ఇండస్ట్రీకి పరిచయం చేశారు. తమిళ సినిమా ‘16 వెయతినిలె (తెలుగులో పదహారేళ్ల వయసు)’లో తొలిసారి వెండితెరపై కనిపించిన ఆయన.. ఎన్నో చిత్రాలతో అలరించారు. భాగ్యరాజ్ కేవలం నటుడు, దర్శకుడిగానే గాక, కథా రచయితగా, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటారు. 1983లో వచ్చిన ఐకానిక్ చిత్రం ‘ముందనై ముడిచ్చు’ (తెలుగులో ‘మూడు ముళ్లు’) చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు.

# నో నెవర్..

ముఖ్యమంత్రులను సంప్రదించి ఉమ్మడి న్యాయపమైన, రాజకీయ కార్యాచరణ ఖరారు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించినట్లు ఉత్తమ్ వెల్లడించారు.తెలంగాణ రాష్ట్రం సొంతంగా ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 పౌరసంఘాలు సూచించాయని మంత్రి తెలిపారు. అరవై రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రతీ గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు కోరుతున్నాయని తెలిపారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్యం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం



మోపే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు.పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమని మంత్రి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినప్పటికీ, వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని అన్నారు. పంచాయతీ రాజ్ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘ములుగు’ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

హైదరాబాద్(జనంసాక్షి): ములుగు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీరు అందించేలా చర్యలు వేగవంతం చేయాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రామప్పలక్నవరం గ్రావిటీ కెనాల్, పొట్లాపూర్ ప్రాజెక్టుతో పాటు జిల్లాలో కొనసాగుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు న్యాయం చేస్తూనే ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ములుగు నియోజకవర్గ పరిధిలోని నీటిపారుదల శాఖ అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఇరిగేషన్ ఈఎన్‌సీ రమేష్ బాబు, ములుగు ఆర్‌డీవో కృష్ణవేణి, సంబంధిత చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు అవసరమైన భూసేకరణపై అధికారులు సమగ్ర నివేదికను మంత్రులకు సమర్పించారు. కాసిందేవిపేట, ఇంచెర్ల, రామచంద్రాపూర్ గ్రామాల పరిధిలో ఈ ప్రాజెక్టుకు మొత్తం సుమారు 244.23 ఎకరాల భూమి అవసరమవుతుందని తెలిపారు. ఇందులో ఇప్పటివ రకు 201.03 ఎకరాలకు మాత్రమే అవార్డులు జారీ అయినప్పటికీ భూసేకరణ పూర్తికాలేదని వివరించా రు.భూసేకరణకు సంబంధించి 2020-21లో జారీ చేసిన అవార్డుల ప్రకారం ఎకరాకు రూ.2.47 లక్షల నుంచి రూ.8.26 లక్షల వరకు మాత్రమే పరిహారం నిర్ణయించారని, ప్రస్తుతం భూముల మార్కెట్ విలువలు గణనీయంగా పెరగడంతో ఆ ధరలకు రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదని అధికారులు వివరించారు. పాత అవార్డులో నిర్ణయించిన పరిహారం ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రం అనుగుణంగా లేదని, అందువల్ల రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.రైతులు ప్రస్తుత భూముల ధరలకు అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లిస్తే భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారని, అయితే పాత ధరలతో భూసేకరణ కొనసాగించడం వల్ల కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో పాత అవార్డులను ఉపసంహరించి ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా కొత్త భూసేకరణ ప్రక్రియ చేపట్టడమే సరైన మార్గమని అధికారులు అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి సీతక్క రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా భూసేకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. 2020-21లో జారీ చేసిన పాత భూసేక రణ అవార్డును ఉపసంహరించి, తాజా మార్కెట్ విలువల ఆధారంగా కొత్త అంచనాలు రూపొందించి వెంటనే తాజా భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా పారదర్శకంగా భూసేకరణ చేపట్టి, రైతుల విశ్వాసాన్ని పొందుతూ పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచిం చారు.రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొం దించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రామప్ప చెరువు నుంచి లక్నవరం చెరువుకు గ్రావిటీ ద్వారా నీటి తరలింపు సాధ్యమవుతుందని, సుమారు 8,700 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు వివరించారు. అంతేకాకుండా మేడారం మహాజాతర సందర్భంగా తాగునీటి అవసరాలు తీర్చడంలోనూ, లక్నవరం పర్యాటకాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు.అదేవిధంగా పొట్లాపూర్ ప్రాజెక్టు పనులను మరింత ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని, వచ్చే వారంలోనే శంకుస్థాపన జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ములుగు జిల్లాలో కొనసాగుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, ప్రతి ప్రాజెక్టు పురోగతిపై క్రమం తప్పకుండా సమగ్ర నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఈఎన్‌సీకి మంత్రులు ఆదేశించారు.ప్రజలకు మేలు చేసే నిర్ణయాలకే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు న్యాయం చేయడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం రెండూ సమానంగా ప్రభుత్వ బాధ్యతలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## పుంజుకుంటున్న ‘నైరుతి’

ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది. వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం.. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేశారు. వీటితోపాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షసూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీచేసింది. జూలై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. ఇవాళ మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

## జులై 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం ప్రారంభం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన ఉద్యోగుల ఆరోగ్య పథకంపై ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్టు సమావేశమైంది. జులై 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం ప్రారంభించాలని నిర్ణయించింది. వారం రోజుల్లో ఆస్పత్రుల యాజమాన్యాలతో ట్రస్టు సభ్యులు సమావేశం కానున్నారు. అనంతరం నూతన ఈహెచ్ఎస్ నిబంధనలను ట్రస్టు విడుదల చేయనుంది. భార్యాభర్తల్లో ఎవరైనా ఒకరి నుంచి మాత్రమే చందా తీసుకోవాలని ట్రస్టు నిర్ణయించింది. ప్యాకేజీ రేట్లు, ఆస్పత్రుల జాబితాను వచ్చే సమావేశంలో ఖరారు చేయాలని నిర్ణయించారు.

## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్..

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించనున్నారు వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది.అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ - ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ పై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. మోదీ భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మార్చారని కొనియాడారు.

## ధన్యవాదాలు భారత్..

వాషింగ్టన్(జనంసాక్షి): భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని పేరు పెట్టిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఈ విధంగా గౌరవం పొందిన అమెరికా తొలి అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు. ఆ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆవిష్కరించారు.మెరికాకు చెందిన కీలక టెక్ కంపెనీలు అయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు ఈ రోడ్డుకు దగ్గర్లోనే ఉన్నాయి. ఈ పేరు మార్పును తెలంగాణ ప్రభుత్వం భారత్-అమెరికా సంబంధాలకు గుర్తింపుగా, అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో తీసుకున్న ప్రతీకాత్మక నిర్ణయంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ధన్యవాదాలు తెలియజేశారు.

## ‘సర్’ సక్రమమే..

చేసిన ఓపెన్ జిమ్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం భాజపా కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. పాతబస్తీలో బీఎల్‌వోలను మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. 'సర్'పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలకు పాల్పడినా సమగ్ర ఓటరు జాబితా సవరణను అడ్డుకోలేరని కిషన్‌రెడ్డి తేల్చి చెప్పారు.

# ఇరాన్ ఇంకా ఎదురుదాడులు చేయగలదు

చేయగలరనే అనుకుంటున్నా. హర్మూజ్‌లోని ఓ నౌకపైకి వారు నాలుగు డ్రోన్లు పంపించారు. అందులో మూడింటిని కూల్చేశాం. ఒకటి మాత్రం నౌకకు తగిలి కొంత మేర ధ్వంసమైంది" అని ట్రంప్ వెల్లడించారు. నౌకపై టెహ్రాన్ దాడి తెలివితక్కువ పని అని అంతకుముందు అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.తాజా పరిణామాలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఎక్స్ వేదికగా స్పందించారు. “ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగింది. మేం దాన్ని గౌరవిస్తున్నాం. కానీ, ఇరాన్ మాత్రం ఉల్లంఘిస్తోంది. ఒకవేళ ఒప్పందంలో ఏమైనా భేదాభిప్రాయాలు ఉంటే వారు ఫోన్ చేసి మాట్లాడొచ్చు. కానీ ఇలా దాడులకు పాల్పడటం సమంజసం కాదు. హింసకు సమాధానం హింసే అవుతుంది” అని వాన్స్ పరోక్షంగా టెహ్రాన్‌ను హెచ్చరించారు.హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న చాలా ఖరీదైన వాణిజ్య నౌకపై శుక్రవారం ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా యూఎస్ దాడులు చేపట్టింది. హర్మూజ్‌కు సమీపంలోని ఇరాన్ మిలటరీ స్థావరాలు, క్షిపణి-డ్రోన్ల నిల్వ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోను యూఎస్ సెంట్రల్ కమాండ్ విడుదల చేసింది. శాంతి ఒప్పందానికి తామూ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని, దాన్ని అమలు చేసేందుకు అత్యంత అప్రమత్తతతో పనిచేస్తున్నామని అగ్రరాజ్యం స్పష్టం చేసింది.కాగా.. అమెరికా దాడులను ఇరాన్ పార్లమెంట్ నేషనల్ సెక్యూరిటీ కమిషన్ హెడ్ ఇబ్రహీం అజీజీ తీవ్రంగా ఖండించారు. “చర్చల మధ్య అమెరికా మరోసారి మాపై దాడి చేసింది. కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం పట్ల నిబద్ధత లేదని అమెరికా అధ్యక్షుడు మరోసారి నిరూపించుకున్నారు. ఈ నిర్లక్ష్యపు ఉల్లంఘనకు వారు పశ్చాత్తాపం చెందాల్సి వస్తుంది. ఇలాంటి నిందలు ఇకపై పనిచేయవు” అని అగ్రరాజ్యాన్ని హెచ్చరించారు.

## హర్మూజ్‌లో మరో ట్యాంకర్‌పై క్షిపణి దాడి

**టెహ్రాన్(జనంసాక్షి):**అమెరికా-ఇరాన్‌ల ప్రతీకార దాడులతో హర్మూజ్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. తాజాగా జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ ట్యాంకర్‌ను క్షిపణి తాకినట్లు యూకే మిలిటరీ వెల్లడించింది. ఆ నౌకకు నష్టం వాటిల్లినప్పటికీ.. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. అయితే ఆ క్షిపణిని ఎవరు ప్రయోగించారనే విషయంపై స్పష్టత రాలేదు.అమెరికా-ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడంతో హర్మూజ్‌లో ఇటీవల నౌకాయానం తిరిగి ప్రారంభమైంది. కొన్ని నెలలుగా అక్కడే నిలిచిపోయిన అనేక వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. ఈ క్రమంలోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ అమెరికా, ఇరాన్‌లు దాడులను మొదలుపెట్టాయి.

# అదానీకి చుక్కెదురు

ఆదేశించారు. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఆమోదం కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారని, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై 2024లో అమెరికాలో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కేసుపై మరింత సమయం, వనరులను కేటాయించలేమని పేర్కొంటూ కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. జూన్ 24న అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా అధికార పరిధిలోకి రాదని, లంచం ఇచ్చినట్లు నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును అధికారికంగా కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం నుంచి పూర్తి వివరణ కావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ఈ క్రిమినల్ కేసు ప్రక్రియ ఇలా ఉండగా.. దీనికి సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల మేర సివిల్ సెటిల్‌మెంట్ కింద చెల్లించే ప్రతిపాదనలు కోర్టు అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఇవి కాకుండా ఇరాన్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ దిగుమతులకు సంబంధించి అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణల పరిష్కారానికిగాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అమెరికా ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకుంది.

## ముగ్గురు ముఖ్యమంత్రుల మధ్య చీకటి ఒప్పందాలు బహిర్గతం చేయండి

కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్‌డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ అస్సలు ఒప్పుకోదని స్పష్టం చేశారు. గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది బీఆర్ఎస్సేనని చెప్పారు. పాలమూరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతున్నారని, తాగేందుకు మంచి నీళ్లు లేక పాలమూరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చెయ్యడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తి అనిపిస్తోందని ఎద్దేవా చేశారు.

## పుంజుకుంటున్న నైరుతి

హైదరాబాద్,జూన్ 27 (జనంసాక్షి): నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది. వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం.. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేశారు. వీటితోపాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షసూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీచేసింది. జూలై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

# పిడుగుపాటుకు 22 ఆవులు మృత్యువాత



ఎస్ ఎస్ తాడ్వాయి, జూన్ 27(జనంసాక్షి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం అంకంపల్లి గ్రామంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఒక్కసారిగా పిడుగు పడటంతో గ్రామానికి చెందిన రైతు మంకిడి సమ్మయ్య కు చెందిన 22 ఆవులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్ రావు తదితరులు అంకంపల్లి గ్రామాన్ని సందర్శించి, మృతి చెందిన ఆవులను పరిశీలించారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు గారు బాధితుడితో ఫోన్లో మాట్లాడి, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుంటూ వారిని ఓదార్చారు. ఆవులను నమ్ముకుని జీవిస్తున్న పేద రైతు కుటుంబానికి ఇంత పెద్ద నష్టం జరగడంపై స్థానికులు మరియు పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి బాధితునికి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాటి కృష్ణ, ప్రదీప్ రావు, కాటాపురం సర్పంచ్ దిద్ది మోహన్ రావు, బీరెల్లి సర్పంచ్ విజయ, చంద్రం, మాజీ జెడ్పీటిసి పులసం సరోజన పురుషోత్తం, పోదేం క్రిష్ణ ప్రసాద్, మాజీ ఎంపీపీ కోందురి నరేష్, మాజీ ఎంపిటిసి దానక నర్సింహరావు, దిలావర్ ఖాన్ ఉప సర్పంచ్ పాలకుర్తి బాబు, యలవర్తి శ్రీనివాసరావు, వహీద్, రోషయ్య, బేజ్జురి శ్రీకాంత్, రామక్రిష్ణ, గోప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 1.8 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు అరెస్టు



పాలకుర్తి, జూన్ 27(జనంసాక్షి) : నిషేదిత గంజాయిని తరలిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మండల కేంద్రంలోని జరిగింది. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో సీఐ జానకీరాంరెడ్డి వివరాలను వెల్లండించారు. గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను చూపారు. ఎస్సై పవనకుమార్ తో కలిసి సీఐ జానకీరాంరెడ్డి తెలిపిన వివరాల మేరకు .. గుజరాత్ కు చెందిన రియాలేష్ భాయ్ ఒగానియా, సోన్వానే బాబూలాల్ రాంచంద్ర, అలేకర్ సునీల్ భాయ్ పాండురంగ అనే వ్యక్తులు ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి కొనుగోలు చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. తాజాగా ఒడిశా రాష్ట్రం బరంపూరంలోని అమర్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి గుజరాత్ లోని ఖాన్ అక్రమ్ యార్, వాజీద్సజ్జన్లకు సరఫరా చేసేందుకు ముగ్గురు వ్యక్తులు ఒప్పుకొని తెలంగాణ మీదుగా గుజరాత్ కు బయలుదేరారు. రైతులు కాజీపేటలో దిగి అక్కడి నుంచి రైల్వే పోలీసుల కన్నుగప్పి రైల్వే స్టేషన్ నుంచి తప్పించుకొని పాలకుర్తి మీదుగా హైదరాబాద్ కు వెళ్ళుటకు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ లో పోలీసులు తనిఖీ చేస్తుండగా వారి వద్ద నుంచి రూ.90 వేలు విలువ చేసే 1.8 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులను అదపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి బ్యాగులు, 3 సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచేందుకు రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. నిందితులను చాక చక్యంగా పట్టుకున్న ఎస్సై పవన్కుమార్. కానిస్టేబుళ్లు యాకయ్య, ప్రశాంత్రెడ్డి, సురేష్లను సీఐ అభినందించారు.

# హైదరాబాద్ బోట్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక





హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ బోట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా చెన్నాడి సుధాకర్ రావు, అమరేందర్ రెడ్డి 94 సంవత్సరాల చరిత్ర కలిగిన హైదరాబాద్ బోట్ క్లబ్ అధ్యక్షులుగా చెన్నాడి సుధాకర్ రావు, కార్యదర్శిగా టీ. అమరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2026–28 సంవత్సరాలకు గాను ఎన్నికల ఫలితాలను శనివారం ప్రకటించారు. ఎన్నికల్లో ఎవరు నామినేషన్ వేయకపోవడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి ఎస్.బీ. మధుసూదన్ ప్రకటించారు. బోట్ క్లబ్ అధ్యక్షుడిగా చెన్నాడి సుధాకర్ రావు గత 23 సంవత్సరాల కాలంలో అధ్యక్షులుగా 19 సంవత్సరాలు, కార్యదర్శి గా నాలుగు సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్ బోట్ క్లబ్ కార్యవర్గం ఇలా ఉంది. అధ్యక్షులు గా చెన్నాడి సుధాకర్ రావు, ఉపాధ్యక్షులుగా ఏనుగు మురళీధర్ రెడ్డి, కార్యదర్శిగా టీ అమరేందర్ రెడ్డి సంయుక్త కార్యదర్శిగా సీ. ఏ. బీ నరేందర్ రావు, కోశాధికారిగా కె. ధరణిధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఏఎమ్ రాజా, జి కిరణ్ కుమార్, నికుంజ్ అనిల్, శ్రీమతి ఎన్. లిఖిత, పివిఆర్ రెడ్డి, శేషగిరిరావు తుమ్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# జూలై 15నుండి ఉద్యోగుల ఆరోగ్య పథకం

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎంప్లాయీస్ హెల్త్ స్కీం ట్రస్టు బోర్డు సభ్యుల సమావేశం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు సమక్షంలో జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ తరపున పాలకుర్తి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు. జూలై 15 నుండి నూతన ఆరోగ్య పథకం ప్రారంభిస్తామని, వారం రోజుల్లో సమగ్రమైన నిబంధనలు విడుదల చేస్తామని ఈ సందర్భంగా సీఎస్ తెలిపారు. భార్య, భర్తల్లో ఒకరి నుంచి మాత్రమే చందా మినహాయింపు ఉంటుందని, అదనంగా మినహాయించిన మొత్తం తిరిగి చెల్లించడానికి ఉత్తర్వులు ఇస్తారని తెలిపారు. వారం రోజుల్లో హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులతో ఆరోగ్య శాఖ అధికారులు, ట్రస్ట్ సభ్యుల సమావేశం ఉంటుందని, తదుపరి సమావేశంలో ప్యాకేజి రేట్లు, హాస్పిటల్స్ జాబితా ఫైనల్ చేస్తారని తెలిపారు. ఈ పథకంలో చేరదలచుకోలేని వారి నుండి ఆప్షన్ తీసుకుని మినహాయింపులు రద్దు చేయాలని అడిగిన దానికి మాత్రం సియస్ నుండి సమాధానం రాలేదు.

# బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం

- మేకను ఎత్తుకెళ్లిందంటున్న గ్రామస్థులు

నిజామాబాద్, జూన్ 27 (జనంసాక్షి) : జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

# పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

- బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు
- అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 27 (జనంసాక్షి) : ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷సజీల ఆనీఇ-బీప:నిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ ప్రక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## పేదల ఇళ్లు కూల్చివేతపై

# వామపక్షాల కన్నెర్ర

- హనుమకొండలో భారీ నిరసన ప్రదర్శన
- ఉద్రిక్తతల మధ్య ఎమ్మెల్యే కూనంనేని సహా వామపక్ష నేతల అరెస్టు
- విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో పేదల ఇళ్ళ పోరాటం కొనసాగిస్తాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




హనుమకొండ ప్రతినిధి జూన్ 27 (జనం సాక్షి) : పేదల ఇళ్ళ కూల్చివేతపై హనుమకొండ నగరంలో వామపక్షాలు కన్నెర్ర చేశాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పేదల గుడిసెలను ప్రభుత్వం కక్ష గట్టి ఇళ్ళ కూల్చివేతకు పాల్పడటంపై శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ ఆందోళన నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల వామపక్షాల ఆధ్వర్యంలో వేలాదిమందితో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఏకశిలా పార్కు వద్ద ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించిన అనంతరం హనుమకొండ కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితర రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శన ఏకశిలా పార్కు నుండి కాళోజీ సెంటర్ మీదుగా సుబేదారి అమరవీరుల స్థూపం వరకు చేరుకున్నది. అనంతరం అమర వీరుల స్థూపం జంక్షన్ లో వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, వేలాదిగా తరలి వచ్చిన పేదలు బైఠాయించారు. తమకు ఇళ్ళ స్థలాల పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు పేదలను ఉద్దేశించి మాట్లాడుతూ పేదల ఇళ్ళ స్థలాల సాధన పోరాటం పోరాటాల గడ్డ అయిన వరంగల్ నుండే ప్రారంభిస్తున్నామని, ఇది రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ప్రభుత్వం దిగి వచ్చే వరకూ కొనసాగుతుందని అన్నారు. కమ్యూనిస్టులు నిరంతర పేదల పక్షానే నిలబడుతారని, విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో పేదల ఇళ్ళ స్థలాల సాధన పోరాట కొనసాగిస్తామని హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్ల సింగారంలో, గోపాల్ పూర్ లో ప్రభుత్వ భూమి దేనికి ఉపయోగ పడుతుందని పేదల ఇళ్ళు కూల్చి వేశారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడగా సిపిఐ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, షేక్ బాష్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేశ్, ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, మద్దెల ఎల్లేష్, సిపిఎం హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు జి. ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ రంగయ్య, నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, సింగారపు బాబు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## గుట్ట ఇవోగా మరో ఏడాదిపాటు భవానీ శంకర్

- పదవీకాలాన్ని పొడిగించిన ప్రభుత్వం



యాదగిరి గుట్ట, జూన్27 (జనంసాక్షి) : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి భవానీశంకర్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఆయన ఇవోగా ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది. ఇవో పదవీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ పొందుతుండటంతో ఆయన పదవీకాలంలో మరోఏడాది వరకు పొడిగించిన్నట్లు వెల్లడించారు. 2027 జూన్ 30 వరకు ఆయన దేవస్థాన ఈవోగా కొనసాగుతారని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందే వరకు పొందిన వేతనంలో పింఛన్ మినహాయించగా మిగిలిన మొత్తం ఆధారంగా వేతనాన్ని నిర్ణయించిన్నట్లు చెప్పారు. గతంలో గవర్నర్‌కు జాయింట్ సెక్రెటరీగా పని చేసిన భవానీశంకర్‌ను దేవస్థాన ఈవోగా నియమిస్తూ ఈ ఏడాది జనవరి 17న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయగా అదే నెల 29న పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాజాగా మరోసారి ఆయన ఈవో పదవిని పొడిగించారు. సమర్థుడైన అధికారిగా భవానీ శంకరుకు పేరుంది.

# ఉట్నూర్ నుంచి బెంగళూరు వరకు..

- ఉట్నూర్ ఏటీసీ విజయగాథ
- పల్లె యువతకు ప్రపంచస్థాయి భవిష్యత్తు
- అత్యాధునిక శిక్షణతోనే ఎంఎన్సీలలో ఉద్యోగాలు
- సీఎం రేవంత్ మానసపుత్రిక ఏటీసీలకు మహత్తర స్పందన






హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) రాష్ట్ర యువత జీవితాలను మార్చేస్తున్నాయి. నైపుణ్యాలే భవిష్యత్తుకు పునాదనే యోచనతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) సాధించిన విజయం యావత్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందిన యువతకు ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించి, ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఉట్నూర్ ఏటీసీ ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థుల్లో ఏకంగా 99 మంది ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం. తెలంగాణలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు సరైన దిశలో సాగుతున్నాయనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి, పరిమిత వనరులతో చదువుకున్న విద్యార్థులు నేడు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం వెనుక రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందించిన ఆధునిక శిక్షణ, పరిశ్రమలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులు, నిపుణుల మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించాయి. ప్రతిభకు అవకాశం కల్పిస్తే పల్లె యువత కూడా ప్రపంచ స్థాయిలో సత్తా చాటగలరని ఉట్నూర్ విద్యార్థులు మరోసారి నిరూపించారు.

### గిరిజన ప్రాంత బిడ్డలకు... మల్టీ నేషనల్ కంపెనీల్లో జాబులు

పక్కా గ్రామీణ ప్రాంతమైన ఉట్నూర్ ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులను ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మల్టీనేషనల్ కంపెనీలు నేరుగా ఎంపిక చేశాయి. ష్నైడర్ ఎలక్ట్రిక్ 47 మందికి, టాటా మోటార్స్ (పుణె) 36 మందికి ఉద్యోగాలు ఇచ్చింది. అలాగే బెంగళూరులోని ఫాక్స్‌కాన్ ఆపిల్ ఐఫోన్ డివిజన్ 14 మంది యువతులను ఎంపిక చేసింది. మంచి వేతన ప్యాకేజీలతో ఉద్యోగాలు రావడంతో వారి కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. పల్లె నుంచి బెంగళూరు వరకు యువత ప్రయాణం సాధ్యమవుతుందనే నమ్మకాన్ని ఈ విజయగాథ కల్పించింది.

### అత్యాధునిక శిక్షణతోనే ఎంఎన్సీలలో ఉద్యోగాలు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి నిర్వహిస్తున్న ఏటీసీలో విద్యార్థులకు ఇండస్ట్రీ 4.0, సీఎన్‌సీ మెషినింగ్, రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, అడ్వాన్స్‌డ్ సిమ్యులేషన్ టెక్నాలజీ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ స్థాయి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలనే బోధించడం వల్ల ప్రముఖ కంపెనీలు నేరుగా క్యాంపస్‌కు వచ్చి నియామకాలు చేపడుతున్నాయి. పరిశ్రమ అవసరాలు, శిక్షణ మధ్య ఉన్న అంతరాన్ని ఏటీసీలు సమర్థంగా తగ్గిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

### పల్లె యువతకు ప్రపంచస్థాయి భవిష్యత్తు

ఏటీసీల్లో కోర్సులను అభ్యసించి ఉద్యోగం సాధించిన, ఈ విజయం కేవలం ఉద్యోగాలకే పరిమితం కాదు. పల్లె లేదా గిరిజన ప్రాంతంలో జన్మించడం భవిష్యత్తుకు అడ్డంకి కాదని, సరైన అవకాశాలు, నాణ్యమైన శిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ప్రపంచ స్థాయి కంపెనీల్లో కూడా ఉద్యోగాలు సాధించవచ్చని ఉట్నూర్ విద్యార్థులు నిరూపించారు. ప్రతిభకు ప్రాంతం అడ్డుకాదని, నైపుణ్యమే అసలు అర్హత అని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

### సీఎం మానసపుత్రికకు అద్భుత స్పందన

తెలంగాణను దేశంలోనే స్కిల్ క్యాపిటల్ గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి ఉట్నూర్ ఏటీసీ తొలి విజయగాథగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వేలాది మంది యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. చదువుకు నైపుణ్యం జోడిస్తే ఉద్యోగం సులభమవుతుందనే సందేశాన్ని ఈ కార్యక్రమం బలంగా చాటుతోంది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలకు పరిశ్రమల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. త్వరలో వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కూడా ఇదే తరహా భారీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి ఉద్యోగ మేళాలు నిర్వహించి, పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

### 'తెలంగాణ రైజింగ్-2047'లో భాగంగా మెగా జాబ్‌మేళాలు

తెలంగాణను ఉపాధి, పరిశ్రమలు, నైపుణ్యాల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్--2047' విజన్ కింద భారీ ఉద్యోగ కల్పన కార్యక్రమాలు చేపడుతోంది. పరిశ్రమలు, ఉద్యోగ సంస్థలు, శిక్షణ కేంద్రాలు, అప్రెంటిస్‌షిప్ సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ఉద్యోగార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

# న్యాయం పొందడానికి 70 ఏళ్ళు

"Justice delayed is justice denied" విలియం గ్లాడ్‌స్టోన్ చెప్పిన ఈ మాట నేటికీ భారత న్యాయవ్యవస్థకు అద్దం పడుతూనే ఉంది. న్యాయం సకాలంలో అందకపోతే అది న్యాయమే కాదు.. అది కేవలం కాగితాల మీద గెలుపు మాత్రమే. జీవితంలో ఓటమి అనుభవించిన వారికి చివరికి వచ్చే తీర్పు పువ్వుల్లాంటిది కాదు, సమాధి మీద వేసే పూలదండ లాంటిది.

ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ సమీపంలో నర్సీపూర్ కలాన్ గ్రామంలో 15.5 బిఘాల భూమి కోసం జరిగిన వివాదం దాదాపు ఏడు దశాబ్దాలు కొనసాగింది. 1957లో సేల్ డీడ్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని 1991 నాటి భూముల పునర్వ్యవస్థీకరణలో అమ్మిన వారి పేరిట నమోదు చేశారు. న్యాయం కోసం పోరాడిన వారు కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. డబ్బు ఖర్చు చేశారు. ఆరోగ్యం కోల్పోయారు. మానసిక వేదన అనుభవించారు. చివరికి 2026లో సుప్రీం కోర్టు న్యాయం చేసింది. కానీ ప్రశ్న ఏమిటంటే.. 1957లో భూమి కొన్న మూల వ్యక్తి నేడు బతికి ఉన్నారా? ఆ తీర్పు విన్న సంతోషం వారికి దక్కిందా? లేదంటే వారి పిల్లలైనా ఆ భూమిని సేద్యం చేసే వయసులో ఉన్నారా? న్యాయం గెలిచిందని సంతోషపడటానికి కుటుంబంలో ఆత్మీయులు మిగిలారా? ఈ ప్రశ్నలకు జవాబు చాలా కష్టం. ఎందుకంటే కాలం ఆగదు.. కానీ కోర్టు కేసులు ఆగుతాయి, వాయిదాల మీద వాయిదాలు పడతాయి. భారతదేశంలో భూ వివాదాల చరిత్ర చూస్తే గుండె తరుక్కుపోతుంది. తాత మొదలుపెట్టిన కేసు తండ్రి కొనసాగించాడు, తండ్రి మొదలుపెట్టిన కేసు కొడుకు నడిపాడు. తరాలు గడిచిపోయాయి, కానీ కేసు ఫైళ్ళు పెరిగాయే తప్ప తరగలేదు. ఇది కేవలం ఒక కుటుంబం కథ కాదు.. ఇది కోట్లాది భారతీయ కుటుంబాల వ్యథ. న్యాయం కోసం పోరాడే వ్యక్తి జీవితంలో సమయం, డబ్బు, ఆరోగ్యం, సంబంధాలు, జీవన నాణ్యత అన్నీ కోల్పోతాడు. కోర్టు హాళ్ళలో దశాబ్దాల మానసిక ఒత్తిడి శరీరాన్ని కృంగదీస్తుంది. భూమి వివాదాలు అన్నదమ్ముల మధ్య, బంధువుల మధ్య శాశ్వత చిచ్చు పెడతాయి. చివరికి న్యాయం వచ్చేసరికి అన్నీ కోల్పోయిన తర్వాత ఆ తీర్పు ఒట్టి కాగితం మాత్రమే అవుతుంది.

భారత న్యాయవ్యవస్థలో నేడు సుమారు 5 కోట్లకు పైగా కేసులు పేరుకుపోయి ఉన్నాయి. ఒక్కో జడ్జిపై వేలాది కేసుల భారం ఉంది. సగటు పౌరుడికి ఒక కేసు పరిష్కారానికి 15 నుండి 30 సంవత్సరాలు పట్టవచ్చు. న్యాయమూర్తుల తీవ్రమైన కొరత, అనవసరమైన వాయిదాలు, పాత చట్టాల సంకెళ్ళు, వ్యవస్థాగత సంస్కరణల లోపం ఇందుకు ముఖ్య కారణాలు. పేద బాధితుడికి ఇంకా పెద్ద సమస్య ఉంది. కోర్టు ఖర్చులు భరించలేక మధ్యలోనే కేసు వదిలేయాల్సి వస్తుంది. ధనవంతుడు దశాబ్దాల పాటు పోరాటం కొనసాగించగలడు, పేదవాడు కాలేడు. ఇది న్యాయవ్యవస్థలో అసమానత్వానికి అద్దం పట్టే వాస్తవం. 1957లో భూమి కొన్న సరాఫత్ అలీ ఇప్పుడు బతికి ఉంటే వయసు 90కి పైనే ఉంటుంది. ఆ తీర్పు వినగలిగారా? ఆనందపడగలిగారా? భూమిలో అడుగుపెట్టగలిగారా? స్వాతంత్ర్య సమరయోధులు తాము పోరాడిన భారతాన్ని చూడకుండా మరణించినట్టు, న్యాయం కోసం పోరాడినవారు ఆ న్యాయాన్ని అనుభవించకుండా కన్నుమూసిన సందర్భాలు కోకొల్లలు. ఒక వ్యక్తి జీవితకాలం కేసు కోసం ఖర్చు చేసి, తీర్పు తన పిల్లలకో మనమలకో అందిందని తెలిస్తే అది గెలుపు కాదు.. తరాల వేదన. వారసులకు ఆస్తి దక్కవచ్చు, కానీ అన్యాయపు గాయాలు మాత్రం తరం తరానికి వెంటాడుతూనే ఉంటాయి. ఈ దుస్థితి మారాలంటే తక్షణ సంస్కరణలు అనివార్యం. న్యాయమూర్తుల సంఖ్యను గణనీయంగా పెంచాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను మరింత విస్తరించాలి. భూ వివాదాలకు, కుటుంబ కేసులకు ప్రత్యేక ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేయాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వర్చువల్ విచారణలను ప్రోత్సహించాలి. అనవసర వాయిదాలను నిరోధించే కఠినమైన నిబంధనలు తీసుకురావాలి. పేదవారికి ఉచిత న్యాయ సహాయాన్ని మరింత బలోపేతం చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా ఒక కేసు గరిష్టంగా ఎంత కాలం నడవాలో అన్న కాల పరిమితి చట్టంగా రావాలి. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రకంగా సరైనది. కానీ అది 70 సంవత్సరాల తర్వాత రావడం మాత్రం అన్యాయం. న్యాయం జీవితాన్ని నిర్మించాలి. జీవితాంతం వేచి ఉండేలా చేయకూడదు. న్యాయం సకాలంలో రావాలి, బతికి ఉన్నప్పుడు రావాలి, అనుభవించగలిగే వయసులో రావాలి. అదే నిజమైన న్యాయం.

# ప్రేమ పేరుతో కుటుంబ సభ్యుల హత్యలు

ప్రేమ అనేది మానవ జీవితంలో అత్యంత పవిత్రమైన భావోద్వేగం. ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పర విశ్వాసం, గౌరవం, బాధ్యత, త్యాగం, ఆప్యాయతకు ప్రతీకగా ప్రేమను శతాబ్దాలుగా మానవ సమాజం గౌరవించింది. అయితే ఆధునిక కాలంలో ప్రేమ అనే భావన అనేక సందర్భాల్లో అసలు స్వరూపాన్ని కోల్పోయి స్వార్థం, అధికారం, అసహనం, భావోద్వేగ నియంత్రణ లోపం, ప్రతీకారం, అహంకారానికి వేదికగా మారుతున్న ఆందోళనకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రేమ వివాహాలను కుటుంబ సభ్యులు అంగీకరించలేదనే కారణంతో తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులను హత్య చేయడం, మరోవైపు ప్రేమ విఫలమైందనే కారణంతో ప్రియుడు లేదా ప్రియురాలిని దారుణంగా హత్య చేయడం వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా తరచుగా వెలుగులోకి వస్తున్నాయి. ఇవి కేవలం వ్యక్తిగత నేరాలు కావు. ఇవి సమాజంలో మానవీయ సంబంధాలు ఎంత వేగంగా క్షీణిస్తున్నాయో తెలియజేసే ప్రమాదకర సంకేతాలు.



భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలమైన సామాజిక వ్యవస్థగా ఎన్నో దశాబ్దాలుగా గుర్తింపు పొందింది. కుటుంబం అంటే కేవలం ఒకే ఇంట్లో నివసించే వ్యక్తుల సమూహం కాదు. అది ప్రేమ, బాధ్యత, త్యాగం, పరస్పర గౌరవం, అనుబంధం, సంస్కారం, సహనం, విలువల సమాహారం. ఒకప్పుడు తల్లిదండ్రుల మాటను జీవిత మార్గదర్శకంగా భావించిన యువత, నేడు అనేక సందర్భాల్లో కుటుంబాన్ని ప్రత్యర్థిగా చూడడం ప్రారంభించిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇదే సామాజిక మార్పు అత్యంత ప్రమాదకర దశగా పరిశోధకులు విశ్లేషిస్తున్నారు.

ప్రస్తుతం యువతలో ప్రేమ భావనకు సంబంధించిన అవగాహనలో కూడా గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రేమ అంటే జీవితాంతం బాధ్యత అనే భావన తగ్గిపోతోంది. దానికి బదులుగా ప్రేమ అంటే స్వాధీనం చేసుకోవడం, ఎదుటి వ్యక్తి తన మాట వినకపోతే శిక్షించడం, కుటుంబ సభ్యులు అడ్డొస్తే వారిని తొలగించడం వంటి తీవ్ర మనస్తత్వాలు కొంతమందిలో పెరుగుతున్నాయి. ఇది మానసిక ఆరోగ్యం, కుటుంబ నిర్మాణం, సామాజిక విలువలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది.

2.ప్రేమ పేరుతో జరిగే కుటుంబ హత్యలను ఒక్క కోణంలో మాత్రమే విశ్లేషించడం సరైన విధానం కాదు. ఈ సమస్య వెనుక వ్యక్తిగత మనస్తత్వం, కుటుంబ పరిస్థితులు, సామాజిక మార్పులు, ఆర్థిక అసమానతలు, సాంకేతిక పరిణామాలు, మానసిక ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన అవగాహన లోపం వంటి అనేక అంశాలు పరస్పరం ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల ఈ నేరాలను కేవలం ప్రేమకు ఆపాదించడం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదు. ప్రేమ ఒక కారణంలా కనిపించినప్పటికీ, అసలు కారణం వ్యక్తుల ఆలోచనా విధానం, విలువల పతనం, భావోద్వేగాలను నియంత్రించలేని పరిస్థితులే అని అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

సామాజిక శాస్త్ర దృష్టిలో పరిశీలిస్తే ప్రేమ పేరుతో కుటుంబ సభ్యుల హత్యలు అనేవి ఒక వ్యక్తి చేసిన నేరంగా మాత్రమే చూడలేని సంక్లిష్ట సామాజిక సమస్య. ఈ సంఘటనల వెనుక సమాజ నిర్మాణంలో జరుగుతున్న వేగవంతమైన మార్పులు, విలువల క్షీణత, వ్యక్తిత్వ వికాసంలో లోపాలు, కుటుంబ వ్యవస్థ బలహీనత, డిజిటల్ సంస్కృతి ప్రభావం, వినియోగవాద జీవనశైలి, చట్టాలపై భయం తగ్గిపోవడం వంటి అనేక అంశాలు కలిసి పనిచేస్తున్నాయి. ప్రతి నేరం వెనుక ఒక వ్యక్తి ఉన్నప్పటికీ, ఆ వ్యక్తిని ఆ స్థితికి తీసుకువచ్చిన సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడం కూడా అంతే అవసరం.

నేటి ప్రపంచంలో సమాచార విప్లవం అపూర్వమైన అవకాశాలను కల్పించినప్పటికీ, అదే సమయంలో మానవ సంబంధాలపై కొత్త రకాల ఒత్తిడిని కూడా తీసుకొచ్చింది. ఒకప్పుడు కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపే యువత ఇప్పుడు రోజులో ఎక్కువ సమయాన్ని మొబైల్ ఫోన్, సామాజిక మాధ్యమాలు, వర్చువల్ సంబంధాలతో గడుపుతోంది. వాస్తవ జీవితంలో ఏర్పడే విభేదాలను ఎదుర్కొనే సామర్థ్యం తగ్గిపోతుండగా, ఊహాజనిత ప్రపంచంలో జీవించే అలవాటు పెరుగుతోంది. ఫలితంగా చిన్న సమస్య కూడా పెద్ద సంక్షోభంలా కనిపించే పరిస్థితి ఏర్పడుతోంది.

పలువురు మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, ఆవేశ నియంత్రణ సామర్థ్యం తగ్గడం ఆధునిక సమాజంలో తీవ్రమైన సమస్యగా మారుతోంది. కోపం వచ్చిన క్షణంలోనే నిర్ణయాలు తీసుకోవడం, తరువాత వాటి ఫలితాలను ఆలోచించకపోవడం అనేక నేరాలకు కారణమవుతోంది. ప్రేమ వ్యవహారాల్లో ఇది మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఒకవైపు కుటుంబ సభ్యుల వ్యతిరేకత, మరోవైపు భావోద్వేగ ఒత్తిడి కలిసి యువతలో తక్షణ ప్రతిస్పందనకు దారితీస్తున్నాయి. కేవలం కొన్ని నిమిషాల ఆవేశం జీవితాంతం చెరగని విషాదాన్ని మిగులుస్తోంది.

భవిష్యత్తు సమాజాన్ని పరిశీలిస్తున్న సామాజిక శాస్త్రవేత్తలు ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. సాంకేతికంగా ప్రపంచం ఎంత అభివృద్ధి చెందినా, కుటుంబ వ్యవస్థ బలహీనపడితే ఆ అభివృద్ధి నిలకడగా ఉండదని వారు హెచ్చరిస్తున్నారు. కుటుంబం అనేది కేవలం రక్త సంబంధాల సమాహారం మాత్రమే కాదు. అది ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించే మొదటి విద్యాలయం, విలువలను నేర్పించే తొలి గురుకులం, బాధ్యతను పరిచయం చేసే తొలి సంస్థ. అలాంటి కుటుంబ వ్యవస్థలో ప్రేమ స్థానంలో అనుమానం, గౌరవం స్థానంలో అహంకారం, సంభాషణ స్థానంలో హింస, ఆప్యాయత స్థానంలో ప్రతీకారం చోటుచేసుకుంటే సమాజ నిర్మాణం క్రమంగా దెబ్బతినడం అనివార్యం అవుతుంది.

భారతీయ సంస్కృతి వేల సంవత్సరాలుగా కుటుంబ బంధాలు, తల్లిదండ్రుల పట్ల గౌరవం, పరస్పర సహకారం, మానవీయ విలువలపై ఆధారపడి నిలిచింది. ఈ విలువలు బలహీనపడితే సమాజం ఆర్థికంగా అభివృద్ధి చెందినా మానవీయంగా వెనుకబడిన సమాజంగా మారే ప్రమాదం ఉంది. విజ్ఞానం మనిషికి శక్తిని ఇస్తుంది. సంపద సౌకర్యాలను అందిస్తుంది. సాంకేతికత వేగాన్ని పెంచుతుంది. కానీ ప్రేమను మానవత్వంతో, స్వేచ్ఛను బాధ్యతతో, హక్కులను కర్తవ్యాలతో సమతుల్యం చేసే విలువలే సమాజాన్ని నిలబెడతాయి.

చివరగా చెప్పాలంటే ప్రేమ పేరుతో కుటుంబ సభ్యుల హత్యలు వ్యక్తిగత వైఫల్యం మాత్రమే కాదు, సమాజంలోని విలువల సంక్షోభానికి ప్రతిబింబం. ఈ సమస్యను చట్టాలతో మాత్రమే పరిష్కరించడం సాధ్యం కాదు. కుటుంబాల్లో సంభాషణ పెరగాలి. విద్యలో విలువలు బలపడాలి. యువతలో భావోద్వేగ పరిపక్వత పెంపొందాలి. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సమాజం మొత్తం కలిసి మానవీయ సంబంధాలను పునర్నిర్మించడానికి కృషి చేయాలి. ప్రేమ ఒక కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే శక్తిగా కాకుండా రెండు కుటుంబాలను కలిపే సేతువుగా మారినప్పుడు మాత్రమే భారతీయ సమాజం తన మానవీయ వారసత్వాన్ని రక్షించుకోగలదు. అదే నిజమైన నాగరికతకు, శాశ్వత సామాజిక శాంతికి, సుస్థిర మానవ సంబంధాలకు బలమైన పునాది అవుతుంది.

డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# మతం అనే ఆయుధం... మౌనం అనే నేరం!

ఈ దేశంలో మతం ఇప్పుడు ఒక నమ్మకం కాదు, ఒక ప్రమాదకరమైన ఆయుధంగా మారిపోయింది. రాజకీయ అధికారం కోసం, ఓట్ల పంట కోసం, మనుషుల మధ్య గోడలు కట్టడానికి మతాన్ని ఒక పరికరంగా వాడుకునే శక్తులు ఈ మట్టిలో నిరంతరం మూలుగుతూనే ఉన్నాయి. ఇది నిన్న మొన్న పుట్టిన కొత్త విషయం కాదు. కానీ, ఈ రోజు సమాజంలో కనిపిస్తున్న ఆ ద్వేషపు వేగం, దాని క్రౌర్యం, దాని నిర్లజ్జ గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకున్నాయి.



మత విద్వేష ప్రచారం అంటే కేవలం ఒక నాయకుడు మైకు ముందు చేసే ప్రసంగం కాదు, ఒక చానల్ స్క్రీన్‌పై చూపించే వార్త కాదు. అదొక పద్ధతి ప్రకారం నడిచే పెద్ద వ్యవస్థ. అది మెల్లగా, నిశ్శబ్దంగా, రోజురోజూ సామాన్య మనిషి మనసులో ఒక విషబీజాన్ని నాటుతుంది. అవతలి వాళ్ళు మన శత్రువులు అనే భావనను నరనరాల్లోకి ఎక్కిస్తుంది. ఆ విత్తనం మొలకెత్తి వృక్షమయ్యే నాటికి, సమాజపు నేల పూర్తిగా విషమయమైపోతుంది. మనిషిని మనిషిగా చూడలేని ఈ సమాజం, మతాన్ని మాత్రం చాలా తీవ్రంగా నిర్వచించడం ఒక పెద్ద కుట్ర.నిజానికి సోషల్ మీడియా అనేది సమాజపు అస్తిత్వాన్ని ప్రతిబింబించే ఒక అద్దం కావాల్సింది. కానీ దురదృష్టవశాత్తూ, అది అగ్నికి ఆజ్యం పోసే కొలిమిగా మారింది. వాట్సాప్ గ్రూపుల్లో తిరిగే నకిలీ వీడియోలు, ఎక్స్ (ట్విట్టర్) లో ట్రెండ్ అయ్యే అర్ధసత్యాలు, యూట్యూబ్‌లో వైరల్ అయ్యే ద్వేషభాషణలు ఇవన్నీ సామాన్యుల మనసుల్లో ఒక నిరంతర విద్యుత్ ప్రవాహంలా ప్రవహిస్తున్నాయి. ప్రజలు వీటిని నిజమైన వార్తలుగా నమ్ముతున్నారు. ఎందుకంటే, ఒక అబద్ధాన్ని పదేపదే వందల సార్లు చెప్పినప్పుడు, అది నిజంలాగే అనిపిస్తుంది. ఇది కేవలం మనోవైజ్ఞానిక శాస్త్రం మాత్రమే కాదు, కుటిల రాజనీతి.ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి. నిన్న గాక మొన్న వరదలు వచ్చినప్పుడు మీ పక్కింటి ముస్లిం కుటుంబం మీతో పాటే మునిగిపోయింది, మీతో పాటే కష్టాలు పడింది. మీ బిడ్డకు తీవ్రమైన జ్వరం వచ్చినప్పుడు, అర్ధరాత్రి వేళ మీ పక్కింటి హిందూ పొరుగువాడు తోడుగా నిలబడ్డాడు. ఆఫీసులో మీ ఉద్యోగం పోయినప్పుడు, మీ క్రైస్తవ సహోద్యోగి మీ భుజం తట్టి ధైర్యం చెప్పాడు. ఇవి ప్రతిరోజూ మన కళ్ళముందే జరుగుతున్న నిజాలు. కానీ, ఇవి ఎక్కడా వార్తలు కావు. ఎందుకంటే సమాజంలో ఐక్యత అమ్ముడుపోదు, కేవలం ద్వేషం మాత్రమే అమ్ముడుపోతుంది.మత విద్వేష ప్రచారానికి ఒక స్పష్టమైన ఆర్థిక శాస్త్రం, రాజకీయ ప్రయోజనం ఉన్నాయి. ఓటర్లు భయంలో ఉన్నప్పుడు, వారు తమను రక్షించే ఒక రక్షకుడి కోసం వెతుకుతారు. ఆ రక్షకుడి పాత్రను సృష్టించడానికి కంటే ముందే, ఒక కృత్రిమ శత్రువును సృష్టించడం అవసరం. ఆ శత్రువు ఎవరైనా కావచ్చు ఒక మతం, ఒక కులం లేదా ఒక ప్రత్యేక సమూహం. చరిత్రలో హిట్లర్ యూదులతో చేసింది సరిగ్గా ఇదే. ఆ పాఠాలు చరిత్ర పుస్తకాల్లో ఉన్నాయి, కానీ మనం వాటిని మర్చిపోయాం.

ఒక రోజు మీ మతం లేదా కులం మిమ్మల్ని ఎవరికో ఒకరికి శత్రువుగా మారుస్తుంది. అప్పుడు మీరు మాట్లాడాలని అనుకున్నా, మీ గొంతు నొక్కేయబడి ఉంటుంది. మౌనం అనేది తటస్థత కాదు, అది ద్వేషానికి ఇచ్చే పరోక్ష అనుమతి.మొదటగా, మన విద్యావ్యవస్థ మారాలి. మత విద్వేషాన్ని గుర్తించి, తిరస్కరించే సంస్కృతిని పిల్లలకు చిన్నప్పటి నుండే నేర్పించాలి. పాఠాల్లో మానవ విలువలు ఉండాలి.

భారతదేశంలో ఎన్నికల సీజన్ వచ్చిందంటే చాలు మత ఉద్రిక్తతలు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఏదో ఒక జిల్లాలో పాత దేవాలయం-మసీదు వివాదం మళ్ళీ తెరపైకి వస్తుంది. ఒక నాయకుని రెచ్చగొట్టే ప్రసంగం తర్వాత మరుసటి రోజే ఆ ప్రాంతంలో హింస చెలరేగుతుంది. ఇవన్నీ కాకతాళీయం అసలే కావు. ఇవన్నీ ఒక పద్ధతి ప్రకారం నడుస్తున్న రాజకీయ యంత్రం యొక్క భాగాలు.గణాంకాల వెనక ఉన్న భయంకరమైన సత్యం ఏమిటంటే, మన సమాజంలో ద్వేషం అనేది ఒక పద్ధతి ప్రకారం సృష్టించబడుతోంది. నివేదికల ప్రకారం, దేశంలో నమోదవుతున్న మొత్తం ద్వేషపూరిత ప్రసంగాలు కేసులలో ఏకంగా 67% కేసులు కేవలం ఎన్నికల సీజన్‌లోనే నమోదవుతుండటం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. ఈ కృత్రిమ విభజనల కారణంగానే గత దశాబ్దంతో పోలిస్తే ప్రస్తుతం మత ఘర్షణల రేటు మూడు రెట్లు పెరిగింది. వీటన్నింటికీ వెనుక ఉన్న ప్రధానమైన ఆయుధం సామాజిక మాధ్యమాల్లో వ్యాపించే అబద్ధాలు. నేడు జరుగుతున్న మత ఘర్షణలలో 82% ఘర్షణలకు ఫేక్ న్యూస్ మాత్రమే కారణం అవుతున్నాయని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నంబర్లు కేవలం అంకెలు కావు, కుంటుపడుతున్న మన సామాజిక ఐక్యతకు హెచ్చరికలు.ఒకప్పుడు పత్రికారంగాన్ని ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభం అనేవారు. కానీ ఇప్పుడు అది ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందో అడగాల్సిన సమయం వచ్చింది. రేటింగ్‌ల కోసం, టీఆర్‌పీల కోసం, యజమానుల రాజకీయ లాభాల కోసం కొన్ని మీడియా సంస్థలు మత ఉద్వేగాలను నిరంతరం పెంచి పోషిస్తున్నాయి. "ప్రైమ్ టైమ్ డిబేట్" పేరిట రాత్రి వేళల్లో జరిగే అరుపుల పోటీలు చూస్తే అర్థమవుతుంది అక్కడ సమాజానికి కావలసిన వెలుగు లేదు, కేవలం తగలబెట్టే అగ్ని మాత్రమే ఉంది.ఒక చానల్ ఏదో ఒక మసీదు స్పీకర్ సౌండ్ గురించి వరుసగా 72 గంటలు చర్చలు పెడుతుంది, కానీ అదే వారంలో ఒక మైనారిటీ కుటుంబంపై జరిగిన ఘోరమైన హింసకు కనీసం మూడు నిమిషాల స్క్రోలింగ్ కూడా ఇవ్వదు. ఇది కేవలం పక్షపాతం కాదు, సమాజం పట్ల చేసే నేరం. ఒక జాతిని నాశనం చేయడానికి బాంబులు అవసరం లేదు, పౌరుల మధ్య అపనమ్మకాన్ని నాటితే చాలు, వారే ఒకరినొకరు నాశనం చేసుకుంటారు.మన దేశంలో హేట్ స్పీచ్ నిరోధానికి ఐపీసీ సెక్షన్ 153ఏ, 295ఏ వంటి బలమైన చట్టాలు ఉన్నాయి. కానీ వాటి అమలులో పారదర్శకత ఎక్కడ ఉంది? కోర్టులు వందల కేసుల్లో తప్పులను ఎత్తి చూపినా, ఆ ద్వేషపూరిత మాటలు మాట్లాడిన వ్యక్తి మరుసటి రోజే మళ్ళీ మైకు ముందు నిలబడి మాట్లాడుతున్నాడు.మనలో చాలామంది నాకెందుకులే, నాకు రాజకీయాలతో పని లేదు అని మౌనంగా ఉంటారు. కానీ మీరు మౌనంగా ఉన్నా, రాజకీయం మిమ్మల్ని వదిలిపెట్టదు. ఒక రోజు మీ మతం లేదా కులం మిమ్మల్ని ఎవరికో ఒకరికి శత్రువుగా మారుస్తుంది. అప్పుడు మీరు మాట్లాడాలని అనుకున్నా, మీ గొంతు నొక్కేయబడి ఉంటుంది. మౌనం అనేది తటస్థత కాదు, అది ద్వేషానికి ఇచ్చే పరోక్ష అనుమతి.మొదటగా, మన విద్యావ్యవస్థ మారాలి. మత విద్వేషాన్ని గుర్తించి, తిరస్కరించే సంస్కృతిని పిల్లలకు చిన్నప్పటి నుండే నేర్పించాలి. పాఠాల్లో మానవ విలువలు ఉండాలి. రెండవది, మీడియా జవాబుదారీతనం. ద్వేషాన్ని వ్యాప్తి చేసే సంస్థల లైసెన్సులను రద్దు చేయాలి. మూడవది, చట్టం ముందు అందరూ సమానమే అనే నమ్మకం కలగాలి.అన్నింటికీ మించి, మనిషిని మనిషిగా ప్రేమించడం ముఖ్యం. భారతదేశం అనేది కేవలం ఒక మతానికి చెందిన దేశం కాదు, ఇది అనేక మతాల కలయికతో ఏర్పడిన ఒకే ఒక పవిత్రమైన ఆత్మ. ఆ ఆత్మను చంపే ప్రయత్నం చేసేవారు ఈ మట్టికి ద్రోహులు. ఆ ద్రోహాన్ని మనం గుర్తించాలి, బహిరంగంగా నిలదీయాలి, ఇప్పుడే నిరాకరించాలి.

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# రాజ్యాంగ పీఠిక తొలి పాఠం.. అదే తొలగిస్తే..



భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రజాస్వామ్య రాజ్యాంగాల్లో ఒకటి. రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ఆదర్శాలే భారత ప్రజాస్వామ్యానికి పునాదులు. అందుకే రాజ్యాంగ పీఠికను రాజ్యాంగ ఆత్మగా అభివర్ణిస్తారు. భావి పౌరులైన విద్యార్థులకు రాజ్యాంగ పీఠికను పరిచయం చేయడం విద్యా వ్యవస్థ ప్రాథమిక బాధ్యత. అలాంటి రాజ్యాంగ పీఠికను ఎన్సీఆర్టీ తొమ్మిదవ తరగతి సాంఘిక పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడం ఆందోళన కలిగిస్తుంది. రాజ్యాంగ పీఠికలోని "సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రం", సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలు భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలు. ప్రతి పౌరుడు తన జీవితంలో ఆచరించాల్సిన ప్రజాస్వామ్య సంస్కృతిని విద్యార్థులకు రాజ్యాంగ పీఠికను పరిచయం చేస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయాలంటే రాజ్యాంగ విలువలను విద్యలో మరింత బలోపేతం చేయాలి.

**విద్య అసలు లక్ష్యం**


ఆధునిక కాలంలో విద్య కేవలం ఉపాధి సాధనంగా మారిపోతుండగా, విలువల ఆధారిత విద్య క్రమంగా బలహీనపడుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పరీక్షలు, మార్కులు, ఉద్యోగాలకే ప్రాధాన్యం పెరుగుతోంది. దీనివల్ల సమాజ సమస్యలను విశ్లేషించే, ప్రశ్నించే, రాజ్యాంగబద్ధమైన పరిష్కారాలను అన్వేషించే పౌరుల కంటే, సమాచారం మాత్రమే కలిగి ఉండే విద్యార్థులను తయారు చేసే ప్రమాదం ఉంది. మరోవైపు విద్యార్థుల్లో హేతుబద్ధత, తర్కం, ప్రశ్నించడం, విమర్శనాత్మక ఆలోచన, ఆధారాలను పరిశీలించడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం, శాస్త్రీయ దృక్పథంతో సమస్యలను విశ్లేషించడం అంశాలు కనుమరుగవుతున్నాయి. గుడ్డిగా నమ్మే అంశాలకు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇది విద్య లక్ష్యానికి విరుద్ధం. మరోవైపు నేటి డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాల ప్రభావం, తప్పుడు సమాచారం, విద్వేషపూరిత ప్రచారం, మత-కుల ధ్రువీకరణ వంటి సవాళ్లు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు రాజ్యాంగ విలువలు, లౌకికత, సమానత్వం, సౌభ్రాతృత్వం, శాస్త్రీయ దృక్పథం వంటి అంశాలను మరింత బలంగా బోధించాల్సిన అవసరం ఉంది. ఇవే వారిలో వివేచనను పెంపొందించి, అసత్య ప్రచారాన్ని ప్రశ్నించే సామర్థ్యాన్ని పెంచుతాయి.

**పాఠ్యపుస్తకాల మార్పు - వివాదాలు**

నూతన జాతీయ విద్యా విధానం 2020 విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సహకార భావన, సమర్థవంతమైన సంభాషణకు ప్రాధాన్యత ఇచ్చింది. వీటిలో విమర్శనాత్మక ఆలోచనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. విద్యార్థులు ఏ విషయాన్నైనా హేతుబద్ధంగా విశ్లేషించడం, ఆధారాలను పరిశీలించడం, ప్రశ్నించడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం వంటి సామర్థ్యాలను పెంపొందించడమే దీని ఉద్దేశ్యం. కానీ పాఠ్యాంశాల కూర్పు దీనికి విరుద్ధంగా కొనసాగుతుంది. ఇప్పటికే ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలలో చేసిన పలు మార్పులు దేశవ్యాప్తంగా చర్చకు, విమర్శలకు దారితీశాయి. చరిత్ర, మొఘల్ పాలకులు, గుజరాత్ అల్లర్లు, డార్విన్ పరిణామ సిద్ధాంతం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ అంశాలు తొలగింపు, న్యాయవ్యవస్థ అవినీతినీ చేర్చడం వంటి అంశాలు దేశవ్యాప్తంగా వివాదాలకు దారితీస్తున్నాయి. ఈ క్రమంలో పాఠ్యపుస్తకాల నుంచి న్యాయవ్యవస్థలో అవినీతి వంటి చర్చనీయాంశాలను తొలగిస్తూ, రాజ్యాంగ విలువలను పరిచయం చేసే పీఠికను పాఠ్యాంశాల నుంచి తొలగించడం ఆందోళన కలిగిస్తోంది. సమాజంలో న్యాయవ్యవస్థ పారదర్శకత, జవాబుదారీతనం, రాజ్యాంగ విలువలపై చర్చ మరింత అవసరమైన సమయంలో ఇటువంటి మార్పులు విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను పరిమితం చేసే ప్రమాదం ఉంది. ఈ మార్పులపై విద్యావేత్తలు, చరిత్రకారులు, ప్రతిపక్ష పార్టీలు, పౌరసంఘాల నుంచి అభ్యంతరాలను ఎదుర్కొన్నాయి. విద్యలో విమర్శనాత్మక ఆలోచన, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం బలోపేతం కావాల్సిన సమయంలో ఇటువంటి మార్పులు విద్యా వ్యవస్థపై అనవసర వివాదాలకు కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రాజ్యాంగ పీఠికనే తొలి పాఠం**

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారవచ్చు, విధానాలు మారవచ్చు. కానీ రాజ్యాంగ విలువలు మాత్రం శాశ్వతమైనవి. వాటిని రాజకీయ దృక్కోణాలతో కాకుండా జాతీయ దృక్కోణంతో చూడాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగం ఏ ఒక్క పార్టీకి చెందినది కాదు, అది భారత ప్రజలందరి సామూహిక సంకల్పానికి ప్రతీక. ఈ క్రమంలో భారత రాజ్యాంగ నిర్మాతలు భావి తరాలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో, శాస్త్రీయ దృక్పథంతో, మానవీయ విలువలతో ఎదగాలని ఆకాంక్షించారు. అందుకే పాఠశాల దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన కల్పించడం అత్యంత అవసరం. సమానత్వం, లౌకికత, సామాజిక న్యాయం వంటి విలువలను ఆచరణలోకి తీసుకురావడానికి రాజ్యాంగ పీఠికే తొలి పాఠం. రాజ్యాంగాన్ని రక్షించడం అంటే కేవలం చట్టాలను గౌరవించడం మాత్రమే కాదు, దాని విలువలు, ఆదర్శాలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని భావి తరాలకు అందించడమూ అంతే ముఖ్యమైన బాధ్యత. అందుకే రాజ్యాంగ పీఠికను తిరిగి పాఠ్యాంశాల్లో చేర్చి, ప్రతి విద్యార్థికి రాజ్యాంగ విలువలను చేరవేయడం కాలానుగుణ అవసరం. రాజ్యాంగ స్పృహ, శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, వైవిధ్యాన్ని గౌరవించే దీనివల్ల సమాజ సమస్యలను విశ్లేషించే, ప్రశ్నించే, రాజ్యాంగబద్ధమైన పరిష్కారాలను అన్వేషించే పౌరుల తయారు చేసే పాఠ్యాంశాలను చేర్చాలి.



సంపతి రమేష్
సామాజిక విశ్లేషకులు
7989579428

## ప్రేమ అబద్ధం కాదు

ప్రేమ అబద్ధం కాదు.. పెళ్లి అబద్ధం కాదు
ఆత్మీయంగా అరమరికలు లేకుండా సాగిన
కాపురం అబద్ధం కాదు
మా ప్రేమకు గుర్తుగా పుట్టు కొచ్చిన పిలల్లు
అబద్ధం కాదు
మొక్కలను పెంచినట్టు
ఒడిలో ప్రేమతో పెంచినది అబద్ధం కాదు.
పిల్లలు ఎదిగి మమ్మల్ని దాటి
ముందుకు వెళ్లింది అబద్ధం కాదు
అంతా నాదే సాగాలి అతనన్నది అబద్ధం కాదు
తెలియనపుడు సరేనన్నా
తెలిసిన తరువాత నీది తప్పు అనడం తప్పు
కాదు
ఒక్క మాటా వినడు
అంతా నాదే సాగాలంటే
ఎట్లా?
సంసారమన్నాక సరే అంటూ
చెరికొంత సర్దుకు పోవాలి కద!
ఆ మాటే ఆయనకు నచ్చలేదు
నువ్వు చెప్పింది వినుకుంటూ పడి
వుండడానికి నేను రాయిని కాదు రప్పను
కాదు
హృదయమున్న మనిషిని నేను
నీకు తెలివి లేదు అనే మాట ఒక్కటి చాలు
నేను విడాకులు తీసుకోవడానికి
ఇంకా ఎన్నెన్ని మాటలన్నాడో!
నాకు తెలివి లేక పోతే నన్నెట్ల ప్రేమించాడు
నేనెట్లా ప్రేమించాను.
ప్రేమ గుడ్డిది అంటారు
నిజమే కావచ్చు నేను అతన్ని
ప్రేమించి నప్పుడు నాకు అతని కులం తెలియదు
నా ప్రేమ అబద్ధం కాదు
మా విడాకులు కూడా అబద్ధం కాదు.
విడాకులయ్యాక తెలిసి వచ్చిందంటాడు.
చెరువు నీళ్లు చెరువెనుక పొలాల్లో వచ్చి
పడ్డాయి
మల్లా చెరువుల కు ఎట్లా వస్తాయి .
మా ప్రేమ అబద్ధం కాదు
మా కాపురం అబద్ధం కాదు
మా విడాకులూ అబద్ధం కాదు.
మాకు కలిగిన పిల్లలు అబద్ధం కాదు
మా అనుభవాలు అబద్ధం కాదు
నేను అతన్ని వదిలేసాక అతడు అనుభవించిన
కష్టాలు అబద్ధం కాదు
మళ్లీ రా! తోడుగా వుండు
అని అడగడం అబద్ధం కాదు.
అన్నిటిలో అతడు చెప్పిందే వేదం అన్నాక
మళ్లీ కలవడం దేనికి
ఇపుడిలా జరిగిందని నాకు చింతేమీ లేదు
గుండెల్లో ఏదో బాధ
నా ఒక్క మాటైనా విని వుంటే ఇలా జరిగేది
కాదు
అతడి చివరి చూపు కోసం వచ్చాను.
అతని పాదాలకు పాత జ్ఞాపకాలతో
నమస్కరించాను
అతని శరీరం పాడెపై కట్టుతాళ్లతో కట్టబడి
ఉంది.
అతనిపై తెల్ల ని కొత్త బట్ట చుట్టారు
నిండా పూల లో అతని అంతిమ యాత్ర
బయలు దేరింది
ఎందుకో చివరి సారిగా రెండు కన్నీటి బొట్లు
జల జలా రాలాయి.

బిఎస్ రాములు
8331966987

# తాండూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై వివాదం

**● లక్కీడ్రా రద్దు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్**



**తాండూరు, జూన్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇందిరమ్మ/డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తాండూర్ నియోజకవర్గ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డికి శనివారం వినతిపత్రం సమర్పించారు.తాండూర్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ పట్లోళ్ల దీపా నరసింహులు, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. నరేందర్ గౌడ్ సమర్పించిన లేఖలో కీలక ఆరోపణలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డోర్-టు-డోర్ సర్వే నిర్వహించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా, జీఎంకే చారిటబుల్ ట్రస్ట్‌బి అనే ప్రైవేట్ సంస్థ "లక్కీ డ్రా" ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణలు...జీఎంకే ట్రస్టుకు ప్రభుత్వ పథకంలో జోక్యం చేసుకునే చట్టబద్ధ అధికారం, ప్రభుత్వ నోటిఫికేషన్ లేదు. ప్రజాప్రతినిధులకు దూరం. ఎన్నికైన బీఆర్ఎస్ ప్రతినిధులను కార్యక్రమానికి దూరంగా ఉంచారు.అసలైన బీపీఎల్, నిరుపేద కుటుంబాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంది.ఎమ్మెల్యేకి ఇచ్చిన వినతిపత్రంలో 9 కీలక డిమాండ్లు చేశారు.ప్రభుత్వ నిబంధనలే ప్రామాణికం. జీవోలు, సర్క్యులర్లు, మార్గదర్శకాల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరగాలి.తాజా సర్వే తప్పనిసరిలి: క్షేత్రస్థాయి డోర్-టు-డోర్ సర్వే తర్వాతే అసలైన నిరుపేదలను ఎంపిక చేయాలి.ఆదాయం, ఆస్తి, ఆధార్, రేషన్ కార్డు, మున్సిపల్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, మహిళలకు రిజర్వేషన్లు ఖచ్చితంగా పాటించాలి. తాత్కాలిక జాబితాను బహిరంగపరచి అభ్యంతరాలు స్వీకరించాలి.రోడ్లు, నీరు, కరెంటు, డ్రైనేజీ, వీధి దీపాలు పూర్తయ్యాకే ఇళ్లు అప్పగించాలి. విచారణ జరపాలి...జీఎంకే ట్రస్ట్ పాత్రపై స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పారదర్శకంగా, పక్షపాతం లేకుండా కేటాయింపు జరగాలి.రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 21, 38, 39(హెచ్), 46 ప్రకారం పేదలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలని, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి కృషితో ఈ ఇళు మంజూరయ్యాయని లేఖలో గుర్తుచేశారు. గతంలో 04-05-2026న ఆర్డీఓకు కూడా ఇదే అంశంపై వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ లేఖ ప్రతులను వికారాబాద్ జిల్లా కలెక్టర్, తాండూర్ ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ శాఖ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్‌కు కూడా పంపారు.అధికారులు స్పందించి చట్టబద్ధంగా, పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**● ఫ్యూచర్ సిటీ సి.పి తరుణ్ జోషి**



**శంకర్‌పల్లి, జూన్ 27 (జనం సాక్షి) :** సాధారణ తనిఖీలలో భాగంగా మండల పరిధిలో గల మోకిలా,శంకర్పల్లి పోలీస్ స్టేషన్లను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి శనివారం తనిఖీలు చేశారు. మోకిలా పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని మరియు పెట్రోలింగ్ తో రాత్రిపూట గస్తీ పెంచాలని సీఐ శ్రీనివాస్ రెడ్డి ని ఆదేశించారు. అనంతరం శంకర్పల్లి లో నిర్మాణంలో ఉన్న పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించి పనులను త్వరితగతిని పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్, ఏసీపి కిషన్ల ను ఆదేశించారు. అక్కడ నుంచి అంబేద్కర్ భవనంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్ కి వెళ్లారు.పోలీస్ స్టేషన్ భవనం వెనకాల ఉన్న పాత బైకులను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిఐ మీర్ ముదాసిర్ ఆలీ కి తెలిపారు.అనంతరం కేసుల వివరాలను రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ సిఐ సమరం రెడ్డి, ఎస్సైలు, సురేష్, దేవేందర్,సురేష్ గౌడ్, చెన్నారెడ్డి, మంజుల, పద్మ,రాములు, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

## పల్స్ పోలియో విజయవంతం చేద్దాం



**బొంరాస్‌పేట, జూన్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ సూచన మేరకు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి వైద్య ఆరోగ్య సిబ్బంది ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. 0 నుండి 5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

## తాటి చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**● కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు వర్కల బాలరాజు గౌడ్**



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27 (జనం సాక్షి) :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో ఫిలిం సిటీ యాజమాన్యం తాటి (ఈత) చెట్లను నరికి వేస్తున్న ఘటనపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కల్లు గీతా కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వర్కల బాలరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటి చెట్లు గీతా కార్మికుల జీవనాధారమని, వాటిని విచక్షణారహితంగా నరికివేయడం వల్ల వందలాది గీతా కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గీతా వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు తాటి చెట్లు ఆర్థిక బలమని, అలాంటి చెట్లను నరికి వేయడం గీతా కార్మికుల పొట్ట కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అనాజ్‌పూర్ గ్రామ పరిధిలో ఫిలిం సిటీ యాజమాన్యం పెద్దఎత్తున తాటి చెట్లను నరికివేస్తోందని ఆరోపించిన ఆయన, ఈ విషయమై ఇప్పటికే ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ శాఖ అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి, చెట్లను నరికిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం ఒకవైపు తాటి చెట్ల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుంటే, మరోవైపు కొంతమంది యాజమాన్యాలు అక్రమంగా చెట్లను నరికివేయడం ఆందోళనకరమని బాలరాజు గౌడ్ అన్నారు. తాటి చెట్టు కేవలం ఒక చెట్టు మాత్రమే కాదని, అది గీతా కార్మికుల జీవనోపాధికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణ పరిరక్షణకు ఎంతో కీలకమని పేర్కొన్నారు.తాటి చెట్లను నరికివేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించిన ఆయన, అధికారులు స్పందించకపోతే కల్లు గీతా కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. గీతా కార్మికుల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి తాటి చెట్ల నరికివేతను అడ్డుకోవడంతో పాటు, ఇప్పటికే నరికివేసిన చెట్లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని వర్కల బాలరాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# తాండూర్‌లో కాంగ్రెస్ అరాచక పాలన



**తాండూరు, జూన్ 27 (జనంసాక్షి) :** తాండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రతిపక్షాలను గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్. శుభప్రద్ పటేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను అధికారిక సమావేశం అని పిలిపించి, మరోపక్క పోలీసులను ప్రయోగించి అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, ఇది వారి చేతగానితనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పోలీసుల అండతో తాండూర్‌లో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ, పాలనను అస్తవ్యస్తం చేస్తున్నారని మండిపడ్డారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదల ఆత్మగౌరవ ప్రతీకగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపుల్లో అధికార పార్టీ అక్రమాలకు తెరలేపిందని ఆరోపించారు. అర్హులైన నిజమైన పేదలు, బలహీన వర్గాలు, మరియు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన తెలంగాణ ఉద్యమకారులకు మాత్రమే ఈ ఇళ్లు, ఇళ్ల స్థలాలు దక్కాలని వారు స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులను పక్కనబెట్టి, కాంగ్రెస్ నేతలు తమ అనుచరులకు, అనర్హులకు ఇళ్లను కట్టబెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని, అది సామాజిక న్యాయానికే గొడ్డలిపెట్టు అని హెచ్చరించారు.గతంలో దరఖాస్తు చేసుకుని, ఏళ్ల తరబడి కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న వేలాది నిరుపేద కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా జరగాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హుల జాబితాను బహిరంగంగా ప్రజల ముందు ఉంచాలన్నారు. ప్రజల నుండి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని సూచించారు.పేదల హక్కులను హరిస్తూ, రాజకీయ పక్షపాతంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తే సహించే ప్రసక్తే లేదని శుభప్రద్ పటేల్ హెచ్చరించారు. నిరుపేదలకు, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలపై పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తుందని, అవసరమైతే రోడ్లపైకి వచ్చి ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు

**● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి బ్యూరో, జూన్ 27 (జనంసాక్షి) :** అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లాలో జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన అవగాహన ర్యాలీని శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పల్స్ పోలియో వ్యాధి దేశంలో చాలా సంవత్సరాల క్రితమే నిర్మూలన అయినప్పటికీ, పొరుగు దేశాల నుంచి వచ్చే వలసదారుల కారణంగా మళ్లీ వ్యాప్తి చెందే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, దీనివల్ల ఎలాంటి హాని ఉండదని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 46,150 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 343 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి, దాదాపు 1,300 మంది వైద్య, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.తల్లిదండ్రులు తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే ప్రజలు, ప్రజాప్రతినిధులు, పత్రికా మిత్రులు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి కోసం అడుగులు వేయాలి




**మొయినాబాద్, జూన్ 27 (జనం సాక్షి) :** యువత స్వయం ఉపాధి కోసం ముందడుగులు వేయాలని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదల కలిగి ఉండాలని వర్కస్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రవి వేమిరెడ్డి. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యురాలు అడ్వకేట్ సునీత లు పేర్కొన్నారు. శనివారము రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని ఇగురు సమీపంలో గల అరిస్టాటిల్ పీజీ కళాశాల లో ఫేర్వెల్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఆ కళాశాల మేనేజ్మెంట్ నిర్వహించిన బెస్ట్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఈవో రవి వేమిరెడ్డి తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యురాలు అనిత లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పేస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత పట్టుదల కృషితో ముందడుగులు వేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేసుకోవాలని తెలిపారు విద్యార్థులు జీవితంలో కొత్త అవకాశాలను ధైర్యంగా స్వీకరించి నాయకత్వ లక్షణాలు విలువలు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని తెలిపారు పారిశ్రామికవేత్తలుగా స్వయం ఉపాధితో ఎదుగుతూ పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఉండాలన్నారు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో వ్యాపారాలు డిస్ట్రిబ్యూషన్ షిప్ అవకాశాలను వర్కర్స్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నామని రవివేమిరెడ్డి తెలిపారు యువత సాయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు మహిళా సాధికారత న్యాయ అవగాహన హోప్స్ చట్టం ప్రాముఖ్యత వార్ కౌన్సిల్ సభ్యురాలు అడ్వకేట్ బి సునీత విద్యార్థులకు వివరించారు ప్రతి పౌరుడికి న్యాయ పరిజ్ఞానం ఎంత అవసరమని మాజీ మెజిస్ట్రేట్ లహన్ కుకునూర్ రంజిత్ రెడ్డి విద్యార్థులకు సూచించారు విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలని తెలిపారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి విజ్ఞానంతో ఎదగాలని సూచించారు విద్యార్థులు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు అందర్నీ ఎంతో ఆకట్టుకున్నాయి అనంతరం విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతి మీదిగా బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**● బొంపల్లి మాజీ ఎంపిటిసి రాఘవాపురం రాములు**



**దోమ, జూన్ 26 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బొంపల్లి మాజీ ఎంపిటిసి రాఘవపురం రాములు తెలిపారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో బి ఎల్ వో తో కలిసి ఇంటింటికి ఎన్యూమరేషన్ దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలు అధికారులు చేపడుతున్న సవరణలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో డెత్ డబుల్ ఓట్లు చాలా ఉన్నాయని, వాటిని గుర్తించి తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులకు నూతన ఓటరును నమోదు చేయించేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా చేపట్టి అందుబాటులో ఉంచాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చూపిన ఉన్నతాధికారుల ఫిర్యాదు చేసినందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా అవగాహన లేని ప్రజలకు దరఖాస్తు ఫారాలను అధికారులు నింపి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు షేర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## బండరావిరాల డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కలెక్టరేట్ ముట్టడికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామ పరిధిలో ప్రతిపాదిత ఎకో టౌన్ ప్రాజెక్టు (డంపింగ్ యార్డు) ఏర్పాటుకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, గ్రామస్తులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 29న చేపట్టనున్న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి మద్దతు కోరారు.ఈ సందర్భంగా స్పందించిన డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, బండరావిరాల గ్రామ ప్రజలు గతంలో క్రషర్ల దోపిడీకి వ్యతిరేకంగా దాదాపు 400 రోజుల పాటు సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించారని గుర్తు చేశారు. ఇప్పుడు డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా కూడా గ్రామస్తులు అదే స్థాయిలో పోరాటానికి సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ప్రజల అనుమతి లేకుండా వారి ఆరోగ్యం, జీవనోపాధికి ముప్పు కలిగించే విధంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం ప్రజల జీవితాలను ఫణంగా పెడుతున్నారని ఆయన ఆరోపించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తరహాలో హైదరాబాద్ నగర చెత్తను బండరావిరాల ప్రాంతానికి తరలించి ఈ ప్రాంతాన్ని కాలుష్య కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. బండరావిరాలతో పాటు చిన్నరావిరాల, పిల్లాయిపల్లి, పెద్దగూడెం, జగత్‌పల్లి, దేశ్‌ముఖి, కావాడిపల్లి, బాచారం తదితర సుమారు 15 గ్రామాల ప్రజలు ఈ ప్రాజెక్టు వల్ల తీవ్ర కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే వారికి డంపింగ్ యార్డును బహుమతిగా ఇస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.డంపింగ్ యార్డు పూర్తిగా ఈ ప్రాంతం నుంచి తరలించే వరకు ప్రజలతో కలిసి నిరంతర పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 29న నిర్వహించనున్న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు మొలుగు దానేశ్, కావాడి దయాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కందికంటి అనూష--ప్రవీణ్, కన్నె భరత్ యాదవ్, యువ నాయకులు ఎమ్ముల శివశంకర్, కొత్త శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

# పోలియో చుక్కల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- జిల్లా వ్యాప్తంగా 1137 పోలియో బూత్‌ల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూన్ 27 (జనం సాక్షి) :** ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా పోలియో బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వే బృందాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 28న జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,137 పోలియో బూత్‌లలో ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి తొలి రోజు మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 1,80,405 మంది 0 - 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1,583 మంది ఏఎన్ఎంలు, 904 మంది ఆశా కార్యకర్తలు, 1,505 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 625 మంది ఇతర వాలంటీర్లు, 6 మంది ప్రోగ్రామ్ అధికారులు పాల్గొంటున్నట్లు వివరించారు. వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో నివసించే చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0–5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, మరోసారి వేయించడం ద్వారా చిన్నారులకు పూర్తి రక్షణ లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రు లందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

## దళిత మహిళపై దాడిని ఖండిస్తూ ఎంఆర్పీఎస్ నిరసన



**బెజ్జంకి, జూన్ 27 (జనం సాక్షి) :** తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎల్లమ్మ బోనాల పండుగ సందర్భంగా దళిత మహిళపై జరిగిన కుల వివక్ష దాడిని ఖండిస్తూ బెజ్జంకి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు బోనగిరి రూపేష్,సంగెం రూపేష్,వడ్లూరి పరశురాములు మాట్లాడుతూ దళిత మహిళలను ఆలయంలోకి అడ్డుకోవడం,దాడికి పాల్పడడం అవమానవీయమని అన్నారు.నిందితులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చింతకింది పరశు రాములు,మాంకాల బాలయ్య, మోదుంపల్లి రాజు, బోనగిరి ప్రభాకర్, కొంపెల్లి మల్లేశం,చిలుముల మోహన్,ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, జూన్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, చర్చించినట్లు సమాచారం. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



**నర్సాపూర్, జూన్ 27 (జనం సాక్షి) :** ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన దాడిగే మొగులమ్మ కు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి జిల్లా అధ్యక్షులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మరాఠీ రామా గౌడ్, మాజీ ఎంపీటీసీ యాద గౌడ్, ఎర్రగుంట తండా సర్పంచ్ సురేష్ నాయక్, 8వ వార్డు సభ్యులు మన్నె భాగ్యలక్ష్మి బీమ్, నాయకులు రాజు గౌడ్ ,శేఖయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన



**జడ్చర్ల, జూన్ 27 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల వివరాల సేకరణను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బి.ఎల్.ఓ లకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ మాట్లాడుతూ ఈ ప్రక్రియ అత్యంత కీలకమని, క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల సేకరణలో ఏమాత్రం పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ఎనిమరేషన్ ఫారాలను నింపేటప్పుడు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉండటమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బి.ఎల్.ఓ శివప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ పట్టణంలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ




**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 27 (జనం సాక్షి) :** మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు మెదక్ పట్టణంలోని పిట్లం బేస్ ప్రాంతం, వార్డు నెం.14, 15లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, బీఎల్ఓ నీలిమతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొని ప్రజలకు ఫారాలు నింపే విధానం, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వాములై, ఫారాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. తొందరపాటుకు తావివ్వకుండా సరైన వివరాలు నమోదు చేయాలని కోరారు. వార్డు నెం.14, 15 పరిధిలోని ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో పాల్గొనాలని, ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 27 (జనం సాక్షి) :** జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీని వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆదేశించారు.శనివారం ఆమె ఉట్కూర్ మండల కేంద్రంలో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. స్థానిక కార్గిల్ చౌరస్తా, గ్రామ పంచాయతీ కార్యాలయాల సమీపంలో గల నివాసాలకు వెళ్ళి ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో బోగస్ ఓట్ల ను మాత్రమే తొలగించడం జరుగుతుందని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇంటింటికి వచ్చే బీఎల్ వో లకు ఓటర్లు సహకరించి, ఎన్యూమరేషన్ పత్రాలను తప్పక పూరించి ఇవ్వాలని ఆమె సూచించారు. ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్లు త్వరగా నింపేటట్లు బీ ఎల్ వో లు, బీ ఎల్ ఏ లు చొరవ తీసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్ కుమార్, ఎంఈ వో మాధవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం



**అమీన్పూర్, జూన్ 27 (జనం సాక్షి) :** పటాన్చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ, ధ్వజ స్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక పూజలు

బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, మల్లేష్ నాయకులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి



**తెలకపల్లి, జూన్ 27 (జనం సాక్షి) :** ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు శనివారం పిలుపునిచ్చారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి సమీప పోలియో కేంద్రంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. నిండు జీవితానికి రెండు పల్స్ పోలియో చుక్కలు రక్షణ కవచంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలకపల్లి మండల కేంద్రంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వీర్‌పాల్, యశోద, ఏఎన్ఎంలు కవిత, శాంత, పుష్ప, ల్యాబ్ టెక్నీషియన్ రామాంజనేయులు గౌడ్, హెల్త్ అసిస్టెంట్లు సందీప్‌రెడ్డి, రవీందర్‌రావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకి పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలనీ సీపీఎం డిమాండ్



**బెజ్జంకి, జూన్ 27 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్సీ) నీ సందర్శించి చికిత్స కోసం వచ్చిన రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను శనివారం సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం సమస్యలపై మండల వైద్యాధికారి మాధురి తో చర్చించారు.అనంతరం తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ బెజ్జంకి లో 24 గంటలు సేవలో ఉండే పీహెచ్సీగా ఉన్నప్పటికీ ఒక్క స్టాఫ్ నర్స్ కూడా లేకపోవడం ఆందోళనకరమని అన్నారు.ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరు కూడా లేరని,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. అలాగే సూపర్వైజర్ అవసరముండగా,ఆరుగురు ఏఎన్ఎంలు అవసరమైన చోట ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు.ఆయుష్ విభాగానికి చెందిన సిబ్బందిని కూడా సిద్ధిపేటకు డిప్యూటేషన్‌పై పంపడంతో వైద్య సేవల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం,జిల్లా యంత్రాంగాన్ని కోరారు.మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని,మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెండు 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని,కాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సంఘ ఎల్లయ్య,బొమ్మిడి సాయికృష్ణ,భోనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు అర్హులకే కేటాయించాలి




**కల్వకుర్తి, జూన్ 27 (జనంసాక్షి) :** ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను అర్హులైన దళిత నిరుద్యోగులకు కేటాయించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) డిమాండ్ చేసింది.దుకాణాల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ బాధితులు రెండో రోజూ రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.ఈ దీక్షలకు బీఎస్పీ మద్దతు ప్రకటించింది.దరఖాస్తు చేసిన సుమారు 250 మంది అభ్యర్థుల పేర్లను చీటీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేయాలని పార్టీ నేతలు కోరారు.రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ప్రాధాన్యం ఇచ్చి అర్హులను విస్మరించారని ఆరోపించారు.అక్రమ కేటాయింపులను రద్దు చేసి సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నిరటి మల్లేష్, గోరటి వెంకన్న,కేశవులు,కళ్యాణ్, శ్రీను, కృపానందం తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత హామీలతో గిరిజనులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవి నాయక్




**ఖిల్లా ఘనపురం, జూన్ 27 (జనం సాక్షి) :** గిరిజనలకు రిజర్వేషన్ ఏర్పడి 50 వసంతాలు పూర్తయిన అటు దేశంలో ఇటు రాష్ట్రంలో ఏ గిరిజనా జాతికి సరైన పథకాలు అమలు చేయలేదు తెలంగాణ ఏర్పడిన తర్వాత గత పది ఏళ్ళు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు ఎలాంటి సహాయ సహకారాలు అందివ్వలేదు అలాగే 50 ఎల్ల కింద కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో మా జాతిని గుర్తించి రిజర్వేషన్లు అమలుపరిచారు కానీ మా జాతిని కేవలం ఓట్ల రాజకీయం కోసమే వాడుకున్నారు తప్ప మా గిరిజన సంసతికి భాషకు మా జాతికి వడగబెట్టింది ఏమీ లేదు అని అన్నారు. అడ్డగోలు హామీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాబోవు ఎన్నికలలో ఘోర పరాజయం పాలవుతుందని శనివారం మండల కేంద్రంలోని పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవి నాయక్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఏమి ఓ రగపెట్టారని బస్సు యాత్ర చేపడుతున్నారని మేము ఎక్కడ ప్రశ్నిస్తామని మమ్మల్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో బంది చేయడం ఎంతవరకు సమంజసమని అరెస్టుపై గణపురం బిజెపి మండల పార్టీ తీవ్ర అస్సహనం వ్యక్తం చేస్తుందని అన్నారు ఉమ్మడి పాలమూరు జిల్లాలో గిరిజనుల కు మేలు చేసినట్లు బస్సు యాత్రలు ఎలా చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం లోఒక్కరికైన మా గిరిజన నాయకులకు మంత్రి పదవి ఉందా లేదా మాకు ఏమైనా ప్రత్యేక పథకాలు ఏమి వర్తింప చేశారని ఏమి ఓడగబెట్టారని బస్సు యాత్రకు చేపట్టారు ఇలాంటి బస్సు యాత్రలు ఎన్ని చేపట్టిన గిరిజనులు రాబోవు ఎన్నికలలో బిజెపికి పట్టం కడతారని బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత గిరిజనులకు ప్రత్యేక పథకాలు ఎమ్మెల్సీలు మంత్రులు ఆ ప్రభుత్వంలో ఉంటారని ఈ సందర్భంగా రవి నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల కార్యదర్శి గోపాల్ ముదిరాజ్,తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి, చెక్క నరసింహ, గిరిజన మోర్చ మండల అధ్యక్షులు హేమంత్, నార్య నాయక్తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
28 జూన్ 2026

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో పాలన మరింత చేరువ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 27 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తో పాలన ప్రజలకు మరింత చేరువ అయిందని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి,దేవాదాయ శాఖ, పర్యావరణ,అటవీ శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు.మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 10 అంశాలతో వివిధ శాఖల ఆద్వర్యంలో చేసిన అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాలు అమలు,భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి శైలజా రామయ్యర్ హాజరుకాగా,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు చేరవేయడం,భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడమే లక్ష్యంగా మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు జిల్లాలో చేసిన అభివృధి పనులు,అమలు చేసిన సంక్షేమ పథకాలు,వివిధ ఫైళ్ల పరిష్కారం,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంపై జిల్లా యంత్రాంగం రూపొందించిన పీపీటీ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ..ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని,99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను డాక్యుమెంటరీ రూపొందించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడం,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి,డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం,రోడ్డు భద్రతలో భాగంగా సీపీఆర్ శిక్షణ,అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ,ఇతర పనుల్లో పురోగతిపై జిల్లా కలెక్టర్ ను ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అభినందించారు.ఇట్టి సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,అదనపు ఎస్పీ చంద్రయ్య,డీఆర్ఓ జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వెంకట మాధవ రావు,డీఆర్డీఓ లక్ష్మీనారాయణ,జిల్లా పశువైద్య అధికారి రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు దేవస్థానంలో మొబైల్ టవర్ ఏర్పాటు స్థల పరిశీలన

**మల్యాల, జూన్ 27 (జనం సాక్షి) :** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో భక్తుల సౌకర్యార్థం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఇండస్ టవర్స్ సంస్థ దేవస్థానం ఒప్పందం కుదుర్చుకున్నది. ఇండస్ టవర్స్ ప్రతినిధులు టవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి,ఆలయానికి వచ్చే భక్తులకు నాణ్యమైన మొబైల్ సిగ్నల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో అనువైన స్థలాన్ని పరిశీలించారు.ఇండస్ టవర్స్ ప్రతినిధులు తెలంగాణ ఏపీ సీఈవో సంతోష్ రాయ్,బిజినెస్ హెడ్ అరుణ్ కుమార్, కన్స్ట్రక్షన్ మేనేజర్ అరుణ్ కుమార్, ఎక్విజిసన్ మేనేజర్ రమేష్ బాబు స్థలాన్ని పరిశీలించారు.ఆలయ ఈవో అంజనా రెడ్డి,ఏఈఓ హరిహరనాథ్,సూపరిండెంట్ సునీల్ పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ పరిశీలన



**ఉర్కొండ, జూన్ 27 (జనం సాక్షి) :** ఊర్కొండ మండల కేంద్రంలో ఓటర్ల సమగ్ర సవరణ సవరణ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ స్టేషన్ నంబర్ 267లో జరుగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ హరిప్రియ తనిఖీ నిర్వహించారు. ఓటర్ల నమోదు కోసం చేపట్టిన ఇంటింటి ఎన్యుమరేషన్ ఫారమ్ పంపిణీ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యూసుఫ్ అలీ, స్థానిక సర్పంచ్ మ్యాకల మంజుల, బీఎల్ఎలు, బీఎల్ఎలు తదితరులు పాల్గొన్నారు.

# మరో పోరాటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు కంకణబద్ధులు కావాలి

- మాజీ మంత్రి పువ్వాడ పిలుపు

**భద్రాచలం, జూన్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ కోసం ప్రణాళిక బద్ధంగా ఎలా పోరాటం జరిపామో మళ్లీ ఇప్పుడు ప్రజా వ్యతిరేకి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. భద్రాచలంలో శనివారం జరిగిన బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాయ మాటలతో, అమలు గాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం సగం పాలన కూడా పూర్తికాకముందే చతికిల పడిందని ఆయన ఎద్దేవ చేశారు. ఈ ప్రభుత్వం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది అన్నారు. సీఎం రేవంత్ ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టే సీఎం నేనని, ఆయన ప్రజలకు జవాబుదారీ కాదని విమర్శించారు. తన పదవిని కాపాడుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాడు తప్ప, ప్రజల కోసం పనిచేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కరువు కరాల నృత్యం చేస్తోందని, పేదలు సమస్యలతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



భద్రాచలం బిఆర్ఎస్ అడ్డా అని వెల్లడించారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీ సూచనలు పాటించాలని తెలిపారు. పార్టీ పునర్నిర్మాణం జరుగుతోందని, ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని, పార్టీ నాయకులు,కార్యకర్తలు పార్టీ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పని చేయాలని సూచించారు. త్వరలోనే అన్ని రకాల కమిటీలు వేయటం జరుగుతుందని, కష్టపడిన వారికి తప్పకుండా తగిన గుర్తింపు లభిస్తుందని వెల్లడించారు. స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి తగు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఖండించాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి రావులపల్లి రాంప్రసాద్, నియోజవర్గ నాయకులు మానే రామకృష్ణ, గొడవర్తి నరసింహమూర్తి, బోదెబోయిన బుచ్చయ్య, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, గంప రాంబాబు, పెనుమల్లు రామకృష్ణారెడ్డి, దొడ్డి తాతారావు, కనితి రాముడు,రావులపల్లి పృద్వి, ఆకోజు సునీల్ కుమార్, కోటగిరి ప్రమోద్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, అయినవోలు పవన్ కుమార్, కావూరి గోపి,తెల్లం లక్ష్మీనారాయణ, నియోజకవర్గంలో ఉన్న గ్రామపంచాయతీ బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు మండల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నల్గొండలో సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



**నల్లగొండ ప్రతినిధి, జూన్ 27 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదివారం నల్గొండ జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం కనగల్, నల్గొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు.కనగల్లో రూ.13,006 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న హ్యామ్ రోడ్లకు సీఎం శంకుస్థాపన చేయనుండగా, అనంతరం నల్గొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా సభా వేదిక, శిలాఫలకం, సీటింగ్ ఏర్పాట్లు, బ్యారికేడ్లు, వీఐపీ, మహిళలు, సాధారణ ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలను కలెక్టర్ పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు, ఎండ, వర్షం నుంచి రక్షణ కల్పించేలా టెంట్లు తదితర అన్ని సౌకర్యాలను శనివారం సాయంత్రానికల్లా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తిప్పర్తి, దేవరకొండ, మర్రిగూడ బైపాస్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు తమ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.పరిశీలనలో అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఎఫ్ఓ రాజశేఖర్, డీఆర్ఓ దశరథ్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కరకట్ట విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాచలం, జూన్ 27 (జనంసాక్షి) :** గోదావరి వరద 70 అడుగులకు పైగా వరద వచ్చిన భద్రాచలం పట్టణంలోకి వరద నీరు రాకుండా కరకట్ట విస్తరణ పనులు ఇరిగేషన్, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న కరకట్ట పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ 1986వ సంవత్సరంలో భద్రాచలంలో ఉన్న గోదావరి జలప్రళయాన్ని పరిగణలోకి తీసుకొని నూతనంగా కరకట్ట నిర్మాణం చేపట్టామని, ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట నిర్మాణం చేపట్టడం వలన భద్రాచలం పట్టణం, పరివాహక ప్రాంతాలను గోదావరి వరద తాకిడికి గురికాకుండా చాలా వరకు నియంత్రించగలిగామని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించే కరకట్ట పైనుంచి క్రాసింగ్ అయ్యే జాతీయ రహదారి బ్రిడ్జి డిజైన్ జాప్యం వల్ల కరకట్ట నిర్మాణం పనులు కొంత ఆలస్యమైందన్నారు. కరకట్ట నిర్మాణం పనులకు ఎటువంటి ఆటంకాలు, సందేహాలు లేనందున నీటిపారుదల శాఖ అధికారులు, జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్లతో కలిసి నిర్మాణ పనుల పురోగతి పనులను పరస్పర సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని, గోదావరి వరదల సమయంలో భద్రాచలం పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే విధంగా కరకట్ట నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, నీటిపారుదల శాఖ అధికారులు, జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 27 (జనం సాక్షి) :** దోమకొండ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ప్రత్యేక అధికారి, కలెక్టర్ ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ పాఠశాలలో విద్య, వసతి, ఆహారం, ఇతర సౌకర్యాలపై ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు, విద్యాభ్యాసం, వసతి, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థినులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు (హెల్త్ చెకప్‌లు) నిర్వహిస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉండే నేపథ్యంలో ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా దోమతెరలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, విద్యార్థులందరికీ యూనిఫాంలు అందజేశారా అని ఆరా తీశారు. యూనిఫాం వస్త్రం అందిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా కొలతలు తీసి కుట్టించి విద్యార్థులకు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకుంటూ, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. భోజనం చేస్తున్న విద్యార్థినులకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ, అన్నం తక్కువగా, కూరలు, ఆకుకూరలు, పప్పు, గుడ్లు వంటి పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడ్డించిన కూరలను పూర్తిగా తినాలని, ఆహారాన్ని వృథా చేయకూడదని చెప్పారు. విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఉపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేకంగా పర్యవేక్షించి ప్రతి విద్యార్థి సరైన మోతాదులో పోషకాహారం తీసుకునేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

## బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలి

**పాపన్నపేట, జూన్ 27 (జనంసాక్షి) :** న్యాయం కోసం ఠాణాను ఆశ్రయించే బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం పాపన్నపేట ఠాణాను సందర్శించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పలు రికార్డులు,సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేసి, స్వాధీన వాహనాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. తప్పిపోయిన (మిస్సింగ్), దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రత్యేక కార్యాచరణతో త్వరగా పరిష్కరించాలని,ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమ గ్రామాలపై పూర్తి అవగాహనతో గ్రామ పెద్దలు,యువతతో సమన్వయం కొనసాగించాలన్నారు. రౌడీ షీటర్ల చరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ,నేర నియంత్రణకు ఆధునిక సాంకేతిక వేదికలను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. సిబ్బంది బస్వరాజ్‌కు రివార్డు మంజూరు చేశారు. మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్,సీఐలు..రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సిబ్బంది ఉన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పనితీరు అభినందనీయం

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 27 (జనం సాక్షి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక అమలుపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి విచ్చేసిన లిలిప్రత్యేక అధికారి శ్రీమతి బి. విజయేంద్ర, ఐఏఎస్., కార్యదర్శి, ఎస్సీడీ, కార్యదర్శి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ ఉ కమిషనర్, ఎస్సీడీ (ఎఫ్ఏసీ)కు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పూలమొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై 10 శాఖలకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి జిల్లా అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బి. విజయేంద్ర మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో ముందంజలో నిలిపి మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రతి లబ్ధిదారుని వద్దకు చేరేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న మంచి కార్యక్రమాలు, విజయగాథలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కోరారు. 99 రోజుల కార్యాచరణలో చేపట్టిన పనులను శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో అమలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటివరకు సమర్థవంతంగా పనిచేస్తున్న జిల్లా అధికారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలిగారని తెలిపారు. విద్యా రంగంలో అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచాలని, విద్యాశాఖ చేపడుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కృషి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంక్షేమ హాస్టళ్లలో పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు దోమతెరలను వినియోగించడంతో పాటు అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. హాస్టళ్లలో ఏవైనా మరమ్మత్తుల అవసరం ఉంటే వెంటనే పూర్తి చేయించాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా



అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే, ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# డాలర్ డిపాజిట్లు రూపాయిని ఆదుకునేనా?



**న్యూఢిల్లీ:**అంతర్జాతీయ అనిశ్చితికి తోడు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు మనదేశం నుంచి భారీగా వెనక్కి వెళ్లిపోతుండటంతో.. అమెరికా డాలర్‌తో పోలిస్తే మన రూపాయి మారకపు విలువ పరంగా ఇటీవల తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంది. రూపాయి పతనాన్ని అడ్డుకొని, దేశంలోకి డాలర్ల ప్రవాహాన్ని వేగంగా పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన పాత వ్యూహానికే పదును పెట్టింది. ప్రవాసులు (ఎన్ఆర్ఐ) జమ చేసే విదేశీ కరెన్సీ ప్రధానంగా డాలర్ డిపాజిట్లపై వడ్డీ రేట్లకు గరిష్ఠ పరిమితులను సడలించడంతో పాటు, కొన్ని కాలపరిమితులపై అయ్యే హెడ్జింగ్ ఖర్చును తానే భరిస్తానని ప్రకటించింది. ఈ చర్య రూపాయికి సత్వరం ఊరట కలిగిస్తున్నా, స్థూల ఆర్థిక వ్యవస్థ పరంగా విదేశీ అప్పుల భారం తీవ్రమయ్యే ప్రమాదాలున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆర్‌బీఐ తాజా నిబంధనల ప్రకారం, ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ బ్యాంక్ (ఎఫ్‌సీఎన్ఆర్-బి) డిపాజిట్ ఖాతాల్లో మూడేళ్లలోపు డిపాజిట్లపై గ్లోబల్ బెంచ్‌మార్క్ రేటు (సుమారు 3.63%) కంటే 2.5% అదనపు వడ్డీ అందించేందుకు బ్యాంకులకు అనుమతి లభించింది. దీంతో ఎన్ఆర్ఐలు మూడేళ్లలోపు డిపాజిట్లపై గరిష్ఠంగా 6.13% వరకు రాబడి పొందొచ్చు. మూడేళ్లు పైబడిన డిపాజిట్ల వడ్డీరేటుపై పరిమితిని ఆర్‌బీఐ తొలగించింది. హెడ్జింగ్ వ్యయాన్ని ఆర్‌బీఐ భరిస్తుండటంతో, విదేశీ డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు భారీగా వడ్డీ రేట్లు పెంచుతున్నాయి. 2026 మార్చి చివరికి భారతీయ బ్యాంకుల్లో మొత్తం ఎన్ఆర్ఐ డిపాజిట్లు 165 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.67 లక్షల కోట్లు) ఉండగా, ఇందులో విదేశీ కరెన్సీ డిపాజిట్ల వాటా 20 శాతమైన దాదాపు 33 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3.13 లక్షల కోట్లు)గా ఉంది. 2013లో యూఎస్ ట్రెజరీ రాబడులు పెరిగి రూపాయి పతనమైనప్పుడు, ఆర్‌బీఐ ఈ వ్యూహాన్నే అమలు చేసింది. అప్పుడు 3 నెలల్లోనే 24.5 బిలియన్ డాలర్ల ఎన్ఆర్ఐ డిపాజిట్లు దేశంలోకి పోటెత్తి, పరిస్థితిని చక్కదిద్దాయి. ఇప్పుడు ఎలా వస్తాయో చూడాలి.

**సవాళ్లు ఉన్నాయ్**

ఆర్‌బీఐపై ఆర్థిక భారం: బ్యాంకులు డాలర్లలో నిధులు సమీకరిస్తున్నందున, తీవ్రమైన విదేశీ మారక ద్రవ్య నష్టభయం ఉంటుంది. వాణిజ్య బ్యాంకుల ఫారెక్స్ రిస్క్‌ను ఆర్‌బీఐ తన భుజానికెత్తుకుంటోంది. 3 నుంచి 5 ఏళ్ల కాలపరిమితి ఉన్న ఎన్ఆర్ఐ డిపాజిట్లపై హెడ్జింగ్ ఖర్చును ఆర్‌బీఐ భరించడం వల్ల, భవిష్యత్తులో రూపాయి విలువ మరింత క్షీణిస్తే ఆర్‌బీఐ చెల్లించాల్సిన ప్రీమియం వ్యయం భారీగా పెరిగి బ్యాలెన్స్ షీట్‌పై భారం పడుతుంది. అస్థిరంగా: ఈ విదేశీ డిపాజిట్లు అత్యంత అస్థిరమైనవి. అంతర్జాతీయ మార్కెట్లలో వడ్డీ రేట్లు పెరిగినా, అనిశ్చితి ఏర్పడినా ఎన్ఆర్ఐలు తమ నిధులను మళ్లీ ఉపసంహరించుకునే ప్రమాదం ఉంది. 1991 గల్ఫ్ యుద్ధ సంక్షోభంలోనూ భయాందోళనలకు గురైన ఎన్ఆర్ఐలు, ఒక్కసారిగా డిపాజిట్లు వెనక్కి తీసుకోవడంతో మన ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది.

**బ్యాంకుల మార్జిన్లపైనా ప్రభావం:**

బ్యాంకులు పోటీపడి ఈ డిపాజిట్లకు 6% నుంచి 7.1% వరకు వడ్డీ చెల్లిస్తున్నందున, నిధుల సేకరణ వ్యయం అధికమవుతోంది. ఇంతకుమించిన వడ్డీపై వీటిని రుణాలుగా ఇవ్వలేకపోతే, బ్యాంకుల నికర వడ్డీ మార్జిన్లు తీవ్రంగా దెబ్బతింటాయి. విదేశీ అప్పు-ఫారెక్స్ నిల్వలు: ఈ డిపాజిట్లు.. ఎగుమతుల ద్వారా లభించే/ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి) లాగా వచ్చే శాశ్వత నిధులు కావు. నిర్ణీత గడువు తర్వాత వడ్డీ సహా విదేశీ కరెన్సీలోనే తిరిగి చెల్లించాల్సిన స్వల్పకాలిక అప్పులు. 2013లో ఈ వ్యూహం అమలు చేసినప్పుడు విదేశీ మారకపు ద్రవ్య నిల్వలతో పోలిస్తే దేశ స్వల్పకాలిక అప్పుల నిష్పత్తి 27% కాగా, ఇప్పుడు 33 శాతానికి పెరిగింది. భౌగోళిక కేంద్రీకరణ: 2025 డిసెంబరు నాటి లెక్కల ప్రకారం మొత్తం ఎఫ్‌సీఎన్ఆర్-బి డిపాజిట్లలో 75% నిధులు యూఏఈ (54.1%), అమెరికా (14.6%) దేశాల నుంచే వచ్చాయి. సింగపూర్ (6.4%), యూకే (6.2%)లను కూడా కలిపితే ఇది 81 శాతానికి చేరుతుంది. కేవలం కొన్ని దేశాల ఆర్థిక పరిస్థితులపై మాత్రమే ఆధారపడటం కాస్త సవాలుతో కూడుకున్నదే. అందువల్ల ఆర్‌బీఐ ఈ నిధుల ప్రవాహాన్ని అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాల్సి ఉంది.

## అంతర్జాతీయ దిగ్గజాల పెట్టుబడులు రూ.8.55 లక్షల కోట్లు

**మనదేశంలో పెడతామని హామీ**

**అనిశ్చితుల్లోనూ ఆకర్షణీయ గమ్యస్థానం మనదే**

**న్యూఢిల్లీ:**అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్న నేపథ్యంలోనూ, ప్రపంచంలోని దిగ్గజ కార్పొరేట్ సంస్థలు, సంస్థాగత పెట్టుబడిదారులు తాజా పెట్టుబడులకు మనదేశాన్ని ఎంచుకున్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు - వ్యాపార అనిశ్చితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధిరేటును సాధిస్తుండటమే ఇందుకు కారణం. గత కొన్ని నెలల్లో అంతర్జాతీయ సంస్థలు మనదేశంలో పెడతామని ప్రతిపాదించిన పెట్టుబడుల విలువ 90 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.55 లక్షల కోట్లు) మించడం ఇందుకు నిదర్శనం. సరఫరా వ్యవస్థలను ఒకే దేశంలో కేంద్రీకరించడానికి బదులు భిన్న విపణులకు విస్తరించే ధోరణి కూడా ఉపకరించింది. ఈ రంగాల్లో: ఏఐ క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక వసతులు, తయారీ, పారిశ్రామిక సాంకేతిక రంగాల్లోకి భారీ పెట్టుబడి ప్రకటనలు వచ్చాయి.

గూగుల్: దేశంలో ఏఐ మౌలిక వసతుల విస్తృతికి 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని అమెరికా సాంకేతిక దిగ్గజం గూగుల్ ఈ ఏడాది ఫిబ్రవరిలో వెల్లడించింది. డేటా కేంద్రాలు, సముద్రగర్భ కేబుల్, క్లౌడ్‌సామర్థ్యం, ఉద్యోగులకు నైపుణ్యాలు నేర్పేందుకు ఈ మొత్తాన్ని కేటాయించనుంది.

అమెజాన్: అమెరికా ఇకామర్స్ దిగ్గజమైన అమెజాన్ మనదేశంలో 2030 నాటికి మరో 13 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని ప్రకటించింది. క్లౌడ్ వసతులు, ఏఐ, డిజిటల్ సేవలకు ఈ నిధులు వినియోగిస్తారు. ఆరు నెలల క్రితం ప్రకటించిన 35 బి.డా. కు ఇవి అదనం.

ఎయిర్‌ట్రంక్: ఆస్ట్రేలియా డేటా కేంద్రాల సంస్థ ఎయిర్‌ట్రంక్, 2030 కల్లా మనదేశంలో 5 గిగావాట్ల డేటాకేంద్రాలను 30 బి.డా. (సుమారు రూ.2.85 లక్షల కోట్ల)తో పెడతామని తెలిపింది.

సెయింట్‌గోబైన్: ఫ్రాన్స్‌కు చెందిన భవన నిర్మాణ పదార్థాల తయారీ సంస్థ సెయింట్‌గోబైన్ మరో 1.15 బి.డా. (సుమారు రూ.11,000 కోట్లు) రాబోయే అయిదేళ్లలో పెడతామని ప్రకటించింది.

## ఓపెన్ ఏఐ భారత్ ఎండీగా ప్రభ్‌జీత్ సింగ్

**న్యూఢిల్లీ:**ఏఐ మార్కెట్ విస్తృతమవుతోన్న వేళ.. శామ్ ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ తన కార్యకలాపాలను మరింత ముమ్మరం చేస్తోంది. భారత్‌లో ఆ సంస్థ పగ్గాలను ప్రభ్‌జీత్ సింగ్‌కు అప్పగించాలని నిర్ణయించింది. సెప్టెంబరులో భారత్ ఓపెన్ ఏఐ మెనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపడతారని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఓపెన్ ఏఐకు భారత్ ఓ కీలక మార్కెట్ అని ఇప్పటికే శామ్ ఆల్ట్‌మన్ విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ తమ ఉనికిని మరింత విస్తరించాలనే లక్ష్యంతో ప్రభ్‌జీత్ సింగ్‌ను ఎండీగా నియమించినట్లు తెలుస్తోంది. కంపెనీ కన్స్యూమర్ గ్రోత్, ఎంటర్‌ప్రైజ్ అడాప్షన్, వ్యూహాత్మక భాగస్వామ్యాల రెగ్యులేటరీ వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. సింగ్ నేతృత్వంలో భారత్ వినియోగదారులకు, వ్యాపారులు, ప్రభుత్వ కార్యకలాపాలకు ఓపెన్ ఏఐ ద్వారా మరిన్ని ప్రయోజనాలు అందుతాయని కంపెనీ విశ్వసిస్తోంది. కాగా, ఓపెన్ ఏఐ తన కంపెనీ తొలి ఆఫీస్‌ను దిల్లీలో 2025లోనే ఏర్పాటుచేసింది. ప్రభ్‌జీత్ సింగ్ ఉబర్‌లో 11 ఏళ్లపాటు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహించారు. ఆయన రాజీనామాను ఉబర్ కూడా ప్రకటించింది. భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓపెన్ ఏఐ పేర్కొంది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,45,800 | ₹ 1,59,060 |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,95,000

## భవిష్యనిధిలో 25% కనీస నిల్వ తప్పనిసరి

**ఈపీఎఫ్ ఐటీ వ్యవస్థలో కీలక మార్పులు**

**జులై 1 నుంచి అమల్లోకి వచ్చేలా కార్యాచరణ**

హైదరాబాద్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) త్వరలో కొత్త పథకాలను అమల్లోకి తీసుకురానుంది. ఇకపై వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలో 25% కనీస నిల్వను తప్పనిసరి చేయనుంది. ఉపసంహరణల పరిమితి సంఖ్యను పెంచనుంది. యూపీఐ ద్వారా నేరుగా పీఎఫ్ క్లెయిం చేసుకోవడంతోపాటు ఆటోమేషన్‌లో వేగంగా ఆమోదం లభిస్తే వెంటనే ఆ నగదు సత్వరమే బ్యాంకు ఖాతాలో జమయ్యేలా మార్పులు చేస్తోంది. ఈ మేరకు ఈపీఎఫ్‌వో కేంద్రీకృత ఐటీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తోంది. ఈపీఎఫ్‌వో పాస్‌బుక్, మెంబర్ పోర్టల్, యాజమాన్యాల పోర్టల్‌తోపాటు వెబ్‌సైట్‌ను ఈ నెల 30 వరకు మూసివేసి, క్లెయిం పరిష్కార వ్యవస్థను నిలిపివేసింది. ప్రస్తుతమున్న వెబ్‌సైట్‌ను ఆధునికీకరించడంతోపాటు క్లెయిం పరిష్కారానికి ఆటోమేషన్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేస్తోంది. కొత్త వెబ్‌సైట్, క్లెయిం వ్యవస్థ, నూతన పథకాలు, ఐటీ వ్యవస్థలను జులై 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఐటీ వ్యవస్థ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా.. ఉద్యోగులకు 2025-26 ఏడాదికి నిర్ణయించిన 8.25% వడ్డీని ఈ నెల 30లోగా ఖాతాల్లో జమ చేయనుంది. జులై 1న వడ్డీ జమతో కూడిన నగదు నిల్వల వివరాలు వెల్లడించనుంది. ఉద్యోగులు, కార్మికుల వ్యక్తిగత ఈపీఎఫ్ నిధిలో కనీసం 25% నిల్వ ఉంచి మిగిలిన మొత్తాన్ని మాత్రమే ఉపసంహరించుకునేలా ఇప్పటికే సీబీటీ ఆమోదం తెలిపింది. తరచూ ఉపసంహరణలతో కార్మికులకు పదవీ విరమణ సమయంలో చేతిలో నిధులు ఉండటం లేదని గుర్తించింది. చేతికి రూ.20 వేలు కూడా రాని కార్మికుల సంఖ్య ఎక్కువ ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో పదవీ విరమణ తర్వాత కార్మికులు గౌరవప్రదమైన జీవనం కొనసాగించేందుకు వీలుగా 25% కనీస నిల్వగా నిర్ణయించింది. అంటే.. ప్రతి ఉద్యోగి క్లెయిం దరఖాస్తు నాటికి ఉద్యోగి, యజమాని వాటాలు, ఆ మొత్తంపై వడ్డీ కలపగా వచ్చేది మొత్తం భవిష్యనిధి నిల్వ అవుతుంది. అందులో కనీస నిల్వ ఉంచి.. మిగతా మొత్తం నుంచి మాత్రమే ఉపసంహరణలకు అనుమతిస్తారు. ఇంతవరకు కనీస నిల్వ నిర్వహించాలనే నిబంధన లేదు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్)-2026, ఉద్యోగుల పింఛను పథకం(ఈపీఎస్)-2026 పథకాలను అమల్లోకి తీసుకురానుంది. ఈపీఎఫ్-1952, ఈపీఎస్-1995 పథకాల స్థానంలో ఇవి రానున్నాయి. ఇటీవల జరిగిన ఈపీఎఫ్‌వో కేంద్ర ట్రస్టీ బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది.

# పెట్రో ధరలు తగ్గించేదెన్నడో..

**బ్యారెల్ ముడి చమురు 70 డాలర్ల దిగువక • పశ్చిమాసియా ఉద్రిక్తతల ముందు స్థాయికి**

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో గణనీయంగా పెరిగిన ముడి చమురు ధరలు.. మళ్లీ భారీగా తగ్గాయి. శుక్రవారం చూస్తే అమెరికా ముడిచమురు ధర బ్యారెల్ 68 డాలర్ల వద్ద, బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 71 డాలర్ల వద్ద కదలాడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించడానికి ముందు ఉన్న ధరలే ఇవి. చమురు అవసరాల్లో 89% మేర దిగుమతులే తీరుస్తున్న మనదేశానికి, ఇది ఎంతో ఊరట కలిగించే అంశం. దిగుమతి బిల్లు భారం తగ్గి, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగవుతోంది. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం తగ్గింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో బ్యారెల్ ముడి చమురు ధర ఒక దశలో 120 డాలర్లకు చేరడంతో తీవ్ర ఆందోళన తలెత్తిన సంగతి విదితమే. అంతర్జాతీయంగా ముడిచమురు ధర పెరగడంతో మే నెల వరకు దేశీయంగా పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించకున్నా, పారిశ్రామిక -వాణిజ్య అవసరాలకు కొనుగోలు చేసే బల్క్ ధరలను గణనీయంగా పెంచారు. విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరను దేశీయ సంస్థలకు పరిమితంగా పెంచినా, అంతర్జాతీయ సర్వీసులకు మాత్రం భారీగా పెంచారు. ఈ ప్రభావం విమాన టికెట్లపై పడింది. మరోవైపు ఇంధన రిటెయిల్ విక్రయ సంస్థలకు నష్టాలు పెరిగిపోతున్నాయంటూ మేలో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.7.50 వరకు పెంచారు. వాణిజ్య సిలిండర్ ధర రూ.3,000కు చేరగా, ఇళ్లకు వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1,000 సమీపానికి చేరింది. ఇప్పుడు ముడిచమురు ధర మళ్లీ పూర్వస్థాయికి తగ్గినందున, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఎప్పటినుంచి సవరిస్తాయో చూడాలి.



యుద్ధం ప్రారంభానికి ఒక రోజు ముందు (ఫిబ్రవరి 27న) బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ సగటు ధర 71.17 డాలర్లు కాగా, జూన్ 26న సగటు ధర 71 డాలర్లకు దిగి వచ్చిందని పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ (పీపీఏసీ) వెల్లడించింది. జూన్‌లో ఇప్పటి వరకు మన దేశ ముడి చమురు కొనుగోలు సగటు ధర 86.31 డాలర్లుగా నమోదైంది. ఫిబ్రవరిలో ఇది 72.47 డాలర్లుగా ఉంది. హర్మూజ్ జల సంధి ద్వారా ముడి చమురు నౌకల రవాణా సాఫీగా సాగుతుండటంతో ధరలు తగ్గుతున్నాయి. ముడి చమురు ధరలు తగ్గితే రిటెయిల్ ద్రవ్యోల్బణంపైనా ఒత్తిడి తగ్గుతుంది. రవాణా, తయారీ వ్యయాలు తగ్గుతాయి. ముడిచమురు ధరలకు అనుగుణంగా పెట్రో ఉత్పత్తుల ధరలను నిర్ణయించే విధానాన్ని ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టింది. ప్రతినెలా 1వ తేదీన ఏటీఎఫ్ ధరను ఇలానే సవరిస్తున్నా.. పలు కారణాల వల్ల పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలతో పాటు గృహావసర వంటగ్యాస్ సిలిండర్ల ధరను సవరించడం లేదు. వాణిజ్య అవసరాలకు వాడే ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై ఆంక్షలను తొలగించిన కంపెనీలు, జులై 1న గ్యాస్ ధరలను కూడా సవరిస్తాయేమో వేచి చూడాల్సి ఉంది. యుద్ధం వల్ల అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగినా, రెండున్నర నెలల పాటు చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలు పెంచలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు అధిక ధరలకు కొన్న ముడిచమురుతో ఉత్పత్తి చేసిన డీజిల్ విక్రయాలతో మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు నష్టాలు చవిచూస్తున్నాయని, పెట్రోల్‌పై మాత్రం ఆరోగ్యకర మార్కెటింగ్ మార్జిన్ లభిస్తోందని పేర్కొంటున్నారు. చమురు ధరలు తగ్గితే విమానయానం, వాహనాలు, రంగులు, రసాయనాలు, లాజిస్టిక్స్, వినియోగదారు వస్తువుల రంగాలకు కలిసిరావొచ్చు. ఇప్పటికే ఇంధన ఇంటెన్సివ్ కంపెనీల షేర్లు సానుకూలంగా స్పందిస్తున్నాయి.

## ఏటీఎఫ్ ధర తగ్గితే, సర్వీసులు పునరుద్ధరిస్తాం

**ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్**

ముడిచమురు ధరకు అనుగుణంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర బాగా పెరిగిన నేపథ్యంలో పలు విమానయాన సంస్థలు తమ సర్వీసుల సంఖ్యను తాత్కాలికంగా తగ్గించిన సంగతి విదితమే. పశ్చిమాసియా యుద్ధం ఆగి, చమురు ధర మళ్లీ పూర్వస్థితికి చేరుతున్న నేపథ్యంలో.. సర్వీసుల కోతపై పునరాలోచిస్తామని టాటా గ్రూప్ విమానయాన సంస్థ ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ శుక్రవారం తెలిపారు. ఏటీఎఫ్ ధరలు తగ్గడంతో పాటు, వివిధ దేశాలు ప్రకటించిన గగనతల ఆంక్షలు తొలగితేనే ఇది సాధ్యపడుతుందని వివరించారు. అంతర్జాతీయ సర్వీసుల్లో 27%, దేశీయ సర్వీసుల్లో 22 శాతంపై తాత్కాలికంగా కోత విధిస్తున్నట్లు గత నెలలో ఎయిరిండియా ప్రకటించిన సంగతి విదితమే. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగకుండా ఉండాలనీ విల్సన్ ఆకాంక్షించారు. ఈ ఏడాది సరికొత్త బీ787-9 విమానంతో పాటు నవీకరించిన 8 వైడ్‌బాడీ విమానాలు సేవలు ప్రారంభించనున్నాయని తెలిపారు.







**రానున్న రెండేళ్లలో.. 500 సిటీల్లో**

## భారత్ ట్యాక్సీ సేవలు

దిల్లీ: ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలపై కేంద్రమంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారత్ ట్యాక్సీని తరిమికొట్టేందుకు కొన్ని ప్రైవేట్ రవాణా సేవా సంస్థలు ఛార్జీలను తగ్గిస్తున్నాయని పేర్కొన్నారు. ఆయా కంపెనీలు నష్టాల్లో ఉన్నా కూడా.. భారత్ ట్యాక్సీ పతనమే లక్ష్యంగా అక్రమ రీతిలో పోటీ విధానాలు పాటిస్తున్నాయని మండిపడ్డారు. అయినప్పటికీ.. ఈ విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు. మరో రెండేళ్లలో భారత్ ట్యాక్సీ సేవలను దేశవ్యాప్తంగా 500కు పైగా సిటీల్లో అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. గుజరాత్‌లోని 14 ప్రధాన నగరాల్లో భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించిన అనంతరం షా ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ట్యాక్సీ యాప్‌లో ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని వస్తున్న వార్తలు నిజం కాదని.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ ట్యాక్సీ సేవలు ప్రారంభమైన నగరాల్లో ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు డ్రైవర్లకు అధిక కమిషన్లు ఇవ్వడం.. ఈ సేవలు మార్కెట్లోకి ప్రవేశించకుండా ఆపడానికి ఛార్జీలను తగ్గించడం వంటి అక్రమ మార్గాలను అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. ఎవరెన్ని చేసినా భారత్ ట్యాక్సీలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రైవేట్ కంపెనీలు తమ సొంత లాభం కోసం డ్రైవర్లను, వినియోగదారులను ఇద్దరినీ దోపిడీ చేస్తున్నాయని అమిత్ షా విమర్శించారు. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే.. డ్రైవర్ మాట వినకుండా వెంటనే వారి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నాయని దుయ్యబట్టారు. అటువంటి కంపెనీల దోపిడీ విధానాన్ని అంతం చేయడానికే భారత్ ట్యాక్సీని తీసుకువచ్చామన్నారు.

## వెనెజువెలా విలయం.. రూ.63వేల కోట్ల నష్టం

భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఉద్విగ్న వాతావరణం కనిపిస్తోంది. లాగువేరా రాష్ట్రం జంట భూకంపాలతో తీవ్రంగా ప్రభావితమైంది. రెస్క్యూ సిబ్బంది ఈ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యమవుతుండటంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎనిమిది అంతస్తుల భవనం కూలడంతో తన ఐదేళ్ల కుమారుడు, మరికొంతమంది బంధువులు చిక్కుకుపోయారని జెన్నిఫర్ అనే మహిళ వాపోయారు. ప్రభుత్వ సహాయం ఆలస్యమవుతుండటంతో స్థానికులే చాలామందిని రక్షించారని, అయితే భారీ కాంక్రీటు స్లాబులు ఎత్తడానికి క్రేన్లు, భారీ యంత్రాల అవసరం ఉందన్నారు. ఈ ప్రకృతి విపత్తుతో వెనెజువెలాకు ప్రత్యక్షంగా 6.7 బిలియన్ డాలర్ల (రూ.63వేల కోట్ల) మేర నష్టం వాటిల్లిందని ఐరాస అంచనా వేసింది. పరోక్ష ప్రభావాన్నీ లెక్కిస్తే ఇంకా ఎక్కువే ఉండొచ్చని అభిప్రాయపడింది. దీంతో ఆ దేశంలో సంభవించిన అత్యంత ఘోరమైన విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే రాజకీయ అస్థిరత, ఆర్థిక సమస్యల కారణంగా వ్యవస్థలు అక్కడి బలహీనపడ్డాయి. ఇప్పుడు విపత్తు కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులైనప్పటికీ.. వారికి ఆశ్రయం కల్పించలేని పరిస్థితి నెలకొంది. భూకంపాల తీవ్రత వల్ల ఇళ్లలోకి వెళ్లలేనివారు కార్లలోనే నిద్రపోతున్నారు. పార్కుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దాదాపు మూడుకోట్ల జనాభా కలిగిన ఆ దేశంలో సగంమందిపైగా పేదరికంలోనే మగ్గిపోతున్నారు. భూకంపాలు రాకముందే 80 లక్షల మందికి మానవతా సహాయం అవసరమైన పరిస్థితులున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## ఇల్లు అప్పగింత ఆలస్యమైతే.. పరిహారం కోరవచ్చు: సుప్రీం

వెల్లడించింది. ఇల్లు కొన్న తర్వాత.. రియల్ ఎస్టేట్ కంపెనీల వైఫల్యానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసే హక్కు ఉండదని భావించడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు నేషనల్ కన్స్యూమర్ డిస్‌ప్యూట్ రీడ్రెసల్ కమిషన్ ఇచ్చిన 2016 నాటి ఉత్తర్వులను పక్కనబెట్టింది. దిల్లీలోని ఓ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీలో 2003లో సభ్యుడిగా చేరి.. ఫ్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఫ్లాట్ స్వాధీనం విషయంలో ఎటువంటి అభ్యంతరం లేకుండానే దానిని తీసుకున్నందున.. ఫిర్యాదు దాఖలు చేసే సమయానికి సదరు వ్యక్తి 'వినియోగదారుడు' కాదనే జాతీయ కమిషన్ వాదనను సుప్రీం కోర్టు తప్పుబట్టింది. గృహ కొనుగోలుదారు తనకు కలిగిన అసౌకర్యానికి వినియోగదారుల ఫోరమ్‌కు ఫిర్యాదు చేయకుండా రియల్ ఎస్టేట్ కంపెనీతో చేసుకున్న ఒప్పందంలోని మధ్యవర్తిత్వ నిబంధన అడ్డుకోలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఫిర్యాదు దాఖలు చేయడానికి ముందే ఇంటిని స్వాధీనం చేసుకున్నారనే కారణంతో పిటిషనర్ 'వినియో గదారు' హోదాను కోల్పోయారని భావించకూడదని జాతీయ కమిషన్‌కు సూచించింది. వస్తువులు లోపం లేదా సేవలలో లోపం గురించి ఫిర్యాదు చేయడానికి వినియోగదారులు 'వినియోగదారుల రక్షణ చట్టం భరోసా పొందాలని సుప్రీం కోర్టు సూచించింది. వినియోగదారులకు వేగవం తమైన పరిష్కారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపింది.

## ఐపీఓల్లో సంపద సృష్టించే షేర్లు కొన్నే

**న్యూఢిల్లీ:**ప్రస్తుత సంవత్సరంలో భారత ప్రైమరీ మార్కెట్ పెట్టుబడిదార్లకు మిశ్రమ ఫలితాలను అందించింది. అయితే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కొత్తగా నమోదయ్యాక కొన్ని కంపెనీల షేర్లు పెట్టుబడిదార్లకు గణనీయ సంపదను సృష్టించి ప్రత్యేకంగా నిలిచాయి. వీటిల్లో ప్రముఖంగా చెప్పుకోవాల్సింది గ్రీన్ టెక్నాలజీస్, మెరిట్రోనిక్స్. విలువపరంగా గ్రీన్ టెక్నాలజీస్ అత్యధిక సంపదను సృష్టించగా.. శాతం పరంగా మెరిట్రోనిక్స్ మదుపర్లకు అత్యుత్తమ ప్రతిఫలాన్ని అందించింది. మెరిట్రోనిక్స్ ఐపీఓ జూన్ 1-3 తేదీల్లో జరిగింది. జూన్ 8న ఈ కంపెనీ షేర్లు రూ.283.10 ధర వద్ద స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. ఇష్యూ ధర రూ.149తో పోలిస్తే ఇది 90% అధికం. తొలి రోజు ముగిసేనాటికి మదుపర్లకు 99.5 శాతం ప్రతిఫలాన్ని అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.260.52 కోట్ల నుంచి రూ.796.78 కోట్లకు పెరిగి, మదుపర్లకు రూ.536.66 కోట్ల సంపదను సృష్టించింది. లిస్టింగ్ తర్వాత కూడా ఈ షేరును అట్టేపెట్టుకున్న మదుపర్లు 205.84% ప్రతిఫలాన్ని పొందడం గమనార్హం. తద్వారా ఇది 2026 ఐపీఓలో అతిపెద్ద మల్టీబ్యాగర్ షేర్లలో ఒకటిగా నిలిచింది. పెట్టుబడిదార్లకు ఆకర్షణీయ ప్రతిఫలాన్ని అందించిన మరో సంస్థ సుసాన్ ఎలక్ట్రికల్స్ ఇండియా. ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై ఈ సంస్థ షేర్లు జూన్ 18న రూ.186 ధర వద్ద నమోదై, రూ.195.30 వద్ద ముగిశాయి. ఇష్యూ ధర రూ.127తో పోలిస్తే తొలి రోజే 53.78% ప్రతిఫలాన్ని మదుపర్లకు పంచింది. కంపెనీ మార్కెట్ విలువ ఐపీఓ దశలోని రూ.258.20 కోట్ల నుంచి రూ.452.36 కోట్లకు పెరిగింది. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన తర్వాత కూడా ఈ షేరు రాణిస్తూ, ఇప్పటివరకు మొత్తంగా మదుపర్లకు 75% మేర ప్రతిఫలాన్ని పంచింది. రూ.630.88 కోట్ల సమీకరణ లక్ష్యంతో సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ జూన్ 3-5 తేదీల్లో ఐపీఓకు వచ్చింది. అదే నెల 10న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ షేరు నమోదైంది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.192తో పోలిస్తే 43% అధికంగా రూ.275.40 ధర వద్ద ప్రారంభమైన ఈ షేరు ట్రేడింగ్.. తొలి రోజు ముగిసేనాటికి 25.62 శాతం ప్రతిఫలాన్ని అందించింది. ఐపీఓ సమయంలో కంపెనీ మార్కెట్ విలువ రూ.4,205.87 కోట్లు కాగా.. ప్రస్తుతం రూ.5,408 కోట్లకు పెరిగింది. అంటే వాటాదార్ల సంపద విలువ రూ.1,202 కోట్లు పెరిగింది. తద్వారా సంపద సృష్టిపరంగా ఈ ఏడాది ఐపీఓల్లో అగ్రగామి సంస్థగా సీఎంఆర్ గ్రీన్‌టెక్నాలజీస్ నిలిచింది. ఈ ఏడాది ఐపీఓకు వచ్చిన కంపెనీల షేర్లలో ఆరేట్ ట్రేడ్ అత్యంత బలహీనమైన పనితీరు కనబర్చిన వాటిల్లో ఒకటిగా నిలిచింది. ఇష్యూ ధర కంటే తక్కువ ధరకు ట్రేడ్ అవుతున్న కంపెనీల్లో ఆరియేట్ ట్రేడ్‌తో పాటు ఉత్కల్ స్పెషాలిటీ, ఎస్ఎంఆర్ జ్యువెల్స్, జెన్‌క్సాయి అనలిటిక్స్ లాంటివి ఉన్నాయి.



# గంగులా దమ్ముంటే సవాల్ స్వీకరించు..!

- కెసిఆర్ హాయంలో 15 టిఎంసిల కంటే ఎన్నడూ తగ్గలేదన్నావు గదా?
- బిఆర్ఎస్ హాయంలో ఇదే సీజన్ లో 7 టిఎంసిల స్టోరేజ్ అధికారిక రికార్డులు
- 15 టిఎంసిల స్టోరేజ్ నిరూపించకపోతే రాజీనామా చేయ్ లేదా నేను నిరూపించకపోతే ముక్కు నేలకు రాస్తా : కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, జూన్ 27 (జనంసాక్షి) :** మానేరు డ్యాంలో నీళ్లు లేవని తాగునీటికి కూడా సరిపోవని కేసీఆర్ హాయంలో ఎన్నడూ డ్యాం నీటిమట్టం టిఎంసిల కంటే తగ్గలేదని ప్రజలను తప్పుదోవపట్టిస్తూ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డ్యాంలో ఆటలు ఆడి డ్రామాలాడారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఉదయం గంగుల డ్యాంకు వెళ్లి ఆటలాడుతే సాయంత్రం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్త లతో వెళ్లి నీటిని పరిశీలించి మీ హాయంలో ఇదే సీజన్ లో 15 టిఎంసిల కంటే ఎన్నడూ తగ్గలేదన్నావ్ గదా.. ఇదిగో అధికారిక ఆధారాలు చూపిస్తున్న దమ్ముంటే నాసవాలును స్వీకరించు, నిరూపిస్తే నేను ముక్కు నేలకు రాస్తా నిరూపించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్ అని నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు. ఇప్పుడున్న 5.8 టిఎంసిలలో డెడ్ స్టోరేజ్ పోను 2 టిఎంసిలు నీళు ,, రాబోయే నెలల వరకు కరీంనగర్ నగర ప్రజల త్రాగు నీటికి మిషన్ భగీరథకు సరిపోతుందని ఈ లోగా వర్షాలు కురుస్తాయని ఒకవేళ ఇంకా ఇబ్బందయితే మిడ్ మానేరులో 4 టిఎంసిలు అదనంగా ఉన్నాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కమీషన్ల కక్కుర్తితో కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసింది చాలక, కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేస్తే నీళ్లు వచ్చేవని మాట్లాడుతున్నారని అదేమన్నా ప్యాచ్ వేస్తే ఆగేదా అని ఎద్దేవా చేశారు. ఇటువంటి డ్రామాలు, అబద్ధాలు ఆపకపోతే మీరు డ్యాంలో ఫుట్ బాల్ ఆడింద్రు గదా ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో ప్రజలే మిమ్ములను ఫుట్ బాల్ ఆడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పోరేటర్ పర్వతాల మల్లేశం, గోపు మల్లారెడ్డి, లయాక్, చర్ల పద్మ, నెల్లి నరేష్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, అస్థాపురం తిరుమల, మహాలక్ష్మి, కంది అశోక్ రెడ్డి, బషీర్, షెహన్షా, మాసుం ఖాన్, రాజ్ కుమార్, హనీఫ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ధాన్యం రాజకీయం

- రూ.91 లక్షల కుంభకోణంపై కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల మంటలు
- ఆరోపణలకు ప్రత్యారోపణలు
- ప్రెస్‌మీట్లతో హీటెక్కిన రాజకీయ సమరం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 26 (జనంసాక్షి):** వరి ధాన్యం కొనుగోళ్లలో రూ.91 లక్షల కుంభకోణం జరిగిందనే ఆరోపణలతో వేములవాడ రాజకీయాలు గత వారం రోజులుగా వేడెక్కాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు వరుసగా మీడియా సమావేశాలు నిర్వహిస్తూ ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకోవడంతో రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠగా మారింది. కౌంటర్‌కు కౌంటర్ కాదు... ఎన్కౌంటర్ అన్నట్టుగా సాగుతున్న మాటల యుద్ధం పట్టణంలో ప్రధాన చర్చనీయాంశమైంది.

ధాన్యం అక్రమాల వెనుక కాంగ్రెస్ నాయకుల పాత్ర ఉందంటూ బీఆర్ఎస్ నాయకులు ఫొటోలు, పలు వివరాలతో మీడియా ముందుకు వచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అత్యంత సన్నిహితుడిగా పేర్కొంటున్న కాంగ్రెస్ నాయకుడు స్వామి అలియాస్ గడ్డం నర్సారెడ్డి పేరును ప్రస్తావిస్తూ ఆరోపణలు చేశారు. నకిలీ ట్రక్ షీట్లతో ధాన్యం విక్రయాలు జరిగాయని, పూర్తి స్థాయి విచారణ నిర్వహిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆరోపణలకు కాంగ్రెస్ నాయకులు కూడా వెంటనే స్పందించారు. ధాన్యం కుంభకోణంలో బీఆర్ఎస్ నాయకుల అనుచరుల పాత్ర ఉందని ఆరోపించారు. చల్మెడ అనుచరుడి అల్లుడు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించాడని, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాడిశెట్టి ఆనందం అల్లుడు మధుకర్ పాత్రపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కుంభకోణంలో చల్మెడ పాత్ర కూడా ఉందా అనే అంశంపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఇలా ఒక పార్టీ ఆరోపణలు చేస్తే, మరో పార్టీ అంతకుమించిన ప్రత్యారోపణలతో ఎదురుదాడికి దిగుతోంది. ధాన్యం కుంభకోణం పూర్తిగా రాజకీయ రంగు పులుముకోవడంతో వేములవాడలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. ప్రెస్‌మీట్లు, ప్రకటనలు, సవాళు ,, ప్రతి సవాళ్లతో సాగుతున్న ఈ రాజకీయ పోరు ఇప్పుడు ప్రజల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. రెండు పార్టీల నేతలు పరస్పరం ఘాటు విమర్శలు చేసుకుంటూ రాజకీయ వేడి పెంచుతుండటంతో ఈ వ్యవహారం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.




# మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలపై 11 మందిపై కేసు

### అక్రమాలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**మంథని, (జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాల వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లైస్ శాఖ తనిఖీ నివేదికలు, పంచనామా, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధికారులు మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, 11 మందిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ఖీ×= చీశీ: 137 తేదీ : 25/06/2026 , సెక్షన్లు 318(4),316(4),316(5),338,61(2) కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో ట్యాబ్ ఆపరేటర్ నకిలీ ట్రక్ చిట్లు సృష్టించడం, కొనుగోలు రికార్డుల్లో అక్రమ నమోదులు చేయడం, స్టాఫ్ అసిస్టెంట్ అక్రమ ధాన్యం రవాణాకు సహకరించడం, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ప్రమేయంతో కుట్రపూరితంగా వ్యవహరించినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న 11 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు, దర్యాప్తులో మరెవరి ప్రమేయం వెలుగులోకి వచ్చినా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో మూడు లారీల్లో తరలిస్తున్న 2,213 బస్తాల (885.20 క్వింటాళ్లు) ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎనిమిది నకిలీ ట్రక్ చిట్ల ద్వారా 5,421 బస్తాల (2,168.40 క్వింటాళ్లు) ధాన్యాన్ని కొనుగోలు రికార్డుల్లో అక్రమంగా నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు. రైతుల శ్రమను దోపిడీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేలా అన్ని కొనుగోలు కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తప్పవని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆ ప్రకటనలో తెలిపారు.

# 32 బంతుల్లో సెంచరీతో సంచలనం

### కరీంనగర్ యువ క్రికెటర్ అమన్ రావు పేరాలా దూకుడు!

**కరీంనగర్ కల్చరల్, జూన్ 27, ( జనం సాక్షి) :** తెలంగాణ టీ20 (౧+20) లీగ్‌లో వరంగల్ వారియర్స్ కెప్టెన్, కరీంనగర్ జిల్లా మూలాలున్న యువ క్రికెటర్ అమన్ రావు పేరాలా చరిత్ర సృష్టించాడు. కేవలం 32 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి దేశీయ టీ20 క్రికెట్‌లో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తం 48 బంతుల్లో 142 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యపరిచాడు. ఈ విధ్వంసక ఇన్నింగ్స్‌తో దేశవ్యాప్తంగా తన పేరును మార్మోగించాడు.

౧ హైదరాబాద్‌లో క్రికెట్ ప్రయాణం 2004 జూన్ 2న అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రం మాడిసన్‌లో జన్మించిన అమన్ రావు, ఆరు నెలల వయసులోనే కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చాడు. చిన్నప్పటి నుంచే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న అతడు హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొంది తన ప్రతిభను మెరుగుపరుచుకున్నాడు. అమన్ రావు కుటుంబ మూలాలు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నంపల్లికి చెందినవి. అతని తండ్రి పేరాలా మధుసూదనరావు ఒకప్పుడు కరీంనగర్ హిందూ క్రికెట్ క్లబ్ తరపున ఆడిన క్రికెటర్. అనంతరం ఐటీ ఉద్యోగం కోసం అమెరికాకు వెళ్లిన ఆయన తిరిగి భారత్‌కు వచ్చారు. చిన్నతనంలో అన్నతో కలిసి క్రికెట్ అకాడమీకి వెళ్లడం ద్వారా అమన్‌కు ఆటపై ఆసక్తి పెరిగింది. ఏడేళ్ల వయసు నుంచే క్రమబద్ధమైన శిక్షణ ప్రారంభించిన అమన్, కరీంనగర్ హిందూ క్రికెట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ కోచ్ శరత్ ముదిరాజ్ వద్ద క్రికెట్ మెలకువలు నేర్చుకున్నాడు.

**భారత్ కోసం అమెరికా పౌరసత్వానికి గుడ్‌బై**

అమెరికాలో జన్మించిన కారణంగా అమన్‌కు అమెరికా పౌరసత్వం ఉండేది. అయితే భారత దేశీయ క్రికెట్‌లో ఆడాలంటే భారత పౌరసత్వం తప్పనిసరి కావడంతో అమెరికా పాస్‌పోర్ట్‌ను వదులుకుని భారత పౌరసత్వాన్ని స్వీకరించాడు. ఏడాదికి పైగా సాగిన ప్రక్రియ అనంతరం హైదరాబాద్ జట్టు తరపున మళ్లీ ఆడే అవకాశం దక్కింది.

# కరీంనగర్ పట్టణాన్ని ప్లాస్టిక్ నుండి కాపాడాలి

### నగరంలో లక్ష మొక్కలు నాటాలి

**ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్**



**కరీంనగర్ అర్బన్, జూన్ 27 (జనంసాక్షి) :** ప్రజలు విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీలలో పడి వేయడం వలన కరీంనగర్ పట్టణంలోని పెద్ద డ్రైనేజీలు అన్ని ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయని, దీనివలన వర్షం నీరు రోడ్లపై ప్రవహించి వరదగా మారుతుందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ తెలిపారు. శనివారం రోజు ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ... కరీంనగర్ పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చి నగరాన్ని కాపాడాలని అన్నారు. ప్రజల లోపల ఈ మార్పు రావాలంటే అన్ని మతాల పెద్దలు, అన్ని రాజకీయ పార్టీలు, వివిధ పౌర సంఘాల నాయకులు, కార్పొరేటర్లు నగరపాలక అధికారులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, యువకులు, కార్మిక సంఘాల నాయకులు, న్యాయవాదులు, టీచర్లు, డాక్టర్లు, జర్నలిస్టులు అందరూ బాధ్యత వహించి ప్రజలలో ఒక మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని అప్పుడే ఇది సాధ్యం అవుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తీయడానికి నగరపాలక సంస్థ లక్షల రూపాయలను వెచ్చించాల్సి వస్తుందన్నారు. డ్రైనేజీల మీద కప్పులు వేసి మూసి వేయడం మూలంగా సమస్య ఇంకా జటిలం అయిపోయిందని కరీంనగర్ పట్టణాన్ని అందరం కలిసి కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుకుగా ఉన్న సందుల్లో, వీలున్న రోడ్లను వెడల్పు చేయాలని, కరీంనగర్ పట్టణంలో గ్రీనరీ తక్కువగా ఉన్నది కనుక ఒక లక్ష మొక్కలు నాటి వాటిని నగరపాలక సంస్థ, ప్రజలు కలిసి కాపాడాలన్నారు. కొత్తగా ఎన్నికైన మేయర్, కార్పొరేటర్లు అందరూ ఈ దిశలో ఆలోచించి పని చేయాలన్నారు. ఈ మీడియా సమావేశంలో చిగిరి శ్రీధర్, కొంపల్లి రవీందర్, ఎడ్ల రామకుమార్, చిలువేరి రవీందర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలోగా ఆలయ అభివృద్ధి పనులు పూర్తవుతాయి

### దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వచ్చే సంవత్సరం ఆగస్టులోగా పూర్తిచేసి భక్తుల దర్శనానికి సిద్ధమయ్యే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తెలిపారు.వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనులను ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ తో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. అనంతరం శ్రీ బద్ది పోచమ్మ ఆలయం వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ వేములవాడ రాజన్న విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ 76 కోట్లు మంజూరు చేసిందన్నారు. వీటిలో రూ 25 కోట్ల పనులలో 35 శాతం జరిగిందన్నారు. అన్నదాన సత్రానికి రూ 35 కోట్లు మంజూరు కాగా,10 కోట్ల రూపాయల పనులు జరిగాయన్నారు.రాజన్న ఆలయ అభివృద్ధి కోసం మరో రూ 100 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఆమె తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రుల సహకారంతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నమన్నారు.శృంగేరి పీఠాధిపతుల సూచనలతో అభివృద్ధి చేస్తున్నమని, రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ఇప్పటికే 35 శాతమ పనులు అయ్యాయన్నారు. ఇప్పటికే ఆలయంలో అద్దాల మండపం, నివేదనశాల,అభిషేక మండపం నిర్మాణాలతో పాటు, అన్నదాన సత్రం పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.రాజన్న అంతర ఆలయ భాగాన్ని అలాగే ఉంటుందన్నారు.ఒకరిద్దరు తప్పుదోవ పట్టించే విధంగా చేస్తున్నారని,ఆలయం చెరువు కట్టపై ఉండటం వలన అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి ఆలయాన్ని విస్తరణ చేస్తున్నమన్నారు. రాజన్న ఆలయంతో పాటు శ్రీ బద్దిపోచమ్మ ఆలయం,నాంపల్లి గుట్టను అభివృద్ధి చేస్తున్నమన్నారు.ఆగమ శాస్త్ర ప్రకారం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ,పట్టణ అభివృద్ధికి రూ150 కోట్లు మంజూరు చేసిందన్నారు.రాజన్న భక్తులకు మరో వెయ్యి సంవత్సరాల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని,రూ 20 కోట్లతో శ్రీ బద్దీ పోచమ్మ ఆలయ అభివృద్ధి చేస్తున్నమన్నారు.నాంపల్లి గుట్ట పైఎయిర్‌ఫోర్స్ విమానాన్ని ఏర్పాటు చేశమని,నాంపల్లి గుట్ట ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తమన్నారు.భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యం కోసం అన్ని ఆర్జిక సేవలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి,ఆర్డిఓ కేవస్బి కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారి, తాసిల్దార్ జయంత్ కుమార్, ఆలయ ఈఈ రాజేష్, డిఈలు,అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

### నలుగురిని రూ.1 లక్ష బాండ్‌పై బైండోవర్




**కరీంనగర్ రూరల్, జూన్ 27 (జనంసాక్షి) :** అక్రమ ఇసుక తవ్వకం, రవాణాను అరికట్టేందుకు కరీంనగర్ రూరల్ పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.పోలీసులు వారిపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యల్లో భాగంగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఒక్కొక్కరిని రూ.1 లక్ష విలువైన సత్ప్రవర్తన బాండ్‌పై బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేలా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా చేసే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. అక్రమ ఇసుక తవ్వకం లేదా రవాణా గురించి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ప్రజల సహకారంతో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు కొనసాగిస్తామని సీఐ తెలిపారు.

# కాళేశ్వరం నీటితో ఎల్ఎండీని నింపాలి

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్
### సాగు, తాగునీటి కోసం ప్రభుత్వం వెంటనే కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయాలని డిమాండ్



**కరీంనగర్ టౌన్, జూన్ 27 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి వెంటనే ఎల్ఎండీ (లోయర్ మానేరు డ్యామ్) జలాశయాన్ని నింపాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులు ఎదురైనప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యం తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎల్ఎండీ జలాశయంలో నీటి మట్టం అడుగంటడంతో కరీంనగర్ నగర ప్రజలకు తాగునీరు, హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గాల రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో శనివారం బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో ఎల్ఎండీ జలాశయంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగుల కమలాకర్ పార్టీ నాయకులతో కలిసి నీరు లేక వెలవెలబోయిన జలాశయంలో ప్రతీకాత్మకంగా ఆటలు ఆడుతూ ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ చరిత్రలో జూలై నెల ప్రారంభానికి ముందే ఎల్ఎండీ నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల ప్రతిరోజూ 10 నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు రాజమండ్రి వైపు సముద్రంలో కలుస్తోందని ఆరోపించారు. ఆ నీటిని నిల్వ చేసి మేడిగడ్డ నుంచి కన్నెపల్లి, సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి వరకు తరలించి, ఎల్లంపల్లిలోని మోటార్లను ప్రారంభించి వరద కాలువ ద్వారా మిడ్ మానేరు, ఎల్ఎండీ జలాశయాలను నింపాలని సూచించారు. అలాగే మిడ్ మానేరు వద్ద ఆచంపల్లి తూము ద్వారా నీటిని విడుదల చేసి కొత్తపల్లి మండలంలోని బావుపేట, ఎలగందుల, నాగులమల్యాల, బద్దిపల్లి, కమాన్‌పూర్, శ్రీరాములపల్లి, కాజీపూర్ గ్రామాల చెరువులను కూడా నింపాలని కోరారు.ప్రభుత్వం చేతులెత్తేస్తే బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుతో కలిసి కన్నెపల్లి మోటార్లను ప్రారంభించి ప్రజలకు నీరందించే కార్యక్రమాన్ని చేపడతామని గంగుల కమలాకర్ హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రస్తుతం ఎల్ఎండీలో కేవలం ఐదున్నర టీఎంసీల నీరు మాత్రమే ఉందని, అందులో మూడు టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కావడంతో మిగిలిన రెండు టీఎంసీలతో కరీంనగర్ నగరానికి తాగునీటి అవసరాలు తీర్చడం సాధ్యం కాదన్నారు. వర్షాలు కురిసే పరిస్థితులు కూడా కనిపించడం లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే నగర ప్రజలతో పాటు ఎల్ఎండీపై ఆధారపడిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం నీటిని ఎత్తిపోసి ఏప్రిల్, మే నెలల్లోనే ప్రాజెక్టులను నింపి చెరువులకు నీరు విడుదల చేశామని, ఎల్ఎండీలో ఎల్లప్పుడూ 10.30 టీఎంసీల నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కన్నెపల్లి మోటార్లను ప్రారంభించి మిడ్ మానేరు, ఎల్ఎండీ జలాశయాలను నింపాలని, ప్రజలకు తాగు, సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 115 వాహనాలు సీజ్ చేసిన ట్రాఫిక్ పోలీసులు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 27 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం వన్‌టౌన్ కార్నర్ వద్ద చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, తప్పుగా అమర్చిన నంబర్ ప్లేట్లు, అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 115 వాహనాలను సీజ్ చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం సంబంధిత నిబంధనల మేరకు జరిమానాలు విధించడంతో పాటు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి మాట్లాడుతూ, ప్రతి వాహనానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా స్పష్టంగా కనిపించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఉండాలని తెలిపారు. నంబర్ ప్లేట్లను మార్చడం, స్టిక్కర్లు లేదా ఇతర డిజైన్లతో నంబర్లు కనిపించకుండా చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి నిబంధనల ఉల్లంఘనల పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్యతో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

## ఒకరికి తీవ్ర గాయాలు
## మరణంలోనూ వీడని స్నేహబంధం

**గంభీరావుపేట జూన్ 27(జనంసాక్షి) :** గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు శుక్రవారం రాత్రి కామారెడ్డి నుండి స్వగ్రామానికి వస్తున్న సమయంలో మాచారెడ్డి నర్మల రహదారి మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో ఒకరు అక్కడికక్కడ మృతి చెందగా మరొకరు హైదరాబాద్ ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దరు మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాదఛాయలు అమ్ముతున్నాయి వివరాలు కెళ్తే, కామారెడ్డి నుండి గంభీరావుపేటకు షిఫ్ట్ కారులో వస్తుండగా దారితప్పి కాకుల గుట్ట తండా సమీపంలోని కోళ్ల ఫారం మలుపు వద్ద మర్రిచెట్టుకు బలంగా ఢీకొనడంతో కోట అనిల్ యాదవ్ (24) అక్కడికక్కడే మృతిచెందగా, అన్వేష్ గౌడ్ (23) హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు, మరొకరు వికాస్ (22) తీవ్ర గాయాలతో ఉండగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు, ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు వీరు ముగ్గురు ఒకటే తరగతికి చెందిన క్లాస్మేట్ లు ముగ్గురిలో ఇద్దరు స్నేహితులు చనిపోవడంతో వారి స్నేహితులు తీవ్ర దుఃఖానికి గురయ్యారు.

# రేడియల్ రోడ్డు బాధితుల ఆవేదన



**షాబాద్, జూన్ 27(జనం సాక్షి):** రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మానవతా దృక్పథంతో విహరించి, నష్టపోయే ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని మండల పరిధిలోని సంకేపల్లి గూడ రైతులు శనివారం షాబాద్ తహసిల్దార్ అన్వర్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... మార్కెట్ విలువకు అనుగుణంగా నష్టపరిహారం అందించి, భూములు కోల్పోతున్న రైతుల పొలాలకు వెళ్లడానికి రోడ్డు కు అనుకొని సబ్ రోడ్డు 30 ఫీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేశమొళ్ల ఆంజనేయులు, కుమ్మరి దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తా

## తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు
## హిమాయత్ నగర్ 60 గజాల బాధితులకు సంఘీభావం తెలిపిన బక్కని నరసింహులు

**మొయినాబాద్ (జనంసాక్షి) :** ఎన్నో ఇళ్ల నుంచి పోరాటం చేస్తున్న హిమాయత్ నగర్ 60 గజాల స్థలాల బాధితుల కు అండగా ఉంటానని.. వారి సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనని తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు పేర్కొన్నారు. గతంలో తమకు కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటామని ఆందోళన చేపడుతున్న హిమాయత్ నగర్ గ్రామస్థులకు ఆయన శనివారం సంఘీభావం తెలిపి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హిమాయత్ నగర్ గ్రామస్తులకు అండగా ఉంటుందని చెప్పారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఇప్పుడు లాక్కోవడం సరికాదని.. బాధితులు ఇల్లు నిర్మించుకునేంతవరకు వారికి అండగా ఉంటామని భరోసాని ఇచ్చారు. గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సంపాదించుకోవాలని తెలిపారు. గతంలో ఎందరో మహానుమూర్తులు పేదల కోసం అనేక ఎకరాల భూములను త్యాగం చేశారని ఇప్పుడు అవి ఎక్కడికి వెళ్లాయో తెలియదన్నారు. పేదల పక్షాన తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, హిమాయత్ నగర్ గ్రామస్థులు, యువజన సంఘాల నాయకులు ఉన్నారు.

## రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

# ఉప చట్టాన్ని రద్దు చేయాలి

## పౌరహక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు ప్రొఫెసర్ జి. లక్ష్మణ్ ,ఎం నారాయణ రావు



**ముషీరాబాద్, జూన్ 27 (జనంసాక్షి) :** రానున్న ఆగస్టు 15 సందర్భంగా జైలులో ఉన్న రాజకీయ ఖైదీల విడుదలపై ప్రభుత్వాలు చొరవ చూపించి విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ జి. లక్ష్మణ్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్, బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో మావోయిస్టులతో సంబంధాలున్నాయని పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ తో పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, వివిధ వామపక్ష నాయకులు, న్యాయవాదులు , రైతు సంఘం పూర్వ విప్లవ విద్యార్థి వేదిక , తెలంగాణ ప్రజా ఫ్రంట్, పౌర వివిధ సంఘాల నాయకులు గోవర్ధన్, దశరథ్, అన్వేష్, వెంకటయ్య,భరద్వాజ, రాంబాబు, వై శ్రీహరి, ఎం నరసయ్య పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంఘాల నాయకుల పై పెట్టిన అక్రమ ఉప కేసులు అన్నింటిని ఎత్తివేయాలన్నారు. దేశవ్యాప్తంగాను, తెలంగాణ రాష్ట్రంలోనూ ఎంతోమంది మావోయిస్టులనే ఆరోపణలతో జైళ్లలో మగ్గుతున్నారన్నారు. కొందరు ఏళ్లకు తరబడి విచారణ ఖైదీలు గానే ఉన్నారన్నారు. ఒకవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాల డీజీపీలు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ చత్తీస్గడ్ ఒడిశా మహారాష్ట్రలలో మావోయిస్టు ఉద్యమం ఇక ఏమి మిగలలేదని ముగిసిపోయిందని ప్రకటించి ఉన్నారన్నారు. గత ఎనిమిది నెలల కాలంలో కేంద్ర కమిటీ సభ్యులతో సహా వందల మంది మావోయిస్టు కార్యకర్తలు ఉద్యమం వీడి బయటకు రాగా ప్రభుత్వం వారిని స్వాగతించి ఎటువంటి కేసులు లేకుండా ఇళ్లకు పంపివేసిందన్నారు. అటువంటప్పుడు ఆ మావోయిస్టులకు సహకరించారని కారణంతో లేదా ఆ ఉద్యమంలో పని చేశారని కారణంతో వందలాది సాధారణ కార్యకర్తలను ఇప్పటికి ప్రభుత్వం జైలలోనే ఉంచడం కచ్చితంగా అన్యాయమైన విషయం అన్నారు.అనంతరం ఖైదీల విడుదలతో పాటు ప్రజాస్వామ్యం కోసం పోరాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ఖైదీల విడుదల కమిటీ పేరుతో ఒక ఐక్యవేదిక నిర్మించి రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ఖైదుల విడుదల కోసం ఐక్య పోరాటం చేయాలని సమావేశంలో తీర్మానించారు.

# హైదరాబాద్లో అంతరాష్ట్ర గంజాయి ముఠా గుట్టురట్టు

## నలుగురు అరెస్ట్.. 110 కిలోల గంజాయి,2కార్లు, 4 సెల్ఫోన్లు స్వాధీనం





**శంషాబాద్,జూన్27(జనంసాక్షి) :** శంషాబాద్ జోన్ కమిషనర్ టాస్క్ ఫోర్స్, ఆదిబట్ల పోలీసుల సంయుక్త చర్యలో అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠాను పట్టుకుని నలుగురిని అరెస్టు చేశారు. శంషాబాద్ డిసిపి బి. రాజేష్ మీడియా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా 110 కిలోల గంజాయిని తరలిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టైన వారిలో మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్ గణేష్ పసల్కర్, రాజేష్ హనుమంత్ లోంఢే, షాహాజీ గోరక్ చంగన్, ఒడిశాకు చెందిన శ్రీహరి లిమా ఉన్నారు. వారి వద్ద నుంచి 110 కిలోల గంజాయి, రెండు కార్లు, నాలుగు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకోగా, వాటి విలువ సుమారు రూ.56 లక్షలుగా పోలీసులు అంచనా వేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ప్రణవ్ సింగ్, ప్రధాన సరఫరాదారు ప్రభిత్ర ప్రధాన్ పరారీలో ఉన్నట్లు వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని డిసిపి బి. రాజేష్ తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డిది హిట్లర్ పాలన

- కాంగ్రెస్ పార్టీ బంగాళాఖాతంలో కలుస్తుంది
- రాష్ట్రాన్ని నడిపే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదు
- ప్రజలు మళ్లీ కెసిఆర్ రావాలని కోరుకుంటున్నారు
- 420 హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కిండు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**మహేశ్వరం,జూన్27(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డిది హిట్లర్ పరిపాలన అన్నారు.రాష్ట్రాన్ని నడిపే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పీఎస్ వై కన్వెన్షన్ హాల్లో ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి 420 హామీలతో గద్దెనెక్కడన్నారు.రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో పొంకణాలు కొడుతున్నారన్నారు.రేవంత్ రెడ్డి ఫ్యూచర్ కే దిక్కు లేదన్నారు.రేవంత్ రెడ్డి రెన్యువల్ ముఖ్యమంత్రి అన్నారు.ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు.రెండున్నర ఏళ్ల నుంచి ప్రజలను ఇచ్చిన హామీలను,ఆరు గ్యారంటీలను అమలు చేయలేదన్నారు.తెలంగాణ ఉద్యమ ద్రోహి సీఎం అయ్యాడన్నారు.ఎక్కడికి వెళ్ళినా కాంగ్రెస్ పార్టీ పోవాలి కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ బంగాళాఖాతంలో కలుస్తుందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు ఎవ్వరు కూడా సంతోషంగా లేరన్నారు.యూరియా కోసం రైతులు గోసలు పడుతున్నారన్నారు.రేవంత్ రెడ్డి అసైన్డ్ మెంట్ భూములు పట్టాలు ఇవ్వకుండా, అసైన్డ్ మెంట్ భూములను కొనుగోలు చేస్తున్నారన్నారు.రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాక కేసీఆర్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.రేవంత్ రెడ్డి డిల్లీకి సంచులు మోస్తున్నారన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పొల్యూషన్ లేకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో ఫార్మాసిటీని ఏర్పాటు చేశామన్నారు. ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం 14000 ఎకరాల భూమిని సేకరించిందన్నారు.గతంలో తీసుకున్న భూములు ఫార్మసిటీ కోసమే తీసుకున్నామన్నారు.చట్టానికి విరుద్ధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూములను తీసుకుంటుందన్నారు.రాష్ట్రంలో కుంభకోణాల జాతర ప్రారంభమైందన్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలు సభ్యత్వ నమోదులో కథానాయకులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, శంభీపూర్ రాజు,మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్,జైపాల్ యాదవ్,మంచిరెడ్డి కిషన్ రెడ్డి,నాయకులు క్యామ మల్లేష్,కార్తీక్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్,కౌశిక్ రెడ్డి, చిలకమర్రి నర్సింహ,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తాండూరులో కంప్యూటర్ లాటరీ

## 8,333 మందిలో 581 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

**తాండూరు జూన్ 27(జనంసాక్షి)** తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని 581 మంది నిరుపేద లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ (2-బిహెచ్ కే) ఇళ్లను ప్రభుత్వం కేటాయించింది. శనివారం వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ రాండమైజేషన్ లాటరీ ద్వారా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరిగింది.జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు. తాండూరు నుంచి మొత్తం 8,333 మంది అర్హులు దరఖాస్తు చేసుకోగా, లాటరీ పద్ధతిలో 581 మందిని ఎంపిక చేశారు.

మానవ ప్రమేయం లేకుండా ఎంపిక...

ఈ ప్రక్రియలో ఎటువంటి మానవ ప్రమేయం లేకుండా పూర్తిగా కంప్యూటర్ రాండమైజేషన్ సిస్టమ్ను ఉపయోగించారు. పారదర్శకత కోసం మొత్తం ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. 8,333 మంది దరఖాస్తుదారుల సమక్షంలో, సాంకేతిక సిబ్బంది నేతృత్వంలో లాటరీ తీశామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎంపికైన 581 మంది లబ్ధిదారుల పూర్తి జాబితాను తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రదర్శిస్తారు .ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతారు. అనర్హులు ఉన్నట్లు తేలితే వేచి ఉన్న జాబితాలోని వారికి అవకాశం కల్పిస్తారు. అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేశామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు అధికారిక ప్రకటన కోసం మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంపూర్లో ప్రొటోకాల్ రగడ

## స్పీకర్ కాన్వాయ్ ని అడ్డుకున్న బిజెపి నాయకులు
## శిలాఫలకంపై ఎంపీ పేరుకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆందోళన



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 27 (జనంసాక్షి)** రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా తమ నాయకున్ని మూడుసార్లు అవమానించారని తప్పు సరి చేసుకోవాలని సూచించిన అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన కారణంగా దానిని నిరసిస్తూ తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కాన్వాయ్ ని బిజెపి నాయకులు శనివారం నాడు అడ్డుకున్నారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కో ట్ పల్లి మండలం కరీంపూర్ గ్రామంలో సర్వ శిక్ష అభియాన్ పథకం కింద నిర్మించిన కేజీ బివి కళాశాల భవన ప్రారంభోత్సవం సందర్భంగా జరిగింది. దాదాపు 4.15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన కేజీబీవీ బాలికల కళాశాలను రాష్ట్ర తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభోత్సవం చేశారు. ఈ భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తున్న సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డిని అధికారులు తీవ్రంగా అవమానించారని బిజెపి జిల్లా ఇన్చార్జి నందు ఆధ్వర్యంలో బిజెపి సర్పంచులు నాయకులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కాన్వాయ్ ని అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి భారత ప్రభుత్వ చీఫ్ విప్ గా ఉన్న ఆయనకు ప్రోటోకాల్ ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. సర్వ శిక్షణ అభియాన్ ఎన్ ఆర్ జి ఎస్ కింద దాదాపు 35 కోట్ల అంచనాతో రోడ్డు కళాశాల భవన నిర్మాణానికి నిధులు ఇస్తే కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా శిలాఫలకంపై పేరు వేశారని ఆందోళనకు దిగారు. ఈ విషయమై ముందుగానే గమనించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించాలని వారు ఆరోపించారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా చూసుకునే విధంగా అధికారులను ఆదేశించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ దృష్టికి తెచ్చారు. అయితే తాము అన్ని విషయాలు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తో మాట్లాడామని గొడవ రాజకీయం చేయడం మంచిది కాదని స్పీకర్ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బిజెపి నాయకులకు సూచించారు. అయినా వారు వినిపించకపోవడంతో ఏం చేస్తారని స్పీకర్ వారిపై మండిపడ్డారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ముద్ర తో కేజీబీవీ బాలికల కళాశాల స్పెషల్ ఆఫీసర్ ప్రిన్సిపల్ పల్లవి రెడ్డి ప్రముఖుల పేర్లు ముద్రించకుండా ఆహ్వాన పత్రాన్ని వేశారు. రాష్ట్ర జిల్లాకు సంబంధించిన ఉన్నతాధికారుల పేర్లు ప్రజా ప్రతినిధుల పేర్లు స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లు వేయకుండా ఆహ్వాన పత్రాన్ని ముద్రించి స్టేటస్ పెట్టుకున్నారు. ఈ విషయమై సర్వత్ర చర్చ జరుగుతుంది. కేజీబీవీ బాలికల కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడకు వచ్చిన వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులకు అవమానం జరిగింది. కనీసం కూర్చోవడానికి కుర్చీలు వేయించాలని పరిస్థితిలో కేజీబీవీ అధికారులు ఉన్నారు. కాగా ఈ విషయాలన్నీ ఈనెల 30న జరిగే దిశ సమావేశంలో ఎండగడతామని బిజెపి నాయకులు నందు తెలియజేశారు. అంతేకాకుండా జిఐడిలో ఫిర్యాదు చేస్తామని మీడియా తెలియజేశారు.

# అనంతగిరిలో ఉప్పల్ బాలు వికృత చేష్టలు

## ప్రమాదకర స్టంట్ పోలీసుల కేసు నమోదు
## ప్రజలకు క్షమాపణ చెప్పిన ఉప్పల్ బాలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 27 (జనం సాక్షి):** పవిత్రమైన పుణ్యక్షేత్రం పక్కన పచ్చని చెట్ల మధ్య ఉన్న తార్ రోడ్డుపై ఉప్పల్ బాలు శనివారం నాడు హల్చల్ చేశాడు. వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్ లోని తారు రోడ్డుపై జరిగింది. ఉప్పల్ బాలు కొత్త కారు కొనుగోలు చేసి అదే కారుపై ప్రమాదకరమైన ఇంస్టాగ్రామ్ స్టెంట్స్ చేశాడు. రోజు వేలాదిమంది పర్యాటకులు శ్రీ అనంత పద్మనాభ స్వామి వారిని దర్శించుకుని అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్ అందాలు చూసి పులకరించి పోతారు. ఎప్పుడు రద్దీగా ఉండే అనంతగిరి ఘాట్ సెక్షన్ తార్ రోడ్డుపై ఉప్పల్ బాలు వికృత చేష్టలు చేస్తూ కొత్త కారుపై రీల్స్ చేశాడు. కారుపై వింత విన్యాసాలు చేస్తూ రక్షించండి రక్షించండి అంటూ కేకలు వేశాడు. ఈ సన్నివేశాలన్నీ యువతను పెడదారి పట్టించే విధంగా ఉండడంతో ప్రజలు ఉప్పల్ బాలు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పవిత్ర పుణ్యక్షేత్రం అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయానికి దగ్గరలో డ్రెస్ కోడ్ పాటించకుండా తార్ రోడ్డుపై వింత చేష్టలతో విన్యాసాలు చేస్తూ రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఇబ్బందులకు గురి చేశాడు. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అటవీ శాఖ నిబంధన ప్రకారం ఉప్పల్ బాలుపై చర్యలు చేపట్టారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా, యువతకు ప్రమాదకరమైన ఇంస్టాగ్రామ్ స్టంట్ చేసిన కారణంగా ఆయనపై సివిల్ పోలీసులు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. రిజర్వ్ ఫారెస్ట్ లో నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. ఇదే విషయమై ఉప్పల్ బాలు ప్రజలకు క్షమాపణ చెప్పారు. కొత్త కారు కొనుగోలు చేసి పర్యటన కోసం అనంతగిరికి వచ్చామని ఆనందంలో ఇంస్టాగ్రామ్ స్టంట్ కొన్ని వాటి వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగితే క్షమించాలని సోషల్ మీడియా ద్వారా కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఫుట్పాత్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : సిఎంసి



**శేరిలింగంపల్లి, జూన్ 27 (జనంసాక్షి) :** ఫుట్ పాతులు, రోడ్లకు ఇరువైపులా ఉండే పేవ్ మెంట్లు కేవలం పాదాచారులు, స్థానిక కాలనీల ప్రజల రాకపోకలకు సదుపాయంగా ఉండాలి కానీ, అడ్డగోలుగా ఆక్రమించి దానిపై అక్రమ వ్యాపారం చేస్తామంటే చూస్తూ సహించేది లేదని, ఉక్కు పాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో శనివారం ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించడంద్వారా ఎక్కడికక్కడ ఫుట్ పాత్ ల ఆక్రమణలను తొలగించడం జరిగింది. ఇందులో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్ పరిధిలో గండిపేట ఎక్స్ రోడ్ నుండి సాయిబాబా దేవాలయం వరకు, పటాన్ చెరువు సర్కిల్ పరిధిలో పటాన్ చెరువు మెయిన్ రోడ్డు వెంబడి, అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీహెచ్ఈఎల్ సర్కిల్ నుండి రామచంద్రాపురం నాగులమ్మ ఆలయం వరకు ఫుట్ పాత్ ఆక్రమణలను ఎక్కడికక్కడ తొలగించారు. ఇక శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధిలో మంజీరా పైప్ లైన్ రోడ్డు లో, శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో టెలికాం నగర్ ప్రధాన రహదారి వెంట దాదాపు 11 కిలోమీటర్ల మార్గంలో మొత్తం 197 ఆక్రమణలను తొలగించినట్లు సైబరాబాద్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు వివరించారు. దీంతోపాటు కూడా టెక్నో ఎంక్లేవ్ రోడ్, ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధి మిత్ర హిల్స్ రోడ్ తదితర ప్రాంతాలలో 3.16 కిలోమీటర్ల నిడివిలో 105 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో పలువురు అధికారులు మాట్లాడుతూ ఫుట్ పాత్ వ్యవస్థను ఒక గొప్ప లక్ష్యంతో ఆవిష్కరించడం జరిగిందని, ఆ ఆశయ సాధనకు తూట్లు పొడుస్తూ ఈ మధ్యకాలంలో కొందరు దౌర్జన్యంగా వాటిని ఆక్రమించి ఇష్టానుసారంగా అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఇది ఓ వైపు సిఎంసి అధికారులకు, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి సైతం చెడ్డపేరును ఆపాదిస్తున్నందున ఇకముందు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫుట్ పాత్ ఎంక్రోచ్మెంట్లను ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు.

# డబుల్ ఓట్లకు చెక్ పెట్టాల్సిందే..

## షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి)** డబుల్ ఓట్లకు చెక్ పెట్టాల్సిందేనని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండాలంటే ప్రతి పౌరుడు ఒకే చోట మాత్రమే ఓటరుగా నమోదు కావాలని, డబుల్ ఓట్లకు ఎలాంటి అవకాశం ఉండకూడదని ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది శనివారం ఎమ్మెల్యేకు ఎన్యూమరేషన్ ఫారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడాతు భారత ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఓటరు స్వచ్ఛందంగా ఒకే నియోజకవర్గంలో ఓటరుగా నమోదు కావాలని, రెండు చోట్ల ఓటు ఉండటం చట్టవిరుద్ధమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి శాశ్వతంగా నివసిస్తున్న అర్హులైన వారందరికీ ఓటరు నమోదు హక్కు ఉందని, అయితే బోగస్ ఓట్ల నమోదుకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు బోగస్ ఓట్లను నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించిన ఆయన, అలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. నిజమైన ఓటరుకు ఎలాంటి అన్యాయం జరగకుండా, ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు, సూపర్వైజర్లు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నారని, అవసరమైతే పలుమార్లు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. తాను కూడా నిబంధనలను పాటిస్తూ ఫారం పూర్తి చేస్తానని వెల్లడించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలు, బీఎల్ఓలు చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. అనంతరం షాద్ నగర్ మున్సిపాలిటీలోని 18 వ వార్డులో ఇబ్బందితో సిబ్బందితో కలిసి ఎన్యూమరేషన్ ఫారాలను ఎమ్మెల్యే ఓటర్లకు పంపిణీ చేశారు.


# నాలుగు తరాల భూ వివాదం



▫ తీర్పు వెలువరించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 27 (జనంసాక్షి) :** నాలుగు తరాలుగా కొనసాగుతున్న ఒక భూవివాదానికి సుప్రీం కోర్టు తాజాగా ఫుల్ స్టాప్ పెట్టింది. భూమికి సంబంధించిన 1957 నాటి సేల్ డీడ్ చట్టబద్ధమేనంటూ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి అంజరియాలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించడంతో వివాదానికి ఫుల్ స్టాప్ పడింది. ఈ కేసులో అప్పీలు చేసుకున్న సరాఫత్ అలీ పూర్వీకులు 1957లో ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో కొంత భూమిని కొనుగోలు చేశారు. అప్పటికి సరాఫత్ అలీ మైనర్. నాటి నుంచీ ఆ భూమి సరాఫత్ అలీ కుటుంబం ఆధీనంలోనే ఉంది. భూమిని సరాఫత్ పూర్వీకులకు అమ్మిన కొందరు అభ్యంతరం చెప్పడంతో సేల్ డీడ్ జరిగినా మ్యూటేషన్ మాత్రం నిలిచిపోయింది. 1984లో వారు తమ అభ్యంతరాలను వెనక్కు తీసుకోవడంతో మ్యూటేషన్ కూడా పూర్తయ్యింది. అయితే, 1991లో ప్రభుత్వం భూమి ఏకీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో తనను భూమిదారుగా గుర్తించాలని సరాఫత్ దరఖాస్తు చేసుకున్నారు. 1993లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ హక్కులను గుర్తించారు. అయితే, సరాఫత్ భూమిపై కో టెన్యూర్ హక్కులున్న మరికొందరు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో 1999లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించారు. యూపీ జమిందారీ భూములు రద్దు చట్టం ప్రకారం 1957 నాటి సేల్ డీడ్ చెల్లదన్నారు. అంతేకాకుండా నాటి సేల్ డీడ్‌పై సంతకం చేసిన సాక్షి వివరాల్లో స్పష్టత లేకపోవడంతో సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. చివరకు హైకోర్టులో కూడా సరాఫత్ కుటుంబానికి చుక్కెదురైంది. ఈ కేసులో సుప్రీం కోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. సాక్షి వివరాల్లోని స్వల్ప లోపాల ఆధారంగా సేల్ డీల్ చెల్లదని చెప్పలేమని పేర్కొంది. సేల్ డీడ్ ఫోర్జరీ జరిగిందనే ఫిర్యాదు కూడా లేకపోవడాన్ని ఈ సందర్భంగా కోర్టు పేర్కొంది. జమిందారీ చట్టానికి 1981లో చేసిన సవరణలు 1957కు వర్తించవని కూడా పేర్కొంది. నాటి సేల్ డీడ్ చెల్లుతుందంటూ తీర్పు వెలువరించింది.

## శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచారం



▫ స్థానికుల సమాచారంతో అధికారుల వేట

**హైదరాబాద్, జూన్ 27 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోని చిన్మయ స్కూల్ సమీపంలో చిరుత కనిపించిందంటూ స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చిరుత ఆనవాళ్లు, పాదముద్రలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అవసరమైతే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. చిరుత కనిపించిందనే వార్తతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూల్ పరిసర ప్రాంతాలు, నివాస కాలనీల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అయితే ఇప్పటివరకు చిరుత సంచారంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, చిరుత ఆనవాళ్లు లభించిన తర్వాతే స్పష్టమైన సమాచారం అందజేస్తామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా, ఏదైనా అనుమానాస్పద జంతువు కనిపిస్తే వెంటనే అటవీశాఖ లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా



▫ ఈ- ఆటోలను ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 27 (జనంసాక్షి) :** దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. 'దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కేతన్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం

▫ చేతన్‌తో సియాగోయల్ ప్రేమకు క్రికెటే కారణం

**ముంబై, జూన్ 27 (జనంసాక్షి) :** పుణెకు చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, క్రికెట్ కోణం వెలుగులోకి వచ్చింది. కేతన్ హత్య కేసులో నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరీల మధ్య ప్రేమ చిగురించడానికి కారణం క్రికెట్ అని తెలుస్తోంది. సియా గోయల్ సోదరుడు సాహిల్ గోయల్‌ను పోలీసులు 10 గంటలకుపైగా విచారించారు. విచారణ సందర్భంగా గోయల్ పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. ఆ వివరాల ప్రకారం.. సాహిల్ క్రికెట్ మ్యాచ్‌లు ఆడేవాడు. క్రికెట్ మ్యాచ్‌లు చూడ్డానికి సియా తరచూ వెళుతుండేది. ఈ నేపథ్యంలోనే చేతన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఓ సారి కామన్ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన దివాళీ పార్టీలోనూ ఇద్దరూ కలిశారు. దీంతో ఇద్దరి మధ్యా స్నేహం బలపడి ప్రేమగా మారింది. సియా, చేతన్ ప్రేమించుకుంటున్న సంగతి సాహిల్‌కు తెలుసు. కేతన్‌తో సంబంధం మాట్లాడుతున్నపుడు సియా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని సాహిల్ అనుకున్నాడు. కానీ, సియా అలా చేయలేదు. కేతన్ అంటే ఇష్టం లేనట్లు ఆమె అస్సలు ప్రవర్తించలేదు. కేతన్‌తో పెళ్లి కుదిరిన తర్వాత సియా.. చేతన్‌తో మాట్లాడటం కానీ, తిరగటం కానీ, సాహిల్ చూడలేదు. ఇవే విషయాలు సాహిల్ పోలీసులకు చెప్పాడు. పోలీసులు సియా, చేతన్‌ల కాల్ రికార్డ్స్ పరిశీలించగా.. జనవరి నెల నుంచి మర్డర్ జరిగిన తేదీ వరకు ఇద్దరూ 2 వేలకుపైగా ఫోన్ కాల్స్ చేసుకున్నట్లు గుర్తించారు. దాదాపు 238 గంటల పాటు ఇద్దరూ మాట్లాడుకున్నారు. అయితే, సియా లాయర్ మాత్రం సియా, చేతన్‌లు స్నేహితులు మాత్రమేనని అంటున్నాడు.

## విమానంలో క్యాన్సర్ బాలిక మృతి

▫ హైదరాబాద్‌కు చికిత్స కోసం వస్తుండగా ఘటన

**హైదరాబాద్, జూన్ 27 (జనంసాక్షి) :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఇథియోపియా నుంచి క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్న ఓ బాలిక మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయింది. విమాన ప్రయాణ సమయంలో బాలిక ఆరోగ్యం ఒక్కసారిగా విషమించింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో విమాన సిబ్బంది అత్యవసర వైద్య సహాయం అందించేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు విమానం ల్యాండైన వెంటనే బాలికను శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే బాలిక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో విమానాశ్రయంలో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారి తల్లిదండ్రుల రోదనలు ఎయిర్‌పోర్టు ఆవరణలోని ప్రయాణికుల హృదయాలను కలిచివేశాయి. బాలిక మృతికి గల కచ్చితమైన కారణాలపై వైద్యులు, సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

## కుమారుడిని కోచింగ్ నుంచి తీసుకువస్తూ ...
## వైజాగ్ రైల్వే స్టేషన్‌లో పాలకుర్తికి చెందిన వ్యక్తి మృతి



**పాలకుర్తి, జూన్ 27(జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్లో ఐఐటీ కోచింగ్ తీసుకుంటున్న కుమారుడుని స్వగ్రామానికి తీసుకువచ్చే క్రమంలో విశాఖపట్టణం రైల్వే స్టేషన్లో మండల కేంద్రానికి చెందిన ఓ తండ్రి గుండె ఆగిపోయింది. కుమారుడిని ఉన్నత స్థానం లో చూడాలని తలచిన ఆ తండ్రి గుండె అర్థాంతంగా ఆగిపోయింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. జనగాం జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన రాపోలు లక్ష్మన్ (48) స్థానికంగా రెండే దశాబ్దాల నుంచి ఫోటో స్టూడియో నిర్వహిస్తూ జీవనం సాగిస్తు న్నాడు. ఇటీవల ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడిని ఇటీవల పశ్చిమబెంగాల్ లోని ఖరగ్పూర్లో ఐఐటీ కోచింగ్ ఇప్పిస్తున్నాడు. కోచింగ్ పూర్తికా వడంతో కుమారుడుతో పాటు గురువారం ఉదయం బెం గాల్ నుంచి రైలులో బయలుదేరాడు. ఈ క్రమంలో విశాఖపట్టణంలో దిగి వరంగల్ కు వెళ్లే క్రమంలో మరో రైలు కోసం స్టేషన్లో వేచి చూస్తున్నాడు. కొంత సమయం తర్వాత వందే భారత్ ఎక్స్ప్రెస్ స్టేషన్ కు చేరుకోగానే ప్లాట్ ఫామ్ పై వేచి ఉన్న లక్ష్మన్ తన భోగి కోసం నలుగు అడుగులు పరుగెత్తాడు. ఆయాసం వస్తుండడంతో పరుగెత్తడంతో ప్లాట్ఫామ్ పై కుప్పకూలాడు. కుమారుడు సోముసాయి తండ్రి వద్దకు చేరుకొని ఎంత సేపు పిలిచినా ఉలుకు పలుకు లేక పోవడంతో భోరున విలపించాడు. రైల్వే సిబ్బంది స్థానికులు గమనించి లక్ష్మన్ మృతి చెందాడని తెలిపారు. ఫోటో గ్రాఫర్గా స్థానికుల మన్ననలు అందుకున్న లక్ష్మన్ గత కొంతకాలంగా పలు పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో జర్నలిస్టుగా సైతం పేరొందాడు. మృధు స్వభావిగా పేరు ఉన్న ఆయన మృతితో పాలకుర్తితో పాటు బమ్మెరలో విషాద చాయలు అలుముకు న్నాయి. అతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

## అమీనాపూర్‌లో మహిళ, ఇద్దరు పిల్లలతో అదృశ్యం



▫ జాగ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు

**నిజామాబాద్, జూన్ 27 (జనంసాక్షి) :** వేల్పూర్ మండలం అమీనాపూర్‌లో మహిళ సహా ఇద్దరు చిన్నారులు అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడం సంచలనం సృష్టిస్తోంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న వేల్పూర్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇద్దరు పిల్లలతో సదరు మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. మహిళ సెల్‌ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్‌ఆఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎంత వెతికినా ఎక్కడా ఆమె జాడ తెలియరాలేదు. దీంతో బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి వేల్పూర్ పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహిళ, చిన్నారుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. వారి వివరాలు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వేల్పూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## వర్షాకాలం పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి



▫ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 27 (జనంసాక్షి):** వర్షాకాలం అయినందున అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆసుపత్రిలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి వార్డులు, మందుల నిల్వలు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న సౌకర్యాలు, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేస్తుందని, ఈ క్రమంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సరైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, నీటి నిల్వలు లేకుండా, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. హాజరు పట్టిక పరిశీలించి గైర్హాజరు అయిన వైద్యులు, ఆసుపత్రి పర్యవేక్షకులు విధులకు రానందున ఉన్నతాధికారులకు చర్యల నిమిత్తం సిఫారసుతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో రైతు మృతి



**పాలకుర్తి, జూన్ 27 (జనంసాక్షి) :** వరి పంట సాగు చేసేందుకు నీరు అవసరం కాగా, దానిపై ట్రాన్స్ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేస్తుండగా. ప్రమాదావ శాత్తు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తో రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని ముత్తారంలో జరిగింది. ఎస్సై దూలం పవన్కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ముత్తారం గ్రామానికి పొర్ల మల్లయ్య (43) అనే రైతు తనకున్న వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన పొలంలో నారు పోసుకున్న రైతు దానికై నీళ్లు పెట్టేందుకు యత్నించగా ట్రాన్స్ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పోవడం వల్ల విద్యుత్ సరఫరా కావడంలేదని మోటార్ పోయడం లేదని గ్రహించాడు. పొలం సమీపంలోని ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్ వేస్తుండగా ప్రమాదావశాత్తు విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో రైతు మల్లయ్య విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే తనువు చాలించాడు. ఈ క్రమంలో స్థానిక రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించగా మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీ హర్ష కంటి దవాఖానలో ప్రతి బుధవారం ఉచిత కంటి ఆపరేషన్లు

**ములుగు,జూన్27(జనం సాక్షి):** పాల్ సాబ్ పల్లి రోడ్డు,పాత పోలీస్ స్టేషన్ పక్క గల్లిలో గల శ్రీహర్ష కంటి దవాఖాన ఆధ్వర్యంలో ప్రతి బుధవారం ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.కంటి శస్త్రచికిత్సలు హైదరాబాద్‌లో నిర్వహిస్తామని, శస్త్రచికిత్సకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలు వెంట తెచ్చుకోవాలని కంటి వైద్యులు సూచించారు.ఉచిత ఆపరేషన్లకు సంబంధించిన పూర్తి వివరాలు,రిజిస్ట్రేషన్ కోసం డాక్టర్ నంబర్ 9848181314 కు సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సింగరేణి కార్మికుల హక్కుల రక్షణకు వెనకాడం

▫ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**గోదావరిఖని, జూన్ 27 (జనంసాక్షి) :** సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ సమ్మెకైనా వెనుకాడదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జీడీకే-11వ ఇన్క్లైన్ లో శనివారం జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. సింగరేణి లో కార్మికుల సమస్యల పరిష్కారం లో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించేందుకు ఏఐటీయూసీ ముందుంటుందన్నారు. సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం గా యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో ఒప్పుకున్న వాటిని యాజమాన్యం అమలు చేయనందుకు నిరసిస్తూ 31 డిమాండ్ ల పై సమ్మె నోటీసు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై ఈ నెల 25న హైదరాబాద్ లో ఆర్ఎల్సీ వద్ద చర్చలు జరిగాయని, జూలై 10 లోపు పరిష్కారం చేసుకోవాలని ఏఎల్సీ యాజమాన్యానికి సూచించించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం సమ్మె నోటీసులోని డిమాండ్ ల పై పరిష్కారం చేయాలని, లేకుంటే అన్ని కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాత సమ్మెకు పిలుపునిస్తామని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వీరభద్రం, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు సిద్ధమల్ల రాజు, నాయిని శంకర్, గొడిశల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలు షురూ!

**హనుమకొండ ప్రతినిధి జూన్ 27 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ మొదటి సంవత్సరం బిఏ, బికాం, బిఎస్సి ప్రవేశాల ప్రక్రియ శనివారం అధికారికంగా ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల విధానంలో మొదటి, రెండవ, మూడవ దశల కేటాయింపుల ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు శనివారం నుంచి కళాశాలలో ప్రత్యక్ష ప్రవేశాలు పొందుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించి, ఎంపికైన విద్యార్థులకు ప్రవేశ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, కళాశాలలో మొత్తం 1,770 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయని, జులై 4 వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు తమకు కేటాయించిన తేదీల్లో అన్ని ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరై ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

## బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలి



▫ ఓటరు జాబితా సమగ్ర సవరణలో ప్రతి కుటుంబం బాధ్యతగా పాల్గొనాలి

▫ ములుగు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు ప్రతినిధి, జూన్ 27(జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇంటింటికీ వచ్చే బూత్ స్థాయి అధికారులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జిల్లాలో ప్రతి ఇంటిని సందర్శిస్తూ బీఎల్ఓలు ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి కుటుంబానికి ఎన్యూ మరేషన్ ఫారమ్ అందజేయ బడుతుందని, అందులో కుటుంబ సభ్యుల వివరాలు, పేరు, వయస్సు, చిరునామా, ఓటరు నమోదు సంబంధిత వివరాలను పరిశీలించి సరైన సమాచారం అందించాలని సూచించారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే తొలగించడం, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, కొత్తగా అర్హత పొందిన ఓటర్లను చేర్చడం, తప్పులున్న వివరాలను సరిచేయడం వంటి ముఖ్యమైన ప్రక్రియలు ఈ కార్యక్రమంలో భాగమని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు 303 మంది బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరుగుతూ సమాచారం సేకరిస్తుండగా, వారి పనిని పర్యవేక్షించేందుకు 30 మంది సూపర్వైజర్లు పనిచేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కార్యక్రమ నిర్వహణ కోసం 9 మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులు , మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఒక ఎన్నికల నమోదు అధికారి ప్రత్యేక బాధ్యతలతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎన్నికల సిబ్బందికి ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా పూర్తి వివరాలు అందించి సహకరించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో కోరారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370